శ్రీకాళహస్తీశ్వర శతకము
రూ॥40/-
పేజీలు:48

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

రేవంత్ వైపే జనం : 'గ్రోక్' విశ్లేషణ
జడ్జి ఇంట్లో కరెన్సీ కట్టలపై హోంమంత్రి మౌనం ఎందుకు?
జమ్మూకశ్మీర్ కథువాలో ఎన్‌కౌంటర్
లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 118 | శుక్రవారం | 28-03-2025 | ఖమ్మం    Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar    పేజీలు: 12+8 | వెల రూ. 5.00



## అసెంబ్లీ నిరవధిక వాయిదా

11 రోజులు 97.32 గంటల పాటు జరిగిన సమావేశాలు

12 సవరణ బిల్లులకు సభ ఆమోదం

ప్రజాపక్షం/హైదరాబాద్

శాసనసభ, శాసనమండలి 2025–26 వార్షిక బడ్జెట్ సమావేశాలు గురువారం రాత్రి నిరవధికంగా వాయిదాపడ్డాయి. శాసనసభ బడ్జెట్ సమావేశాలు మొత్తం 11 రోజులు, 97.32 గంటల పాటు జరిగాయి. ఈ సమావేశాలలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ చట్టాలకు సంబంధించిన 12 సవరణ బిల్లులను సభ ఆమోధించింది. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన, గోర్‌బోలీ భాష, ఎస్‌సి వర్గీకరణ అంశాలపై సభ మూడు తీర్మానాలు చేసింది. ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన 16 ప్రశ్నలకు మంత్రులు సమాధానమిచ్చారు. సభ్యులు 27 ప్రశ్నలకు, అదే విధంగా 79 అన్ స్టార్డ్ ప్రశ్నలను సభ ముందుంచారు. సభ్యులు 146 ఉపన్యాసాలు చేశారు. గురువారం రాత్రి 9.10 గంటలకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. సభలో ప్రశ్నోత్తరాల సమయంలో, జీరో అవర్‌లో సభ్యులు అడిగిన ప్రశ్నలు, ప్రస్తావించిన అంశాలకు సంబంధిత శాఖల మంత్రులు సమాధానాలను శాసనసభ కార్యదర్శి ద్వారా పంపాలని స్పీకర్ ఆదేశించారు. శాసనసభ నిరవధికంగా వాయిదాపడే సమయానికి సభలో వివిధ పార్టీల బలాబలాలను స్పీకర్ ప్రకటించారు. ఇందులో కాంగ్రెస్ సభ్యుల సంఖ్య– 65, బిఆర్‌ఎస్ –38, బిజెపి –8, ఎఐఎంఐఎం–7, సిపిఐ –1 మొత్తం 119 సభ్యులు ఉన్నట్లు స్పీకర్ వివరించారు.



2014 నాటికి రాష్ట్రాన్ని పరిపాలించిన 16 మంది ముఖ్యమంత్రులు చేసిన మొత్తం అప్పు రూ.90,160 కోట్లు. 2023 డిసెంబర్ నాటికి గత పదేళ్లల్లో బిఆర్‌ఎస్ చేసిన అప్పులు, పెండింగ్ బిలుల్లు మొత్తం రూ.8,19,151 కోట్లు. అందులో రూ. 6,69,257 కోట్లు అప్పులు కాగా వివిధ శాఖల్లో పెండింగ్ బిల్లులు రూ.1,49,894 కోట్లు. బిఆర్‌ఎస్ సాధించిన ఘనత ఏమిటో చెప్పాలి. మేము అధికారంలో వచ్చిన పదిహేను నెలల్లో చేసిన అప్పు రూ.1,58,041 కోట్లు. ఇందులో పదేళ్లలో వాళ్లు చేసిన అప్పులకు అసలు, వడ్డీ కలిపి మేము తిరిగి చెల్లించిన మొత్తం రూ. 1,53,359 కోట్లు.

– సిఎం రేవంత్‌రెడ్డి

# ప్రతీకార రాజకీయం చేస్తే జైల్లో ఉండేటోళ్లు



## కెటిఆర్ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం

- ఎంపిగా ఉన్నప్పుడు డ్రోన్ ఎగురవేశారంటూ జైలులో పెట్టి చిత్రహింసలు పెట్టారని ఆవేదన
- తాము కక్షసాధింపునకు పాల్పడడం లేదని వెల్లడి
- శాసనసభలో ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చలో అధికార విపక్షాల మధ్య విమర్శలు ప్రతివిమర్శలు

ప్రజాపక్షం/హైదరాబాద్

శాసనసభలో గురువారం జరిగిన ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా ప్రతిపక్ష, అధికార పక్షాల మధ్య విమర్శలు, ప్రతివిమర్శలు చోటుచేసుకున్నాయి. రాష్ట్ర మాజీ మంత్రి బిఆర్‌ఎస్ సభ్యులు కె.తారకరామారావు (కెటిఆర్), ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. తమపై కక్ష, పగ, ప్రతీకారం పెంచుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వమే నష్టపోతుందని, కక్షపూరిత రాజకీయాలు మానుకోవాలని కెటిఆర్ వ్యాఖ్యానించగా, ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందిస్తూ తాము కూడా కక్షపూరిత రాజకీయాలను చేస్తే ఇప్పటికే కెటిఆర్‌తో పాటు కెసిఆర్ కుటుంబం మొత్తం చంచల్‌గూడ, చర్లపల్లి జైళ్లలో ఉండేవారన్నారు. అనుమతి లేకుండా ఎవరైనా డ్రోన్ ఎగరవేస్తే రూ.500 జరిమానా విధిస్తారని, కానీ, అప్పట్లో ఓ జర్నలిస్టు డ్రోన్ ఎగరవేయగా, అప్పుడు ఎంపిగా ఉన్న తాను డ్రోన్ ఎగరవేశానని జైల్లో పెట్టి చిత్రహింసలకు గురిచేశారని, 16 రోజులు రాత్రివేళ్లలో నిద్రపోకుండా, లైటు వెలుతురులో బల్లుల మధ్య సహజీవనం చేశానని, తనను తీవ్రంగా వేధించారని సిఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తన కూతురు పెళ్లికి కూడా తాను పెరోల్‌పై వచ్చి మళ్లీ జైలుకు వెళ్లానని తెలిపారు. 16 రోజులు నన్ను డిటెన్షన్ సెల్‌లో ఒక మనిషి కూడా కనిపించకుండా మమ్మల్ని నిర్బంధించినా ఆ కోపాన్ని బిగపట్టుకున్నాం తప్ప కక్ష సాధింపునకు పాల్పడలేదన్నారు. నా మీద కక్ష చూపిన వారిని దేవుడే ఆసుపత్రి పాలు చేశాడని సిఎం అన్నారు. అంతకుముందు సభలో ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన ద్రవ్య వినిమయ

తరువాయి 2లో

## యథాతథంగా లోక్‌సభ సీట్లు

- పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజనకు జనాభా ఒక్కటే ప్రామాణికం కావొద్దు
- శాసనసభలో తీర్మానం
- అసెంబ్లీ సీట్లు 153కు పెంచాలి
- అందుకు అవసరమైన రాజ్యాంగ సవరణ చేయాలి
- కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రం విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనకు జనాభా ఒక్కటే ప్రామాణికం కాకూడదని, పార్లమెంట్ సీట్ల సంఖ్యను యథాతథంగా కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కోరింది. రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుని ఇప్పుడున్న నియోజకవర్గాలలో సరిహద్దుల మార్పులు చేర్పులు చేయాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు తెలంగాణ శాసనసభలో గురువారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా అమోదించింది. తొలుత సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రవేశపెడుతూ ''లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన దిశగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు, అనుసరించనున్న

తరువాయి 2లో

## అవినీతి కేసుల్లో తొందరలోనే జైలుకు

- 'ప్రాజెక్ట్ ఫామ్‌హౌస్'లపైన ఎమ్మెల్యేలతో నిజనిర్ధారణ కమిటీ వేద్దామా?
- బిఆర్‌ఎస్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్
- కాళేశ్వర్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీ నివేదికపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చర్చిద్దాం
- రీడిజైన్ పేరుతో ఎంత కొల్లగొట్టారో వెల్లడిస్తానని వ్యాఖ్య

ప్రజాపక్షం/హైదరాబాద్

అత్యంత అవినీతికి పాల్పడిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌పైన ఏకసభ్య కమిషన్ విచారణ జరుగుతోందని, విద్యుత్ ముసుగులో పవర్ ప్రాజెక్ట్ పేరుతో వేల కోట్ల రూపాయాలను కొల్లగొట్టిన విషయంలో కమిషన్ నివేదిక ఇచ్చిందని, అవినీతికి పాల్పడినందుకు శిక్షించాలని ఆ నివేదికలో పొందుపర్చిందని, ఇందులో తొందరలోనే 'మీరు' జైలుకు పోతారని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు.రంగనాయకమ్మ, కొండపోచమ్మ ప్రాజెక్ట్‌ల వద్ద ఎవరి ఫామ్‌హజ్ లు ఉన్నాయో,?, ప్రాజెక్ట్‌లు నిర్మించిన వద్ద ఎవరికి భూములు ఉన్నాయో తేల్చేందుకు కాంగ్రెస్ మినహా బిఆర్‌ఎస్, బిజెపి, ఎంఐఎం, సిపిఐ ఎంఎల్‌ఎలతో

తరువాయి 2లో

## 2022–24 ఆర్థిక సంవత్సరాల్లో అప్పు రూ.53,144 కోట్లు

- బడ్జెట్ అంచనాలో 79 శాతం వ్యయం
- ఆమోదం పొందిన బడ్జెట్ కంటే అదనంగా అంచనాల్లో 33 శాతం ఖర్చు
- శాసనసభలో కాగ్ నివేదిక ప్రవేశపెట్టిన మంత్రి భట్టి



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2022–23, 2023–24 ఆర్థిక సంవత్సరాలలో తీసుకున్న అప్పు రూ.53,144 కోట్లు అని కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక వెల్లడించింది. బడ్జెట్ అంచనాలో 79 శాతం వ్యయం అయిందని, ఆమోదం పొందిన బడ్జెట్ కంటే అదనంగా అంచనాల్లో 33 శాతం ఖర్చు కాగా, ఇది రూ.1,11,477 కోట్లుగా ఉందని కాగ్ తెలియజేసింది. శాసనసభలో గురువారం 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఫైనాన్స్ అకౌంట్స్, అప్రాప్రియేషన్ అకౌంట్స్‌పై 'కాగ్ నివేదిక' రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారు. ఇందులో 2023–24 బడ్జెట్

తరువాయి 2లో

## కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టాలి

- బకాయిలను తీసుకువచ్చేందుకు అన్ని రాజకీయ పక్షాలు ఒత్తిడి తేవాలి
- వ్యక్తి కేంద్రంగా బడ్జెట్ రూపొందిస్తే అన్నివర్గాలూ అభివృద్ధి
- తెలంగాణ ధనికమా? పేదదా? అప్పుల రాష్ట్రమా? అనే సందేహం కలుగుతుంది
- సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని



ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన వాట నిధులతో పాటు ఇప్పటికే బకాయిలున్న వాటిని రాబట్టుకోవాల్సిందేననని, ఇందుకు అన్ని రాజకీయ పక్షాలు కలిసి కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని సిపిఐ శాసన సభా పక్ష నాయకులు కూనంనేని సూచించారు. ప్రతి వ్యక్తిని కేంద్రంగా చేసుకుని బడ్జెట్ రూపొందిస్తే అన్ని వర్గాలు అభివృద్ధి పథంలో ఉంటాయని సాంబశివరావు అన్నారు. ప్రజలకు అశలు, అకాంక్షలు చాలా ఉంటాయని, వారిని సంతృప్తి పర్చడం చిన్న విషయం కాదని, అందుకే జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం 202526 ఆర్థిక సంవత్సరానికిగాను ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉన్నంతలో బేష్‌గానే ఉందన్నారు. శాసనసభలో గురువారం 'ద్రవ్య వినిమయ బిల్లు'పై జరిగిన చర్చలో కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనసభలో జరిగిన చర్చతో అసలు తెలంగాణ ధనిక రాష్ట్రమా? పేద రాష్ట్రమా? లేక అప్పుల రాష్ట్రమా? అనే సందేహం

తరువాయి 2లో

## తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్షుడిగా భాగం హేమంతరావు, ప్రధాన కార్యదర్శిగా పశ్య పద్మ



భాగం హేమంతరావు



పశ్య పద్మ

ప్రజాప్రక్షం/నిజామాబాద్ ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా భాగం హేమంతరావు, పశ్యపద్మలు మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఉజ్జిని యాదగిరిరావు, కంజర భూమయ్య, కొప్పోజు సూర్యనారాయణ, కొల్లూరు రాజయ్య, దొండపాటి రమేష్, వివిఎస్ ప్రసాద్ శాస్త్రి, ప్రభులింగం, నెట్టెం నారాయణ, మిడకంటి వెంకట్‌రెడ్డి, బొల్లు ప్రసాద్ ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యదర్శులుగా వర్ల వెంకటయ్య, కంబాల శ్రీనివాస్, చంద్ర నరేంద్రకుమార్, చిలక దేవిదాస్, దేవ భక్తుని సంధ్య, కోశాధికారిగా ఎన్నికయ్యారు. నిజామాబాద్‌లో జరుగుతున్న మహాసభల్లో భాగంగా చివరి రోజు గురువారం ప్రతినిధులు 109 మందితో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర ఆఫీస్ బేరర్లుగా 21 మంది ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా భాగం, పశ్యపద్మ మాట్లాడుతూ, ఈనెల 25, 26, 27 లలో

తరువాయి 12లో

## తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు

- రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం
- డిసెంబర్‌లోగా దేవాదుల పనులు ముగిస్తాం
- మంత్రులు ఉత్తమ్, పొంగులేటి వెల్లడి
- దేవాదుల పంపుహౌస్ నుంచి నీరు విడుదల





ప్రజాపక్షం/ధర్మసాగర్/హనుమకొండ

గత పదేళ్లుగా ముందుకు సాగని రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.గురువారం హనుమకొండ జిల్లా దేవన్నపేట వద్ద దేవాదుల పంప్ హౌస్ నీటి విడుదల అనంతరం ధర్మసాగర్ రిజర్వాయర్ వద్ద పూజలు నిర్వహించి నీటిని విడుదల చేశారు. ఆతరువాత రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి,

తరువాయి 2లో

## గిరిజన యువతికి మోసం నిందితుడికి 27 ఏళ్ల జైలు

నల్లగొండలో ఎస్‌సి, ఎస్‌టి కోర్టు తీర్పు

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్

దళిత యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి, మోసగించి గర్భవతిని చేసిన నిందితునికి 27 ఏళ్ల జైలు శిక్ష విధించారని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తెలిపారు. గురువారం జిల్లా అదనపు సెషన్ ఎస్‌సి, ఎస్‌టి కోర్టు క్రింది కనగల్ మండల పరిధిలోని పర్వతగిరి గ్రామానికి చెందిన నల్లబోతు జగన్‌ని దోషిగా నిర్ధారించబడిందని తెలిపారు. గుర్రంపోడు మండలం శాఖపురం గ్రామానికి చెందిన యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేసిన తరువాత మాట మార్చగా

తరువాయి 2లో

## నిబంధనలకు పాతర

- అధికారుల హెచ్చరికలు బేఖాతర్
- నిలువునా "కూలీ" న బతుకులు
- శిథిలాల నుండి ఒక మృత దేహం వెలికితీత.. నగదు, బంగారు, వెండి ఆభరణాలు లభ్యం
- కొనసాగుతున్న సహాయక చర్యలు

ప్రజాపక్షం/భద్రాచలం

పట్టణం నడిబొడ్డు అతి పెద్ద ఆరు అంతస్తుల భవనం నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణమవుతూ కుప్పకూలింది. నిబంధనలకు పాతరేసిన భవన నిర్మాణదారుడు తన ఇష్టాను సారంగా వ్యవహరిస్తూ అధికారులపై బెదిరింపులకు పాల్పడుతూ, పలుకుబడిని ఉపయోగించి చట్టాలను చేతిలోకి తీసుకున్నాడు. దీంతో కూలీ పనులకు వచ్చిన కార్మికులు

తరువాయి 12లో



## ప్రతిపక్ష నేతను మాట్లాడనివ్వరా?

- స్పీకర్ నిర్ణయాన్ని ముక్తకంఠంతో వ్యతిరేకించిన ప్రతిపక్షాలు
- ఎల్ఒపి నియమ నిబంధనాలు పాటించాలని కోరడాన్ని రాజకీయం చేస్తున్నారని మండిపాటు
- ఓమ్ బిర్లాకు ఇండియా కూటమి పార్టీలు లేఖ అందజేత



**న్యూఢిల్లీ :** ప్రతిపక్షనాయుకుడి విధాన నియమాలను పాటించడాన్ని కోరడాన్ని లోక్‌సభ స్పీకర్ రాజకీయం చేస్తున్నారని ప్రతిపక్షాలు విమర్శించాయి. విపక్ష పార్టీల ప్రతినిధి బృందం గురువారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసింది. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి సభలో మాట్లాడే అవకాశం కల్పించకపోవడాన్ని ముక్తకంఠంతో వ్యతిరేకించింది. కాంగ్రెస్, ఎస్‌పి, టిఎంసి, డిఎంకె, కేరళ కాంగ్రెస్, ఆర్‌జెడి, ఐయుఎంఎల్, ఆర్ఎల్‌పి, ఎండిఎంకెలతో కూడిన ఇండియా కూటమి ప్రతినిధి బృందం జీరో అవర్‌లో స్పీకర్‌ను కలిసినట్లు లోక్‌సభలో

తరువాయి 12లో



## త్వరలో భారత్‌లో పుతిన్ పర్యటన

సన్నాహాలు జరుగుతున్నాయని రష్యా మంత్రి లావరోవ్ ప్రకటన

**మాస్కో :** భారత్‌లో పర్యటించేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ సమ్మతి తెలియజేశారు. భారత్‌లో పర్యటించాల్సిందిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆహ్వానించారని, ఈ ఆహ్వానానికి పుతిన్ సమ్మతి

తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## రచయితకు ఐదేళ్ళ జైలు



**ఆల్జీర్స్ :** ఫ్రెంచ్–ఆల్జీరియన్ రచయిత బౌలెం సన్సల్‌కు ఆల్జీరియా న్యాయస్థానం గురువారంనాడు ఐదేళ్ళ జైలుశిక్ష ఖరారు చేసింది. ఈ రచయితకు 84 ఏళ్ళు వయసు. మొరాకో ప్రాంతాన్ని వలసపాలనాకాలంలో ఫ్రాన్స్ చాలా అన్యాయపూరితంగా ఆల్జీరియాకు వదిలేసిందని రచయిత బౌలెం సన్సల్ వ్యాఖ్యానించారు. రచయిత వ్యాఖ్యలు ఆల్జీరియా ప్రాదేశిక సమగ్రతకు, స్వాతంత్ర్యానికీ భంగం కలిగించేవిగా ఉన్నాయని పేర్కొంటూ న్యాయస్థానం ఈ శిక్షను ఖరారు చేసింది. ఐదు లక్షలు ఆల్జీరియా దీనార్లను కూడా జరిమానాగా విధించింది. ఆల్జీరియాలో వలసకాలంలో జన్మించిన సన్సల్ 2024 నుండి ఫ్రాన్స్‌లో ఉంటున్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలు రెండు దేశాలమధ్య దౌత్యపరమైన వివాదానికి తెరతీశాయి. 84 ఏళ్ళ వృద్ధాప్యంలో ఆయనకు జైలు శిక్ష న్యాయబద్ధం కాదనీ, మానవతా దృక్పథంతో ఆలోచించాలనీ ఫ్రాన్స్ ప్రభుత్వం ఆల్జీరియాకు విజ్ఞప్తి చేసింది. ఆయనను గడచిన నవంబరు నెలలో అరెస్టు చేసి విచారణ జరిపారు. తాజాగా ఈ శిక్షను కోర్టు ఖరారు చేస్తూ తీర్పు చెప్పింది.

## రష్యా డిమాండ్ల ప్రతిఘటనకు ట్రంప్ గట్టిగా నిలబడాలి
### యూరప్ జర్నలిస్టులతో జెలెన్స్కీ



**పారిస్ :** ఆంక్షలు ఎత్తివేయాలన్న రష్యా డిమాండ్‌ను ప్రతిఘటించేందుకు, శాంతి ఒప్పందం అమలు జరిగేందుకు వీలుగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గట్టిగా నిలబడి వాదించగలరని ఉక్రేన్ ఆశాభావం వ్యక్తం చేసింది. ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ పారిస్‌లో ఎంపిక చేసిన యూరప్ జర్నలిస్టులతో సమావేశం జరిపారు. సౌదీఅరేబియాలో మధ్యవర్తిగా అమెరికా జరిపిన చర్చలు, అనంతర పరిణామాల గురించి మాట్లాడారు. నల్ల సముద్రంలో కాల్పుల విరమణ ఒప్పందం అమలుకాకముందే రష్యాపై ఆంక్షలను ఎత్తివేయాలని చేస్తున్న డిమాండ్‌పై అడిగిన ప్రశ్నలకు జవాబులిస్తూ, దేవుడు ఆశీర్వదించాలనీ, తాము అదే కోరుతున్నామని, ట్రంప్ గట్టిగా ప్రతిఘటించగలరన్నారు.

ఆంక్షలు ఎత్తివేస్తే ఉక్రేన్‌కు నష్టం జరుగుతుందన్నారు. వ్యవసాయ వాణిజ్యంపై ఆంక్షలు ఎత్తివేయాలని, డిజిటల్ చెల్లింపులను అనుమతించాలని రష్యా కోరుతున్నది. ఈ అంశాన్ని పరిశీలిస్తామని ట్రంప్ హామీ ఇవ్వగా, సైన్యాన్ని ఉపసంహరిస్తే తప్ప ఈ షరతును తాము పరిశీలించేదిలేదని యూరోపియన్ యూనియన్ గట్టిగా చెబుతున్నది. చరిత్ర పుస్తకాల్లో ఉక్రేన్ రక్షకుడుగా ఉండాలనుకుంటున్నారా? ఉక్రేన్ విధ్వంసకుడుగా ఉండాలనుకుంటున్నారా? అని ప్రశ్నించగా, తమ బిడ్డలందరూ వీధుల్లో చిరకాలం స్వేచ్ఛగా తిరగాలని కోరుకుంటున్నానన్నారు.

**కీలుబొమ్మ జెలెన్స్కీ విఫలం : లావరోవ్**
యూరోపియన్ యూనియన్ చేతుల్లో కీలుబొమ్మగా ఉన్న జెలెన్స్కీ ఉక్రేన్ మెజారిటీ ప్రజల ప్రయోజనాలు కాపాడటంలో విఫలమయ్యారని రష్యా ఉన్నతస్థాయి దౌత్యవేత్త, విదేశాంగమంత్రి సెర్గీ లావరోవ్ విమర్శించారు. క్రిమియా, డాన్‌బాస్, నొవొరోస్సియాలపై ఇంకెంతోకాలం చర్చ సాగదని, ఈ ప్రాంతాలన్నీ రష్యా రాజ్యాంగంలో భాగంగా మారిపోతాయని ఆయన అన్నారు. ఈ ప్రాంతాలలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలు రష్యా రాజ్యాంగాన్నే ప్రతిబింబించారన్నారు. గత ఏడాది సెప్టెంబరులో రష్యా ఆక్రమిత ప్రాంతాలలో ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. యూరోపియన్ యూనియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వోండర్ లేయన్ అన్నీ విస్మరించి నాజీ సంతతి జెలెన్స్కీ చేసిన దుంపనాశనాన్ని రష్యాపై రుద్దుతున్నారని విమర్శించారు.

# విదేశీ కార్లపై 25 శాతం ట్రంప్ సుంకాలు



**వాషింగ్టన్ :** విదేశాల నుండి అమెరికాలోకి ప్రవేశించే కార్లపై 25 శాతం సుంకాలు విధిస్తున్నట్లు అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గురువారంనాడు ప్రకటించారు. కార్ల విడిభాగాల మీద కూడా ఈ కొత్త సుంకాలను విధించారు. ఐతే కార్లపై ఏప్రిల్ రెండో తేదీ నుండి, విడిభాగాలపై సుంకాలు మే నెల నుండి అమలులోకి వస్తాయి. ఈ సుంకాల విధింపు వల్ల కార్ల పరిశ్రమలో బ్రహ్మాండమైన వృద్ధి ప్రారంభం అవుతుందని, ఈ రంగంలో కొత్త ఉద్యోగాలు, పెట్టుబడులు, కొత్త అవకాశాలు వస్తాయని ట్రంప్ అన్నారు. ఐతే సంబంధిత రంగ నిపుణులు మాత్రం దీనివల్ల కార్ల పరిశ్రమ తాత్కాలికంగా మూతపడుతుందనీ, వృద్ధి ఆగిపోతుందనీ, ధరలు పెరుగుతాయనీ, మిత్రదేశాలతో సమస్యలు కూడా ఉత్పన్నం అవుతాయనీ భయాలు వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాదిలో అమెరికాకు విదేశాల నుండి 80 లక్షల కార్లు దిగుమతయ్యాయి. వీటి మొత్తం ఖరీదు సుమారు 240 బిలియన్ డాలర్ల మేరకు ఉంటుంది. అమెరికాకు ప్రధానంగా మెక్సికో దేశమే కార్లు తయారు చేసి పంపుతుంది. ఎక్కువమంది అమెరికన్లు వాడే కార్లన్నీ మెక్సికోలో తయారైనవే. అమెరికాలో జరిగే కార్ల వ్యాపారంలో మెక్సికోదే పైచేయి. ఆ తర్వాతి స్థానాల్లో దక్షిణ కొరియా, జపాన్, కెనడా, జర్మనీ దేశాలున్నాయి. ఐతే కెనడా, మెక్సికోల నుండి వచ్చే కార్ల విడిభాగాలపై మాత్రం సుంకాలను మినహాయించారు. ఈ రెండు దేశాలు తమ తమ సరిహద్దుల నుండి వలస ప్రజలను అమెరికాకు వెళ్ళనీయకుండా స్వీయభద్రతను కట్టుదిట్టం చేయడంతో ట్రంప్ కరిగి ఈ మినహాయింపు ఇచ్చారు. గురువారంనాడు జనరల్ మోటార్స్ మూడుశాతం మేరకు మార్కెట్‌లో నష్టాలను చవిచూడగా, జీప్, క్రిసెల్లర్స్‌కు చెందిన షేర్లు 3.6 శాతానికి క్షీణించాయి. ఈ టారిఫ్‌లవల్ల టెస్లా కూడా నష్టపోతుందనీ, ఈ సుంకాలు తమపై ప్రభావం చూపిస్తాయనీ టెస్లా కార్ల కంపెనీ యజమాని ఎలాన్‌మస్క్ ఎక్స్ వేదికగా ఒక ప్రకటన చేశారు. అమెరికాలో తయారీ రంగాన్ని వృద్ధి చేయడానికి, అమెరికా వ్యాపారాలకు రక్షణ ఇచ్చేందుకు, అదనపు డిమాండ్‌ను తీసుకురావడానికి ట్రంప్ తీసుకుంటున్న వరుస చర్యల్లో భాగంగా ఈ టారిఫ్‌లు కూడా అమలులోకి రానున్నాయి. మొన్న వెనిజులా నుండి ముడి చమురు దిగుమతి చేసుకునే దేశాలు అమెరికాతో కూడా ఏదైనా వ్యాపారం చేస్తూ ఉంటే వారు కూడా సుంకాల పరిహారం అమెరికాకు చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేశారు. దీనివల్ల భారత్–చైనా తీవ్రంగా నష్టపోతాయి. ఐతే ఆండర్సన్ ఎకనామిక్ గ్రూప్ సమాచారం ప్రకారం, కెనడా, మెక్సికో కార్లకు విడిభాగాలకు ఆయా మోడల్స్‌ను బట్టి 4,000 నుండి 10,000 డాలర్లు వరకూ అదనంగా ఖర్చు అవుతాయి. గతంలో ట్రంప్ విధించిన సుంకాలకు ప్రతీకారంగా విదేశాలు అమలు చేసే అదనపు సుంకాలు ఎప్పటి నుంచి అమలులోకి వస్తాయో ట్రంప్ సుంకాలు కూడా అప్పటి నుంచీ అమలులోకి వస్తాయి. గత ఏడాది బ్రిటన్‌కు చెందిన జాగ్వార్, లాండ్‌రోవర్ కార్లు అమెరికాలో భారీగా విక్రయాలు చేసి వ్యాపారలాభాలు తెచ్చుకున్నాయి. బ్రిటన్ ఛాన్సలర్ రాచెల్ రీవ్స్ మాట్లాడుతూ ఈ కొత్త సుంకాలవల్ల అటు బ్రిటన్‌కు, ఇటు అమెరికాకు కూడా తీవ్ర నష్టం తెస్తాయని హెచ్చరించారు. ఐతే ఈ పన్నుల నుండి తప్పించుకోవడానికి బ్రిటన్ చాలా ముమ్మరంగా అన్ని స్థాయిలలోనూ అమెరికాతో చర్చలు కొనసాగిస్తోందని చాచెల్ రీవ్స్ చెప్పారు.

## పాకిస్థాన్‌లో మళ్ళీ హింస
### రెండు ఘటనల్లో తొమ్మిదిమంది మృతి

**కరాచీ :** పాకిస్థాన్‌లో మళ్ళీ హింసాకాండ చెలరేగింది. క్వెట్టాలో, కాల్మత్‌లో జరిగిన రెండు వేరు వేరు హింసాత్మక ఘటనల్లో తొమ్మిదిమంది మరణించారు. క్వెట్టాలోని బారెక్ మార్కెట్ ఏరియాలో ఒక పోలీసు వాహనం సమీపంలో గురువారం బాంబు పేలుడు సంభవించడంతో ముగ్గురు మరణించారు. మరో 21 మంది గాయపడ్డారు. గాయపడినవారిలో నలుగురు పోలీసులు ఉన్నారు. మరో ఘటనలో ఉగ్రవాదులు ఆరుగురు ప్రయాణికులను కాల్చి చంపారు. బుధవారం రాత్రి పొద్దుపోయాక జాతీయ రహదారిని మూసివేసి పంజాబ్‌కు చెందిన ఆరుగురు ప్రయాణికులను బస్సులోంచి దింపి కాల్చి చంపారు. ఐదుగురు అక్కడికక్కడే మరణించగా మరొకరు ఆసుపత్రిలో మరణించారు. మరో ముగ్గురిని కిడ్నాప్ చేశారు. బలూచిస్థాన్ రాష్ట్రం గ్వాదర్ జిల్లా కాల్మత్ ఏరియాలో ఈ ఘటనకు కారకులు బలూచిస్థాన్ విముక్తిని కోరుతున్న ఉగ్రవాదులుగానే భావిస్తున్నారు. బలూచిస్థాన్ రాష్ట్రాన్ని పాకిస్థాన్ నుండి విముక్తి చేయాలని కోరుతూ ఆ ప్రాంత ఉగ్రవాదులు ఇటీవలికాలంలో తమ హింసాకాండ చర్యలను ఉద్ధృతం చేశారు. హైవే పోలీస్ సీనియర్ సూపరింటెండెంట్ హఫీజ్ బలోచ్ శనివారం ఈ విషయం చెప్పారు. నిందితులకోసం గాలిస్తున్నట్లు చెప్పారు. ప్రయాణికులతో కరాచీ వెళుతున్న ఒక బస్సుని ఉగ్రవాదులు అడ్డుకుని మొదట అందరి ఐడి కార్డులను తనిఖీ చేశారు. తర్వాత ఎంపిక చేసిన వారిని కిందకు దింపి కాల్చి చంపారు. పస్ని–ఓర్మరా మధ్య ఈ ఘటన జరిగింది. అదేవిధంగా గ్వాదర్ ఓడరేవుకు ఎరువులు తీసుకువెళుతున్న అతిపెద్ద లారీని అడ్డుకుని జాతీయ రహదారికి వాటినే అడ్డంగా పెట్టి వాహనాల రాకపోకలను నిలిపివేశారు.



భద్రతా దళాలు ఆ ప్రాంతానికి వెళ్ళాయి. ఈ దుశ్చర్యను పాకిస్థాన్ అధ్యక్షుడు అసిఫ్‌అలీ జర్దారీ, ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ వేరు వేరు ప్రకటనల్లో తీవ్రంగా ఖండించారు. ప్రధానమంత్రి, అధ్యక్షుడు వేరు వేరు ప్రకటనలు చేస్తూ, బలూచిస్థాన్ అభివృద్ధికి ఉగ్రవాదులు పెద్ద అడ్డంకిగా ఉన్నారని విమర్శించారు.

## అవినీతి కేసుల్లో తొందరలోనే జైలుకు
(మొదటి పేజీ తరువాయి)

కూడిన 'నిజనిర్ధారణ కమిటీ' వేద్దామా అని బిఆర్ఎస్‌కు సిఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. శాసనసభలో గురువారం జరిగిన ద్రవ్య వినిమయ బిల్లుపై జరిగిన చర్చలో బిఆర్ఎస్ సభ్యులు కెటి.రామారావు లగచర్ల, భూ నిర్వాసితుల అంశాన్ని ప్రస్తావించగా, దీనిపైన సిఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పైన విజిలెన్స్ ఎన్‌ఫోర్ట్‌మెంట్ కమిటీ ఇచ్చిన నివేదికపైన రాబోయే శాసనసభ సమావేశాల్లో చర్చిద్దామని, రీ డిజైన్ పేరుతో ఎంతకొల్లగొట్టారో అన్ని విషయాలను వెల్లడిస్తానని తెలిపారు.

**నోరు తెరిస్తే అబద్ధాలు..** అబద్ధాలతో బతకాలన్న ఆలోచన ఎంతకాలం చేస్తారో తనకు తెలియదని, మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం వద్ద నిర్మించిన ప్రాజెక్టులు పంపులు లేకపోయినా, లక్షల కోట్ల రూపాయాలతో నిర్మించిన ప్రాజెక్ట్ లేకపోయినప్పటికీ ఇదివరకు ఉన్న ప్రాజెక్ట్‌లతో నీరు వస్తుందని, కానీ బిఆర్ఎస్ ప్రజలను తప్పుదారి పట్టిస్తోందని మండిపడ్డారు. మల్లన్నసాగర్ నిర్మించిన రోజు ఏటిగట్ట కృష్టాపూర్, వేములఘాట్, 14గ్రామాలు, తండాలు కలిపి పరుగెత్తించి, పరుగెత్తించి 'మీమ్మల్ని' కొట్టిన రోజు పోలీసుల బూటు కాళ్లతో రైతులను, ప్రజలను తొక్కించారని, ఇది కూడా గజ్వేల్ నియోజకవర్గంలో జరిగిందని, ఇది ఎలా జరిగిందని ఆయన ప్రశ్నించారు. బాధితుల తరపున బాధితలుకు ఎక్కువ నష్టపరిహారం ఇవ్వాలని తాను 48 గంటల పాటు అక్కడ నిరాహారదీక్ష చేపట్టానని సిఎం గుర్తు చేశారు. కొండపోచమ్మ ప్రాజెక్ట్ నుంచి ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌజ్‌లకు కాలువలు తీసుకున్నారని, రంగనాయక్ వద్ద హరీశ్‌రావుకు ఫామ్‌హౌజ్ ఉన్నదా? లేదా ? అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ప్రాజెక్ట్‌లు నిర్మించిందే ప్రాజెక్ట్‌ల కోసమని, ఇది దుర్మార్గమైన ఆలోచన అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్‌ల వద్ద బిఆర్ఎస్, వారి బంధువుల భూములను ఎలా మినహాయించారని, నేరుగా కెసిఆర్ ఫామ్‌హౌజ్‌కు సుట్టు కాలువలను తిప్పారని, దీనికి సంబంధించిన ఆధారాలు చూపాలా? అని సిఎం నిలదీశారు. భూసేకరణ జరిగినప్పుడు నిర్వాసితులకు బాధ ఉంటుందని,అందుకే వారికి అత్యధికంగా నష్ట పరిహారం ఇవ్వాలన్నదే తమ ఆలోచన అని సిఎం అన్నారు. కొడంగల్‌లోని లగచర్ల బాధితులకు ఎకరాకు రూ.20 లక్షలు, 150గజాల ఇంటి స్థలం, రూ.5లక్షల ఇందిరమ్మ ఇంటికి నిధులు ఇచ్చామని, మంచి ప్యాకేజీ ఇచ్చామని తెలిపారు. అయినప్పటికీ అక్కడికి 'మీ మాజీ ఎంఎల్‌ఎ వెళ్లి ,ఏదైనా చేయాలని, అధికారులను చంపినా తాము చూసుకుంటామని చెప్పిన విషయం పబ్లిక్ డొమెన్‌లో ఉన్నదని, వచ్చినొన్ని వచ్చినట్టు చంపండని, హరీశ్‌రావు, కెటిఆర్ చూసుకంటారని నరేందర్ రెడ్డి చెప్పినట్టు ' బహిరంగమైందని తెలిపారు. నాగార్జున సాగర్ నుంచి శ్రీశైలం ప్రాజెక్ట్ వరకు బిఆర్ఎస్ నిర్మించిందా? కల్వకుర్తి, నెట్టెంపాడు, నిర్మించారా అని కమీషన్ల కోసం ప్రాజెక్ట్‌ల రీ డిజైన్ పేరుతో రూ.36వేల కోట్లతో విఉలవ ఉన్న ప్రాణహిత ప్రాజెక్ట్‌ను కాళేశ్వరం పేరుతో రూ.1.5 లక్షల కోట్లకు పెంచారని, ఇందులో రూ.1,2. లక్షలు కోట్ల బిల్లులను చెల్లించారని, అత్యంత అవినీతి మయమని సిఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు.

**బండకేసి కొట్టినా బుద్ధిరాలేదా?** తెలంగాణ జాతిపితగా చెబుతున్న కెసిఆర్‌ను ఎన్నికల్లో కామారెడ్డి ప్రజలు బండకేసి కొట్టారని, ప్రజలు తిరస్కరించినప్పటికీ ఇంకా ఎందుకు బుకాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మూసీ'హైదరాబాద్ మెట్రో రైలు,రీజనల్ రింగ్ రోడ్డును నిర్మించాలా? వద్దా ?, తెలంగాణలో అభివృద్ధి చేయాలావద్దా చెప్పాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత దావోస్ పర్యటనలో రూ.2లక్షల కోట్లు పెట్టుబడులు తీసుకొచ్చామని తెలిపారు. చైనా, జపాన్, జర్మనీ దేశస్తులకు ఇంగ్లీష్ రాదని, కానీ ఆ దేశాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను శాసిస్తున్నాయని తెలిపారు.

## పుతిన్ పర్యటన (మొదటి పేజీ తరువాయి)

తెలియజేశారనీ, అందుకు వీలుగా తగిన సన్నాహాలు జరుగుతున్నాయని రష్యా విదేశాంగమంత్రి సెర్గీ లావ్‌రోవ్ గురువారంనాడు చెప్పారు. ''సరికొత్త ద్వైపాక్షిక ఎజెండా దిశగా రష్యా–భారత్'' అనే అంశంపై జరిగిన ఒక సదస్సులో లావరోవ్ మాట్లాడుతూ ఈ విషయం చెప్పారు. రష్యా ఇంటర్నేషనల్ ఎఫైర్స్ కౌన్సిల్ (ఆర్ఐఎసి) ఈ సదస్సుకు ఆతిథ్యం ఇచ్చింది. పుతిన్ భారత్‌లో పర్యటించడానికి వీలుగా తగిన ఏర్పాట్లు జరుగుతున్నాయని లావరోవ్ చెప్పారు. మోదీ తిరిగి ప్రధానమంత్రిగా ఎన్నికైన తర్వాత గత ఏడాది జులై నెలలో ఆయన రష్యా పర్యటన చేశారని, ఇప్పుడు పుతిన్ భారత్‌కు వెళుతున్నారన్నారు. దాదాపు ఐదేళ్ళ తర్వాత మోదీ మళ్ళీ రష్యాలో పర్యటించారు. అప్పుడే ఆయన భారత్‌లో పర్యటించాల్సిందిగా పుతిన్‌ను ఆహ్వానించారు. అంతకుముందు 2019లో రష్యా తూర్పుప్రాంత నగరం వ్లాడివోస్టోక్‌లో ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు వెళ్ళారు. భారతదేశంతో అత్యంత గౌరవనీయ,ప్రతిష్టాత్మకమైన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని రష్యా అభివృద్ధి చేస్తోందని లావరోవ్ ఈనెల 24న చెప్పారు. చైనా,భారత్, ఇరాన్, ఉత్తర కొరియా, కామన్వెల్త్‌లో ఉన్న స్వతంత్ర దేశాలతో సంబంధాలను రష్యా విస్తరించుకుంటున్నదన్నారు.

## రూ.53,144 కోట్లు (మొదటి పేజీ తరువాయి)

అంచనా రూ.2,77,690కోట్లు కాగా, చేసిన వ్యయం రూ.2,19,307 కోట్లుగా చెప్పారు. గత ఐదేళ్లలో రూ.4,03,664 కోట్ల అప్పులు చేసినట్టు కాగ్ రిపోర్ట్ వెల్లడించింది. 2023–24 ఏడాదిలో బహిరంగ మార్కెట్ నుంచి రూ.49,618 కోట్ల అప్పులు తీసుకున్నట్టు కాగ్ పేర్కొంది. గత ఏడాది కాలంలో 200 శాతం ఎఫ్ఆర్‌బిఎం పరిధి పెరిగినట్లు తెలిపింది. పలు కార్పొరేషన్ల ద్వారా తీసుకున్న అప్పు రూ.2.20 లక్షల కోట్లని వెల్లడించింది. వేతనాల కోసం రూ.26,981 కోట్లు ఖర్చు చేసినట్టు కాగ్ రిపోర్ట్ పేర్కొంది. ప్రభుత్వ ఖజానాకు పన్ను ఆదాయం నుంచే 61.89 శాతం నిధులు వస్తున్నాయని, 2023–24లో కేంద్రం నుంచి వచ్చిన గ్రాంట్లు రూ.9,934 కోట్లని కాగ్ వెల్లడించింది. రెవెన్యూ రాబడుల్లో 45శాతం సర్కారీ ఉద్యోగుల వేతనాలకు, తెచ్చిన అప్పులకు వడ్డీ చెల్లింపులు, పెన్షన్లకే ఖర్చవుతోందని నివేదికలో తెలిపింది. 2023–24లో రెవెన్యూ మిగులు రూ.779 కోట్లని, లోటు రూ49,977 కోట్లుని స్పష్టం చేసింది. 2023–24లో స్థానిక సంస్థలు, ఇతర సంస్థలకు రూ.76,776 కోట్లు చెల్లింపులు జరిగాయని, 11శాతం పెరుగుదల స్థానిక సంస్థలు, ఇతర సంస్థలకు ప్రభుత్వం నిధుల పెంపుదలగా చెప్పింది.

## 27 ఏళ్ల జైలు (మొదటి పేజీ తరువాయి)



బాధితురాలు నిందితుడు నల్ల బోతు జగన్‌పైన గుర్రంపోడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు మేరకు గుర్రంపోడ్ పిఎస్‌లో ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహించి సరైన ఆధారాలు సేకరించి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు సమర్పించగా నిందితునికి జిల్లా అదనపు సెషన్ ఎస్‌సి, ఎస్‌టి కోర్టు కింది విధంగా దోషిగా నిర్ధోషించబడిందని తెలిపారు. ఐపిసి సెక్షన్ 376 కింద నిందితుడికి పది సంవత్సరాల జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధించడం జరిగిందని, అదేవిధంగా ఐపిసి సెక్షన్ 420 కింద నేరానికి నిందితుడికి మరో ఏడు సంవత్సరాల జైలు శిక్ష మొత్తం నిందితునికి 27 సంవత్సరాల జైలు శిక్ష విధించబడిందని ఎస్పీ తెలిపారు. ఈ కేసులో సరైన ఆధారాలను సేకరించి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు సమర్పించినా, అప్పటి విచారణ అధికారులు ఎస్డిపిఓలు మహేశ్వర్,ఆనంద్, ఎఎస్ఐఎమ్‌డి. ఖలీల్ అహ్మద్, ఎఎస్‌పి, పి.మౌనిక, ఎస్‌హెచ్‌ఒ పి.మధు, సిడిఒ, ఎండి. ఇంతియాజ్ హమ్మద్, లైజన్ అధికారులు పి.నరేందర్, ఎన్.మల్లికార్జున్‌లను జిల్లా ఎస్పి అభినందించారు.

# యథాతథంగా లోక్‌సభ సీట్లు
(మొదటి పేజీ తరువాయి)

విధివిధానాలు, రాష్ట్ర ప్రభుత్వాలతో పారదర్శకమైన సంప్రదింపులు లేకుండా జరుగుతున్న కసరత్తుపై తెలంగాణ శాసనసభ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, అన్ని రాజకీయ పార్టీలు, భాగస్వామ్య పక్షాలతో విస్తృతమైన సంప్రదింపుల తర్వాత నియోజకవర్గాల పునర్విభజన కసరత్తును పారదర్శకంగా చేపట్టాలని శాసనసభ కోరుతోంది. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా జనాభా నియంత్రణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసిన రాష్ట్రాలకు పునర్విభజన శాపంగా మారకూడదు. జాతీయ జనాభా స్థిరీకరణ ఉద్దేశ్యంతో చేపట్టిన 42, 84, 87వ రాజ్యాంగ సవరణల లక్ష్యాలు ఇంకా నెరవేరలేదనే చెప్పుకోవాలి. జనాభా నియంత్రణ అమలు చేయటం ద్వారా జనాభా వాటా తగ్గిన రాష్ట్రాలు నష్టపోకూడదు. అందుకే, పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనకు జనాభా ఒక్కటే ప్రామాణికం కాకూడదు. పార్లమెంట్ సీట్ల సంఖ్యను యథాతథంగా కొనసాగించాలి. రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుని ఇప్పుడున్ననియోజకవర్గాల సరిహద్దుల మార్పులు, చేర్పులు చేయాలి. తాజా జనాభా లెక్కలకు అనుగుణంగా ఎస్‌సి, ఎస్‌టి సీట్లను పెంచాలి. మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలి. ప్రాతినిధ్య ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి, తాజా జనాభా లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం2014లో నిర్దేశించిన మేరకు ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 119 అసెంబ్లీ నియోజకవర్గాలను 153 వరకు తక్షణమే పెంచాలని, అందుకు అవసరమైన రాజ్యాంగ సవరణలను ప్రవేశ పెట్టాలని తెలంగాణ శాసనసభ కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతోంది.'' అని వివరించారు.

**దక్షిణాదికి రాజకీయ ప్రాతినిధ్యంలో సమన్యాయం దక్కాల్సిందే**
దక్షిణాది రాష్ట్రాలు ఆర్థికంగా నష్టపోతూ కూడా దేశ ఆర్థిక అభివృద్ధిలో నిబద్ధతో భాగస్వామ్యం అవుతున్నాయని, కానీ చివరికి రాజకీయ ప్రాతినిధ్యంలో నష్టపోవడానికి ఈ రాష్ట్రాలు ఎంత మాత్రం సుముఖంగా లేవని కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రస్తుతం 24 శాతం ప్రాతినిధ్యం ఉండగానే వివక్షకు గురుతున్న దక్షిణాధి రాష్ట్రాలు, 2026లో జనాభా ప్రతిపాదిక పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన జరిగితే అది కాస్తా 19 శాతానికి పడిపోయే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇదే జరిగితే దక్షిణాది రాష్ట్రాల రాజకీయ హక్కులను కేంద్ర ప్రభుత్వాలు కాలరాసే ప్రమాదం ఉందని, దీనిని ఎంత మాత్రం అంగీకరించబోమని సిఎం వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు ఏకతాటిపై నిలబడి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని, అందుకే శాసనసభలో తీర్మానం ప్రవేశపెట్టామన్నారు. సభలో ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్, సిపిఐ, బిఆర్ఎస్, ఎంఐఎం, బిజెపి సభ్యులతో కూడిన ప్రతినిధుల బృందం కేంద్ర ప్రభుత్వాన్ని కలిసి పార్లమెంట్ నియోజవర్గాల పునర్విభజనపై తమ అభ్యంతరాలను వ్యక్తం చేయనున్నామని చెప్పారు. రాష్ట్రాల అభ్యంతరాలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోతే పోరుబాట పడుతామని సిఎం స్పష్టం చేశారు.

**రాష్ట్రాల మధ్య సుహృద్భావ వాతావరణం దెబ్బతింటుంది :** జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే రాష్ట్రాల మధ్య సుహృద్భావ వాతావరణం దెబ్బతినే ప్రమాదం ఉందని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ విషయాలను 1972లో గ్రహించిన అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ 25 ఏళ్ల పాటు పునర్విభజన లేకుండా చట్టాన్ని సవరించారన్నారు. ఆ తర్వాత 2002లో అధికారంలో ఉన్న మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పాయ్ సైతం ఈ ప్రమాదాన్ని గుర్తించి 2025 వరకు మళ్లీ గడువు పొడిగించారని రేవంత్‌రెడ్డి వెల్లడించారు. కానీ ఇప్పుడున్న ప్రధాని మోదీ ప్రభుత్వం మాత్రం మళ్లీ ఈ అంశాన్ని తెరపెకి తేవడంతో దక్షిణాదిలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈ నేపథ్యంలో తమిళనాడు సిఎం స్టాలిన్ దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాలతో ఏర్పాటు చేసిన అఖిల పక్ష సమావేశంలో పార్లమెంట్ పునర్విభజన అంశంపై అన్ని పార్టీలు అభ్యంతరాలు వ్యక్తం చేశాయని చెప్పారు. త్వరలోనే తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో సైతం ఈ అంశంపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి కేంద్రానికి తమ నిరసనను వ్యక్తం చేయనున్నట్లు సిఎం తెలిపారు. కేంద్రం మాటలు, ఉద్దేశాలు వేర్వేరు పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కేంద్రంలో కనీసం చర్చకే రాలేదని, కొంత మంది కేంద్ర మంత్రులు మాట్లాడుతున్నారని, కేంద్ర ప్రభుత్వం చెప్పే మాటలు, ఉద్దేశాలు వేర్వేరుగా ఉంటాయని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి రాజకీయ అవసరాలకు అనుగుణంగా నిర్ణయాలు ఉంటాయన్నారు. ఇందుకు ఉమ్మడి ఎపి రాష్ట్రం విభజన సమయంలో తెలంగాణలో ఉన్న 119 సీట్లను 153కు పెంచాల్సి ఉండగా, ఇదే కేంద్ర ప్రభుత్వం 2026 జనాభా లెక్కల అనంతరమే పెంచుతామని ప్రకటించిందని, అదే జమ్ము కాశ్మీర్‌కు సంబంధించి మాత్రం 2011 జనాభా లెక్కల ఆధారంగానే రాజ్యాంగ సవరణ చేసి మరీ 83 ఉన్న అసెంబ్లీ స్థానాలను 90కి పెంచడం ఉదాహరణ అని సిఎం చెప్పారు. సిక్కింకు సంబంధించి 2018లో కేంద్ర మంత్రివర్గం ఓ తీర్మానం చేసి అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనను చేపట్టిందన్నారు. పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన అంశంలో దక్షిణాధి రాష్ట్రాల్లో ఈ అలజడి చెలరేగిందని చెప్పారు.

## ఎక్కువ ఆయకట్టు
(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి మీడియాతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు వచ్చే విధంగా తమ ఇరిగేషన్ పాలసీని రూపొందించడం జరిగిందని, రాష్ట్రంలో అన్ని పెండింగ్ ప్రాజెక్టుల పనులను పూర్తి చేసి ఎక్కువ ఆయకట్టుకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని దేవాదుల ప్రాజెక్టును అన్ని విధాలుగా పూర్తి చేస్తామని, వచ్చే డిసెంబర్‌లోగా అన్ని దేవాదుల పైప్‌లైన్ లింక్‌లు, మోటార్‌ల పనులు పూర్తిచేస్తామని తెలిపారు. ఇప్పటికే మూడవ దశలో దేవాదుల నీటిని విడుదల చేయడం జరిగిందని తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతుల సంక్షేమమే లక్ష్యంగా ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని, ఎన్ని ఇబ్బందులు ఉన్నా రైతులకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా ఇచ్చిన మాట ప్రకారం నాడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన ఈ దేవాదుల ప్రాజెక్టును మూడవ దశలోనూ అన్ని ఇబ్బందులను అధిగమించి పూర్తిచేశామని అన్నారు. రానున్న రోజులలో ఈ ప్రాంతాన్ని అన్ని విధాలుగా శస్యశ్యామలం చేసేందుకు కట్టుబడి ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీ రెడ్డి, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజి వాఖడే జిల్లా మండల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. తొలుత మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్.నాగరాజుకు ఘనంగా కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. అంతకు ముందు మంత్రులు హైదరాబాద్ నుండి ప్రత్యేక హెలికాప్టర్‌లో దేవన్నపేట పంప్ హౌజ్ వద్దకు వచ్చారు.

## నిధులు రాబట్టాలి
(మొదటి పేజీ తరువాయి)

కలుగుతుందన్నారు. బిఆర్ఎస్ సభ్యులు కె.తారక రామారావు అప్పులు అసలు సమస్య కాదన్నట్లు మాట్లాడుతుండగా, బిజెపి సభ్యులు అప్పుల పేరుతో ఏ పథకం అమలు చేయలేరన్నట్లు వ్యాఖానిస్తున్నారన్నారు. అయితే ధనిక రాష్ట్రం అయినా ఖర్చు అభివృద్ధి కోసం అప్పులు చేయాల్సిందే కానీ పరిమితికి మించి చేసినప్పుడే సమస్యలు వస్తాయని, ఇప్పుడు ఇదే జరిగిందన్నారు. గత సిఎం కె.చంద్రశేఖరరావు మంచి సమర్థత ఉన్న వ్యక్తేనని, ఏదో చేయాలని తపన ఉన్నవారేనని, కానీ ఆయన ఎక్కడో విఫలమయ్యారన్నారు. ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దీనిని గుర్తించి సమన్వయం చేసుకుని ముందుకు వెళితే విజయవంతం అవుతారన్నారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కోసం పోరాటం చేయాలని, నీతి అయోగ్ నుంచి రావాల్సిన రూ.25 వేల కోట్ల నుంచి రూ.30 వేల కోట్ల వరకు ఉన్న బకాయిలను సాధించుకోవాలన్నారు. బయ్యారం మనకు పెద్ద సంపద అని, అక్కడ 60 నుంచి 70 శాతం ఐరన్ ఓర్ ఉందని, అక్కడ ఉక్కు పరిశ్రమ స్థాపించాల్సిదేనన్నారు. ఇందుకు సంబంధించి భూభౌగోళిక శాఖ ఇచ్చిన నివేదిక సాక్ష్యమని, ఇక్కడ ఐరన్ ఓర్ లేకపోతే ఉమ్మడి రాష్ట్రంలో ప్రైవేట్ సంస్థలకు 1.50 లక్షల ఎకరాలను అప్పట్లో ఏలా కేటాయించారని కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు.

**70 శాతం పథకాలు అమలు... 30 శాతం కూడా చేయాల్సిందే :** కాంగ్రెస్ ప్రభుత్వ ఇచ్చిన 6 గ్యారంటీలలో 70 శాతం పథకాలు అమలు అవుతున్నాయని, మిగిలిన 30 శాతం కూడా అమలు చేయాల్సిందేనని కూనంనేని సాంబశివరావు అన్నారు. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి నేపథ్యంలో ప్రజలకు వాస్తవ పరిస్థితి వివరించడం ద్వారా కొంత సమయం తీసుకోనైనా ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలన్నారు. అదాయం పెంచుకునేందుకు పన్నుల వసూళ్లు, నల్లధనంతో పాటు భూమాఫియాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పాలకులతో పాటు అధికారులు దుబారా ఖర్చు నివారించాలన్నారు. ఐఎఎస్ అధికారులు ఒక్కొక్కరూ మూడు కార్లను వినియోగిస్తున్నారని, దీనిని నివారించగలిగితే రూ.150 కోట్లు మిగులుతాయని అంచనా ఉందని తెలిపారు. విద్యా, వ్యవసాయ రంగంతో పాటు ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమానికి ప్రభుత్వం తగిన ప్రాధాన్యతను ఇవ్వడం అభినందనీయమని కూనంనేని సాంబశివరావు అన్నారు.

## జైల్లో ఉండేటోళ్లు
(మొదటి పేజీ తరువాయి)

2025–26 బిల్లుపై బిఆర్ఎస్ సభ్యులు కెటిఆర్ చర్చను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం 2014 నుంచి తెలంగాణ పట్ల వివక్ష చూపుతుందన్నారు. 2014 నుంచి 2022 వరకు రాష్ట్రాల స్వయం సమృద్ధి వాటి ఆదాయాలను చూస్తే 17.57 శాతంతో భారతదేశంలోనే అగ్రభాగాన నిలబడ్డ రాష్ట్రం తెలంగాణ అని ఆర్‌బిఐ చెప్పిందని గుర్తుచేశారు. అధికారంలో ఎవరున్నా తెలంగాణ ప్రజలు బాగుండాలనేదే తమ పార్టీ లక్ష్యమని కెటిఆర్ పేర్కొన్నారు. కేంద్ర వైఖరిపై కాంగ్రెస్ ప్రభుత్వం మాట మాత్రమైనా నిరసన తెలుపలేదని కెటిఆర్ విమర్శించారు. మొన్నటి కేంద్ర బడ్జెట్‌లో 'తెలంగాణ' పదమే లేదని, ఢిల్లీ, బీహార్ ఎన్నికల కోసమే కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టినట్లు ఉందని ఆరోపించారు. కొట్లాడకపోతే కేంద్రం మన మాట వినదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ కోసం కేంద్రంతో కొట్లాడితే అందుకు తాము సంపూర్ణ మద్దతు ఇస్తామని ప్రకటించారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం కేంద్రంతో పోరాటం కొనసాగిస్తామని కెటిఆర్ స్పష్టం చేశారు. అప్పులపై కాంగ్రెస్ ప్రభుత్వం అసత్యాలు ప్రచారం చేస్తుందన్నారు. పిఎం రెండు కోట్ల ఉద్యోగాలు, సిఎం 2 లక్షల ఉద్యోగాలు ఇస్తమన్నారని, పిఎం, సిఎం పచ్చి అబద్ధాలు చెప్పున్నారని, కేంద్రంతో సఖ్యతతో రేవంత్‌రెడ్డి ఏం సాధించారని కెటిఆర్ నిలదీశారు. ద్రవ్య వినిమయ 2025–26 బిల్లుపై కెటిఆర్ లేవనెత్తిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అప్పులపై సిఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ రాష్ట్రాన్ని పరిపాలించిన 16 మంది ముఖ్యమంత్రులు చేసిన అప్పు 2014 నాటికి మొత్తం రాష్ట్రం అప్పు రూ.90,160 కోట్లు కాగా, గత పదేళ్లల్లో బిఆర్ఎస్ చేసిన అప్పు 2023 డిసెంబర్ నాటికి అప్పులు, పెండింగ్ బిలుల్లు మొత్తం రూ.8,19,151 కోట్లు ఉందన్నారు. అందులో రూ.6,69,257 కోట్లు అప్పులు కాగా వివిధ శాఖల్లో పెండింగ్ బిల్లులు రూ.1,49,894 కోట్లు ఉన్నాయన్నారు. బిఆర్ఎస్ సాధించిన ఘనత ఏమిటో వాళ్లే చెప్పాలన్నారు. తాము అధికారంలో వచ్చిన పదిహేను నెలల్లో చేసినఅప్పు రూ.1,58,041 కోట్లు, ఇందులో పదేళ్లలో వాళ్లు చేసిన అప్పులకు అసలు, వడ్డీ కలిపి తాము తిరిగి చెల్లించిన మొత్తం రూ.1,53,359 కోట్లు అని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ చేసిన అప్పులకు చెల్లించినవి పోగా 15 నెలల్లో తమ ప్రభుత్వం చేసిన నికర అప్పు రూ.4,682 కోట్లు మాత్రమేనని తెలిపారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ప్లాస్టిక్ రహిత తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం

శాసనమండలి చైర్మన్ సుఖేందర్ రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలంగాణ శాసన మండలిలో గుత్తా సుఖేందర్ రెడ్డిని కలిసి జ్యూట్ బ్యాగును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ప్లాస్టిక్ వాడకంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారి కలుషితం అవుతున్నాయన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించే విధంగా తెలంగాణ ప్రభుత్వం జూట్ బ్యాగుల వాడకంపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, ఇది శుభపరిణామమని ఆయన తెలిపారు.

## మీడియా పాయింట్

### బిజెపి, కాంగ్రెస్ గల్లీలో కుస్తీ, ఢిల్లీలో దోస్తీ : కెపి.వివేకానంద

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని బిజెపి, కాంగ్రెస్ గల్లీలో కుస్తీ, ఢిల్లీలో దోస్తీ చేస్తున్నాయని, అసెంబ్లీ వేదికగా ఈ పార్టీల లోపాయికారి ఒప్పందం బయటపడిందని బిఆర్ఎస్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద విమర్శించారు. గురువారం ఉదయం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ రాసిచ్చిన స్క్రిప్ట్‌ను బిజెపి సభ్యులు అసెంబ్లీలో చదువుతున్నారన్నారు. తాము అడిగే ప్రశ్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇరకాటంలో పడి సమాధానాలు చెప్పలేక బిజెపి సభ్యులతో బిఆర్ఎస్‌పై దాడి చేయిస్తున్నదని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్రం అన్ని అనుమతులిచ్చిందని, అలాంటిది ఓ బిజెపి ఎమ్మెల్యే ఆ అనుమతులను తప్పుపడుతున్నారని విమర్శించారు. బిజెపి ఎమ్మెల్యేలు కాంగ్రెస్ భాష మాట్లాడేకన్నా ఆ పార్టీలో విలీనం అయితే మంచిదన్నారు. అనంతరం ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ కాంగ్రెస్‌కో హటావో దేశ్ కో బచావ్ అంటూ మోదీ చెప్తారన్నారు. కానీ, ఇక్కడ కాంగ్రెస్‌ను కాపాడండి.. తెలంగాణను భ్రష్టు పట్టించండి అన్న రీతిలో బిజెపి వ్యవహరిస్తుందని విమర్శించారు.

**ఆ ఎంఎల్ఎలకు అనర్హత వేటు తప్పదు : పాడి కౌశిక్‌రెడ్డి**



పార్టీ మారినవాళ్లకి అనర్హత వేటు పడక తప్పదని, ఉప ఎన్నికలు తథ్యమని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు కాదని సిఎం రేవంత్‌రెడ్డి సభలో చెప్తున్నారని, ఆయన వ్యాఖ్యలు సుప్రీంకోర్టును అవహేళన చేయడమేనన్నారు. శాంతిభద్రతల మీద ప్రశ్న అడిగితే సమాధానం చెప్పలేదన్నారు. గతంలో తన ఇంటిపైన దాడి చేసిన ఎమ్మెల్యే గాంధీతోపాటు ఆయన అనుచరులపై ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. తన నియోజకవర్గంలో కెసిఆర్ హయాంలో రైతులకు నీళ్లొచ్చేవని, ఇప్పుడు ఎందుకు రావటం లేదని, ఇది ప్రభుత్వ వైఫల్యం కాదా? అని ప్రశ్నించారు.

**ఏ సమస్యల్లేనట్టు పునర్విభజనపై చర్చా? : పాయల్ శంకర్**


రాష్ట్రంలో ఏ సమస్యలు లేనట్టు నియోజకవర్గాల పునర్విభజనపై కాంగ్రెస్ ప్రభుత్వం చర్చ పెట్టిందని బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు బిజెపి ఏదో అన్యాయం చేస్తున్నట్టు మాట్లాడుతున్నారన్నారు. ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు నియోజకవర్గాల పునర్విభజనపై ఎలాంటి చర్చ పెట్టలేదన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండూ కలిసే ఉన్నాయని, అందుకే ఈ రెండు పార్టీలు కలిసి తమిళనాడు సిఎం స్టాలిన్ సమావేశానికి వెళ్లాయని విమర్శించారు. జమ్మూకాశ్మీర్ ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలోనే నియోజకవర్గాల పునర్విభజన జరిగిందని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ నియోజకవర్గాల పునర్విభజనపై చర్చ పెట్టి, మాట్లాడే అవకాశం ఇవ్వలేదన్నారు.

# అవయవాల అక్రమ రవాణా, మార్పిడీకి పాల్పడే వారికి కఠిన శిక్షలు

చట్టాన్ని ఉల్లంఘించి అవయవ మార్పిడికి పాల్పడే వారికి రూ.కోటి జరిమానా, పదేళ్ల జైలు శిక్ష

అమ్మమ్మ, నానమ్మ, తాతయ్య, మనవళ్లు, మనవరాళ్లు పరస్పర అవయవదానం చేయడానికి అనుమతి

శాసనసభలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర రాజనరసింహ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దీర్ఘకాలిక వ్యాధులతో శరీరంలో అవయవాలు దెబ్బతిని అవయవ మార్పిడి అవసరమై అవయవదానం కోసం ఎదురుచూస్తున్న బాధితులకు మేలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర రాజనరసింహ చెప్పారు. ఇప్పటివరకు కేవలం కుటుంబ సభ్యుల నుంచి మాత్రమే అవయవాల దానం స్వీకరించే అవకాశం ఉండగా, తెలంగాణ మానవ అవయవాల మార్పిడి చట్టం (రద్దు) ద్వారా అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలు వారి మనవళ్లు, మనవరాళ్లు పరస్పరం అవయవదానం చేయడానికి అనుమతి లభిస్తుందని చెప్పారు. కాగా అవయవాల అక్రమ రవాణ, అక్రమ మార్పిడిలో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరినీ కఠినంగా శిక్షించేలా కొత్త నిబంధనలు అమల్లోకి వస్తాయని తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించి అవయవ మార్పిడికి పాల్పడే వారికి కోటి రూపాయల జరిమానా, పదేళ్ల జైలు శిక్ష ఉంటుందని మంత్రి వెల్లడించారు. శాసనసభలో గురువారం తెలంగాణ మానవ అవయవాల మార్పిడి (రద్దు) బిల్లును మంత్రి దామోదర రాజ నరసింహ ప్రవేశపెట్టగా ఈ బిల్లును శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా మంత్రి దామెదర రాజనరసింహ మాట్లాడుతూ అవయవదానానికి సంబంధించి 1994లో కేంద్ర ప్రభుత్వం 'తోవ' చట్టం చేసిందని, ఈ చట్టాన్ని 2011లో కేంద్ర ప్రభుత్వం సవరించి 'తోటా' (టిహెచ్ఓటిఏ) చట్టంగా మార్చి ఇందుకు సంబంధించి నిబంధనలను 2014లో విడుదల చేసిందన్నారు. దేశంలోని 24 రాష్ట్రాల్లో 'తోట' చట్టం అమలులో ఉందని, ఆ చట్టం ప్రకారం 2014లో చేసిన నిబంధనలే అమలులో ఉన్నాయని తెలిపారు. ఇదే క్రమంలో తెలంగాణ ప్రభుత్వం 1991 'తోవ' చట్టం, 2011లోని 'తోట' చట్ట, నిబంధనలను అడాప్ట్ చేసుకుని 2025 తెలంగాణ మానవ అవయవాల మార్పిడి (రద్దు) బిల్లును తీసుకువచ్చిందని చెప్పారు. గుండె, కిడ్నీ, కాలేయం వంటి అవయవాలతో పాటు చర్మం, ఎముక మజ్జ రక్త నాళాలు, గుండె నాళాలు, మార్పిడి వంటివి కూడా చట్ట పరిధిలోకి వస్తాయన్నారు. బ్రెయిన్ డెడ్ దోనర్ల నుంచి వీటిని సేకరించి, అవసరమైన వారికి మార్పిడి చేయడానికి వీలుపడుతుందని వెల్లడించారు. ఇప్పటివరకు కేవలం కుటుంబ సభ్యుల నుంచి మాత్రమే అవయవాల దానం స్వీకరించే అవకాశం ఉండగా, ఈ చట్ట సవరణ ద్వారా అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలు వారి మనవళ్లు, మనవరాళ్లకు అవయవదానం చేయడానికి అనుమతి లభిస్తుందని చెప్పారు. అవయవదానాన్ని ప్రోత్సహించేందుకు ''అవయవాలు, కణజాల సేకరణ కేంద్రాలు, స్టోరేజీ కేంద్రాలు'' ఏర్పాటుతో పాటు పారదర్శకత పెరుగుతుందని తెలిపారు. ఈ చట్ట సవరణ మెడికల్ టూరిజం బలోపేతానికి దోహదపడుతుందన్నారు. అంతకు ముందు బిల్లుపై జరిగిన చర్చలో బిఆర్ఎస్ సభ్యులు టి.హరీష్‌రావు పాల్గొంటూ ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త చట్టానికి బిఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. బ్రెయిన్ డెడ్‌తో వ్యక్తి అవయదానం చేసే కుటుంబాలు పేదవారైతే వారికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించడం, ఇతర మార్గాలతో వారిని ఆదుకోవాలన్నారు. బిఆర్ఎస్ సభ్యులు పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ అవయవాల దానంపై అవగాహన కల్పించేందుకు ఉద్యమ స్ఫూర్తితో పనిచేయాలన్నారు. బిఆర్ఎస్ సభ్యులు కె.తారకరామారావు మాట్లాడుతూ అవయవాల దానానికి సంబంధించి అంగీకారపత్రం ఇచ్చేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, ఇందుకు శాసనసభలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయాలని, ఇష్టం ఉన్న సభ్యులదరూ హామీపత్రాలను ఇస్తారని సూచించారు. కాంగ్రెస్ సభ్యులు ఆదినారాయణ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమం ఏర్పాటు చేస్తే ముందుగా తాను అవయవాల దానం చేయడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. సభ్యులు రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ అవయవాల దానానికి సంబంధించి జిల్లా, మండల గ్రామీణ స్థాయిలో విస్తృతంగా ప్రచారం కల్పించాలన్నారు. సభ్యులు భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ అవయమార్పిడి శస్త్రచికిత్సతో పాటు ఆ తర్వాత కూడా బాధితులకు ప్రభుత్వం అండగా నిలవ్వాలని సూచించారు. సభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ 1964లో ఉస్మానియాలో మొట్టమొదటి కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స చేశారని, అవయవాల మార్పిడిని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పెద్దఎత్తున చేపట్టాల్సిన అవసరముందన్నారు.

**మండలిలోనూ ఆమోదం**

అవయవదానం చేసే విషయంలో అక్రమాలకు పాల్పడినట్లు తెలితే కోటి రూపాయల జరిమానాతో పాటు పదేళ్ల జైలు శిక్ష విధించేలా బిల్లు రూపొందించామని వైద్య ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు. శాసనమండలిలో గురువారం తెలంగాణ అవయవ మార్పిడి చట్టం (రద్దు) బిల్లును మంత్రి దామోదర రాజనర్సింహ ప్రవేశపెట్టారు. బిల్లును సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. మానవ అవయవాలతో వ్యాపారాన్ని నివారించడానికి ఈ బిల్లును తెచ్చామని మంత్రి రాజనర్సింహా చెప్పారు. రాష్ట్రంలో అవయవ మార్పిడి దందాను అరికట్టేందుకు ఈ బిల్లు దోహదం చేస్తుందన్నారు. అనంతరం పదవీకాలం పూర్తయిన సభ్యులు తమ అనుభావాలను సభలో ప్రసంగాల ద్వారా వివరించారు.

## ఆర్‌టిసిని పరిరక్షించాలి



శాసనసభలో సిపిఐ శాసనసభాపక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ప్రతినిత్యం లక్షలాది మంది ప్రజలను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చుతున్న టిజిఆర్‌టిసిని పరిరక్షించాలని సిపిఐ శాసనసభాపక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని కోరారు. శాసనసభలో గురువారం జీరో అవర్‌లో ఆర్‌టిసి పరిరక్షణ అంశాన్ని ఆయన ప్రస్తావిస్తూ ఆర్‌టిసి ప్రజల సంస్థ అని, లక్షల కోట్ల విలువైన ఆస్తులున్న ఈ సంస్థను ప్రైవేట్‌పరం కాకుండా ప్రభుత్వం కాపాడాలన్నారు. ప్రభుత్వంలో ఆర్‌టిసి విలీనం ప్రక్రియను పూర్తిచేసి ఉద్యోగులకు పిఆర్‌సి బకాయిలను చెల్లించాలని కోరారు. ఆర్‌టిసి యూనియన్లను రద్దు చేయడంతో కార్మికులు అనేక కష్టనష్టాలకు గురవుతున్నారని, యూనియన్లను తక్షణమే పునరుద్ధరించాలని కూనంనేని సాంబశివరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

**గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు ఇవ్వాలి**

రాష్ట్ర వ్యాప్తంగా అనేక గ్రామాలు, పట్టణాలు, నగర ప్రాంతాల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేద, దళితవర్గాల వారందరికీ అదే ప్రాంతంలో ఇళ్ల స్థలాలను కేటాయించి శాశ్వతంగా పట్టాలను ఇవ్వాలని సిపిఐ శాసనసభా పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశంపై సభలో చర్చించాలని కోరుతూ శాసనసభలో గురువారం ఆయన వాయిదా తీర్మానం ఇచ్చారు. కాగా ఈ తీర్మానాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు.

## 8వ షెడ్యూల్‌లో 'గోర్‌బోలి' భాష

శాసనసభ ఏకగ్రీవ తీర్మానం



**ప్రజాపక్షం/ హైదరాబాద్:** దేశ వ్యాప్తంగా ఉన్న 'గోర్ బోలి' భాషను 8వ షెడ్యూల్‌లో చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ మేరకు శాసనసభలో గురువారం ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తీర్మానాన్ని ప్రవేశపెడుతూ దేశంలోని 11 రాష్ట్రాల్లో బంజారాలు మాట్లాడే గోర్ బౌలి భాషకు ప్రత్యేకత, విశిష్టత ఉందన్నారు. దేశంలో 700 భాషలు ఉన్నప్పటికీ 1950లో రాజ్యాంగంలోని 8 షెడ్యూల్‌లో ముందుగా 14 భాషలను మాత్రమే చేర్చి వాటిని అధికార భాషలు గుర్తించారని తెలిపారు. ఆ తర్వాత మరో 8 భాషలను షెడ్యూల్ 8లో చేర్చడం ద్వారా అధికార గుర్తింపు ఇచ్చారన్నారు. దేశవ్యాప్త భాష అయిన గోర్ బోలిని 8వ షెడ్యూల్‌లో చేర్చడం ద్వారా తగ్గిన గౌరవం దక్కుతుందని ఆ దిశగా కేంద్రం చర్యలు తీసుకోవాలని మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు.

**సిఎంకు గిరిజన ఎంఎల్ఏ కృతజ్ఞతలు**

గోర్ బోలి' భాష రాజ్యాంగంలోని 8వ షెడ్యుల్‌లో చేర్చాలని శాసనసభలో తీర్మానం చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గిరిజన ఎంఎల్ఏలు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన ఎంఎల్ఏలు బాలునాయక్, రాంచంద్రు నాయక్, రాందాస్ నాయక్ అసెంబ్లీ ప్రాంగణంలోని సిఎం ఛాంబర్‌లో రేవంత్‌రెడ్డిని శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

## నియోజకవర్గాల సమస్యలను పరిష్కరించాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వివిధ నియోజకవర్గాల్లో ఉన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని పలువురు ఎంఎల్ఎలు కోరారు. శాసనసభలో గురువారం జరిగిన జీరో అవర్‌లో పలువురు సభ్యులు తమ నియోజకవర్గాల సమస్యలను ప్రస్తావించారు. కాంగ్రెస్ సభ్యులు సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ బోధన్‌లోని షుగర్ ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభించాలన్నారు. బిఆర్ఎస్ సభ్యులు బండారు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ వరంగల్ హైవేపై ఉప్పల్ వద్ద నిర్మిస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జిని తక్షణమే పూర్తి చేయాలన్నారు. శేరిలింగంపల్లి నియోజవర్గంలోని మూడు సర్కిళ్లలో పారిశుద్ధ్య కార్మికులు 50శాతం కూడా లేరని దీంతో అనేక సమస్యలు తలెత్తున్నాయని, అదేవిధంగా ఈ నియోజకవర్గంలో బాంబే హైవేకు ఒక్క పక్క మాత్రమే అభివృద్ధి జరుగుతుందని, రెండవ భాగం కూడా చర్యలు తీసుకోవాలని అరికెపూడి గాంధీ కోరారు. సిర్పూర్ కాగజ్‌నగర్ పేపర్ మిల్లులో యూనియన్లకు ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని బిజెపి సభ్యులు హరీష్ బాబు కోరారు. రేషన్ కార్డు లబ్ధిదారులకు ఉగాది నుంచి సన్న బియ్యం ఇవ్వనున్న నేపథ్యంలో బియ్యం మాఫియాను కట్టడి చేయాలని పైడి రాకేశ్‌రెడ్డి సూచించారు. కామారెడ్డిలో పేదలకు అప్పులిస్తున్న వడ్డీ వ్యాపారులను పోలీసులు అరెస్టు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని బ్యాంకులు ఆధారాలు ఉంటే తప్ప రుణాలు ఇవ్వవని, ఏ ఆధారం లేని, రైతులు, వ్యవసాయ కూలీలు అత్యవసరంగా డబ్బులు అవసరం పడితే మరి ఎవరు ఇస్తారని ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని రాంపూర్‌లో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డును తక్షణమే అక్కడి నుంచి తొలగించాలని కోరగా, గత ప్రభుత్వం హయాంలో ఫార్మాసిటీ కోసం సేకరించిన 114 వేల ఎకరాలకు సంబంధించి రైతులకు అక్కడ గుంట భూమి చొప్పున కేటాయించి లేఅవుట్ జరిగిందని వారిందరికి పట్టాలు అందజేయాలని సబితా ఇంద్రారెడ్డి కోరారు. టి.ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ శంషాబాద్‌లోని 1 నుంచి 75 సర్వే నంబర్లలో రైతులు సుదీర్ఘ కాలంగా పంట సాగు చేసుకుంటున్నారని ఇప్పుడు ఆ స్థలాన్ని పరిశ్రమల కోసం కేటాయిస్తున్నామని అధికారులు చెప్పడం అన్యాయమన్నారు.

## 'ప్లాస్టిక్ వినియోగం-ప్రమాద ఘంటికలు'

పుస్తకాన్ని ఆవిష్కరించిన సిఎం రేవంత్‌రెడ్డి

సే నో టూ ప్లాస్టిక్: మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో ఎవరూ ప్లాస్టిక్ వాడొద్దని... పర్యావరణాన్ని నష్టపరచొద్దని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. శాసనసభ ప్రాంగణంలోని సిఎం ఛాంబర్‌లో గురువారం ''ప్లాస్టిక్ వినియోగం ప్రమాద ఘంటికలు'' అనే పుస్తకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. అదే విధంగా శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క కూడా ఈ పుస్తకాన్ని వారి ఛాంబర్‌లో ఆవిష్కరించారు. తెలంగాణ ఎంఎల్ఏలు, ఎంఎల్‌సిలకు జూట్ బ్యాగు, పుస్తకం, కాపర్ వాటర్ బాటిల్, స్టీల్ టిఫిన్ బాక్సు, బట్ట సంచులను మంత్రి కొండా సురేఖ అందజేశారు. కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖతో పాటు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పిసిబి) మెంబర్ సెక్రటరీ గుగులోత్ రవి ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు 'సే నో టూ ప్లాస్టిక్' నినాదాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్ళాలన్నారు.

## నకిలీ చేనేత ఇక్కత్ ఉత్పత్తులను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని కేంద్రం ఆదేశం

ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** దేశ, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అడ్డగోలుగా సాగుతున్న నకిలీ చేనేత ఇక్కత్ ఉత్పత్తులను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖకు అధికారిక లేఖ ద్వారా కేంద్రం ఆదేశించినట్లు భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి గురువారం తెలిపారు. గత నెల 4న పోచంపల్లి చేనేత పరిశ్రమ, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల, నకిలీ చేనేత ఇక్కత్ వస్త్రాల తయారీ, అమ్మకాలను నిలిపివేయాలని కోరుతూ కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్‌కు ఆయన రాసిన లేఖకు మంత్రి స్పందిస్తూ తక్షణమే డూప్లికేట్ హ్యాండ్లూమ్ ఇక్కత్ వస్త్రాలను అరికట్టేందుకు తగు చర్యలు చేపట్టాలని గురువారం తెలంగాణ రాష్ట్ర టెక్స్ టైల్ అండ్ హ్యాం డ్లూమ్ డిపార్ట్‌మెంట్‌కు ఆదేశాలు జారీ చేసిందనీ లేఖ విడుదల చేసారు. ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ ఆయన కేంద్ర ప్రభుత్వ చేనేత జౌళి శాఖ మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యక్షంగా పరోక్షంగా 50 వేల కుటుంబాలు చేనేత పరిశ్రమపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారని ముఖ్యంగా పోచంపల్లి కేంద్రంగా దాదాపు 40 గ్రామాల చేనేత కార్మికులు తయారు చేస్తున్న 15 వేల చేనేత వస్త్రాల విలువ దాదాపు 1000 కోట్లతో వ్యాపారం జరుగుతున్నట్లు ఎంపి రాసిన లేఖలు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 30 వేల చేనేత వస్త్రాల్లో 15 వేల ఇక్కత్ చీరలు వస్త్రాలు కేవలం పోచంపల్లిలోని ఉత్పత్తి చేస్తున్నారని ఉద్ఘాటించారు. 2000 సంవత్సరం నుంచి ఈ డూప్లికేట్ చీరలు, వస్త్రాల తయారీ మొదలై గత పదేళ్ల నుంచి పోచంపల్లి ఇక్కత్ చేనేత మార్కెట్‌ను ఈ నకిలీ చీరలు ఇప్పటి ముబ్బడిగా రాజ్యమేలుతూ వ్యాపారాలు చేస్తూ చేనేత కార్మికుల కుటుంబాలను రోడ్డున పడేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు మంత్రికి విన్నవించారు. ఇక్కత్ చీరల డూప్లికేషన్ వల్ల పోచంపల్లి మార్కెట్ పూర్తిగా నష్టాల్లో పూరుకుపోయిందని చేనేత కార్మికుల జీవనోపాధి కరువైందన్నట్లు వాస్తవాలను పొందుపరిచారు. కార్మికుల హస్తకళ నైపుణ్యంతో అహర్నిశలు కష్టపడి నేసిన రూ.10 వేల విలువైన పోచంపల్లి చేనేత పట్టు చీరను కేవలం డిజైన్ కాపీ చేసి మిల్లుల ద్వారా నకిలీ ఇక్కత్ చీరలను తయారుచేసి కేవలం రూ.600లకే మార్కెట్లో లభించేటట్లు కస్టమర్లను బురిడీ కోరుతూ చేనేత కార్మికులను కోలుకోలేని దెబ్బతీస్తున్నారని లేఖలో రాశారు. రకరకాల కారణాల చేత అసలు పోచంపల్లి పట్టు, కాటన్ చీరలకు డిమాండ్ తగ్గిందని మంత్రి ముందు వాపోయారు. పోచంపల్లి ఇక్కత్ డిజైన్లు, జియోగ్రాఫికల్ ఇండికేషన్ రిజిస్ట్రీ (జిఐఆర్) కింద నమోదుకు రక్షణ లేకుండా పోయిందని, వేలాది మంది చేనేత కార్మికుల జీవితాలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయని నేత కార్మికులు జీవనోపాధి కోసం ఇతర వృత్తులు నగరాలకు వలస వెళ్తున్నారని డీస్కిల్లింగ్ జరుగుతుందని లేఖలో పేర్కొనడమే కాకుండా పోచంపల్లి ఇక్కత్ చీరల నకిలీలను నిరోధించేందుకు రూ.100 కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయాలని ఇంకా అనేక సమస్యలను లేక ద్వారా మంత్రితో ఏకరువు పెట్టారు. తెలంగాణ రాష్ట్రమే కాక దేశవ్యాప్తంగా నకిలీ చేనేత ఉత్పత్తులను అరికట్టేందుకు కేంద్రం చర్యలు చేపట్టేందుకు తీసుకున్న స్పందన పట్ల పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు. దీంతో చేనేత పరిశ్రమపై ఆధారపడుతున్న ఆధారపడి పని చేస్తున్న కార్మికుల జీవితాల్లో కొత్త వెలుగు వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పోచంపల్లి మండల జిల్లా వ్యాప్తంగా చేనేత కార్మికులు కేంద్రమంత్రి ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



# రైతులను ఆదుకోవాలి

ఎకరాకు రూ.25 వేలు ఇచ్చి ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు ఇచ్చి ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి కోరారు. రైతులను ఆదుకోవడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత అని, ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వైపరీత్యాలతో జరిగిన పంటల నష్టాన్ని అంచనా వేసిందన్నారు. శాసనమండలిలో గురువారం జీవన్ రెడ్డి ప్రత్యేక ప్రస్తావన చేస్తూ మాట్లాడుతూ జగిత్యాలలో సుమారు 10 వేల ఎకరాలలో వివిధ పంటలు నష్టపోయాయని వివరించారు. అనేక అవరోధాలను అధిగమించి రైతు చేతికి పంట వచ్చే సమయానికే ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయే పరిస్థితి దురదృష్టకరమని, ఇది రైతాంగానికి గొడ్డలిపెట్టు లాంటిదని ఆవేదన వ్యక్తం చేశారు. వరికి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న వేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారికి రూ.20 వేల నుంచి రూ.30 వేల సాయం అందించాలని కోరారు.

**ఎంఎండిఆర్ నుంచి సింగరేణికి మినహాయింపు ఇవ్వాలి : మధుసూదనచారి**

బిఆర్ఎస్ ఎంఎల్‌సి మధుసూదనాచారి మాట్లాడుతూ గుజరాత్‌లోని మినరల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థ తరహాలోనే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మైన్స్ మినరల్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్ యాక్ట్ (ఎంఎండిఆర్) నుంచి రాష్ట్రంలోని సింగరేణి సంస్థకు మినహాయింపు ఇవ్వాలని, ఆ దిశగా కేంద్ర ప్రభుత్వాన్ని అంగీకరించేలా ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఎంఎండిఆర్ ప్రకారం సింగరేణి సంస్థ కూడా బొగ్గు బ్లాక్ అలైన్‌మెంట్ టెండర్లలో పాల్గొనే పరిస్థితి వచ్చిందన్నారు. సింగరేణి సంస్థకు ఎంతో ఘనమైన చరిత్ర ఉన్నదన్నారు. సింగరేణి సంస్థ మనుగడ, తెలంగాణ అవసరాల రీత్య గోదావరి లోయలో ఉన్న మైనింగ్ కార్యాకలాపాలు సింగేణి కేంద్రీకృతం చేసి పని చేయాలని అన్నారు.

ఎమ్మెల్సీ కూర ఘోత్తమ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల హామీలో ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని చెప్పారని, తాత్కాలిక ఉపశమనం తరహా కనీసం వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో యూనివర్సిటీల నుంచి పాఠశాల వరకు అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసే ఉపాధ్యాయులు అనేక మంది ఉన్నారని, వారి వేతనాలు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, శాశ్వత ఉపాధ్యాయులతో పోలిస్తే చాలా తక్కువగా ఉన్నాయని, అందుకే వారికి కనీస వేతనాలను పెంచాలని కోరారు. మీర్జా రెహమత్ బేగ్ మాట్లాడుతూ సులేమాన్ రిజర్వాయర్ నీటిని తగ్గించారని, 2.4 ఎంజిడి నీరు సరఫరా అవుతుందని, దీనిని పెంచాలని కోరారు. ఇంకా రెండు నెలల వేసవికాలం ఉన్నందున తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు.

**ఎపిలో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగులను బదిలీ చేయాలి : ప్రొఫెసర్ కోదండరామ్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగులను స్వరాష్ట్రానికి బదిలీ చేయాలని సభ్యులు ప్రొఫెసర్ ఎం. కోదండరామ్ కోరారు. కుటుంబం తెలంగాణలో, ఉద్యోగం ఆంధ్రప్రదేశ్‌లో ఉండటం వల్ల ప్రయాణాలు చేయడంతో వారి ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని, ఇబ్బందులకు గురవుతున్నారని, వారిని స్వరాష్ట్రానికి బదిలీ చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని అన్నారు. ముదిరాజ్ సామాజికవర్గాన్ని బిసి 'డి' గ్రూప్ నుంచి 'ఏ' గ్రూపులో చేర్చాలని, డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాష్ కోరారు.

**పసి పిల్లల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలి : ఎం.ఎస్.ప్రభాకర్**

పసి పిల్లల అమ్మకాలను అరికట్టాలని ఎం.ఎస్. ప్రభాకర రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గుజరాత్, ఉతర ప్రదేశ్ రాష్ట్రాల నుంచి పసి పిల్లలను తీసుకువచ్చి హైదరాబాద్ నగరంలో అమ్మకాలు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం చట్టం తీసుకువచ్చి పసిపిల్లలు అమ్మకాలు నియంత్రించాలన్నారు. పసి పిల్లల విక్రయాలలో ముఠా పని చేస్తుందని ప్రభాకర్ రావు సభ దృష్టికి తీసుకొచ్చారు. భవన నిర్మాణరంగంలో పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని సభ్యులు తీన్మార్ మల్లన్న కోరారు. భద్రాచలంలో నిర్మాణంలో ఉన్న భవనం కూలిపోవడం దురదుష్టకరమన్నారు. మరణించిక కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలన్నారు. నిర్మాణ కార్మిక కుటుంబానికి ప్రతినెల రూ.ఐదువేల పెన్షన్ చెల్లించాలన్నారు.

**ఎల్‌ఆర్ఎస్ గడువు పొడిగించాలి : రవీందర్ రావు**

ఎల్‌ఆర్ఎస్ గడువు పొడిగించాలని సభ్యులు రవీందర్‌రావు కోరారు. వేలాది మంది ప్రజలు ఈసేవ, మీసేవ కేంద్రాలకు పెద్ద సంఖ్యలో రావడంతో సర్వర్‌లు పనిచేయడంలేదన్నారు. గతంలో ఎల్‌ఆర్ఎస్ ప్రొసీడింగ్స్‌ను మ్యాప్‌లతో ఇచ్చేవారని, ప్రస్తుతం అలా ఇవ్వడం లేదన్నారు. ఎల్‌ఆర్ఎస్ ఫీజులో ఈనెల 31 వరకు రాయితీ ఇస్తున్నారని, ఎల్‌ఆర్ఎస్ ప్రక్రియలో అనేక సమస్యలు వస్తున్నందున ఈ గడువును ప్రభుత్వం పొడిగించాలని ఆయన కోరారు.


గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
ఎల్.బి.నగర్ సర్కిల్ - 4
NIT No. 31/EEC-4/LBNR/GHMC/2024-25, షార్ట్ టెండర్ ప్రకటన తేది: 27.03.2025
పని పేరు: నిర్వహణ పనులు: 02 నెం.లు, అంచనా విలువ: రూ.68.50 లక్షలు, బిడ్ స్వీకరణకు ప్రారంభ / ఆఖరి తేదీ & సమయం: 27.03.2025న మ.03.00గం.ల నుండి 03.04.2025న మ.03.00గం.ల వరకు. అధికారి పేరు & చిరునామా: శ్రీ వి.కార్తీక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎల్.బి.నగర్ సర్కిల్-4, జిహెచ్‌ఎంసి. సెల్: 9701365519. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా http://tender.telangana.gov.inలో పొందవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎల్.బి.నగర్ సర్కిల్-4, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 12293-PP/CL/ADVT/1/2024-25, Date: 27-03-2025

ప్రజాపక్షం
శుక్రవారం, మార్చి 28

# బడ్జెట్ గారడీకి ముగింపెన్నడో?

బడ్జెట్‌లు ప్రవేశపెట్టేటప్పుడు అంకెలను ఘనంగా ప్రకటిస్తుంటారు ఆర్థిక మంత్రులు. కాని, అవి వాస్తవ రూపం దాల్చేసరికి వెక్కిరిస్తుంటాయి. ఇందుకు తాజా ఉదాహరణ బిఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా ప్రవేశపెట్టిన చివరి బడ్జెట్. 2023–24 వార్షిక బడ్జెట్ వాస్తవ ఖర్చు(ఆక్చువల్స్)పై అకౌంట్స్ ఎట్ గ్లాన్స్‌పై కాగ్ నివేదికను గురువారం శాసనసభ ముందుంచారు రాష్ట్ర విత్త మంత్రిగా కూడా వ్యవహరిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క. ఆ ఏడాది రూ.2,77,601కోట్లతో ఆమోదం పొందిన బడ్జెట్ ఆచరణలోకి వచ్చేసరికి రూ.2,19,306 కోట్లుకు కుంచించుకుపోయింది. ఇది వందలో 79శాతం మాత్రమే. అంటే వాస్తవ బడ్జెట్ కంటే రూ.58,295 కోట్లు తక్కువ. అలాగే రెవెన్యూ వ్యయం సైతం సవరించిన అంచనాలను కలిపి రూ.2,34,531 కోట్లుగా ప్రకటించగా, ఖర్చు చేసింది. రూ.1,68,514కోట్లే. చెప్పిన దానికంటే రూ.66,017 కోట్లు తక్కువ ఖర్చు చేశారు. రెవెన్యూ రాబడిలో కూడా 78 శాతమే వాస్తవ రూపం దాల్చింది. అంటే రూ.2,16,567కోట్లు అంచనా వేసుకోగా, రూ.1,69,293 కోట్లు మాత్రం ఆదాయం వచ్చింది. అటు రెవెన్యూ రాబడి, రెవెన్యూ వ్యయంలో 45 శాతం అంటే రూ.75,456 కోట్లు అనివార్య ఖర్చులకు పోతాయి. అంటే అప్పులు, వడ్డీలు, ఉద్యోగుల జీతభత్యాలు, రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్‌లకు వెళ్ళేవి. మిగతా మొత్తాన్నే సంక్షేమానికి వెచ్చించాలి. అందుకే ఆర్థిక సంవత్సరంలో సబ్సిడీలకు రూ.13,986 కోట్లు కేటాయించగా, రూ. 9,411కోట్లు మాత్రమే ఖర్చు అయింది. అసలులో అది 67శాతం. అప్పులు భారం పెరుగుతుంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోతాయి. కొత్త పెన్షన్‌లు రావు. పనులు చేసిన కాంట్రాక్టులకు బిల్లుల చెల్లింపు జరగవు. ఇవన్నీ తదుపరి సర్కార్‌లపై భారం పడుతుంది. అలాగే అలవిమాలిన ఎన్నికల హామీలు కూడా అటకెక్కుతుంటాయి.

మళ్ళీ వచ్చే బడ్జెట్‌లో కూడా ఇదే తంతు సాగుతోంది. ఇదంతా ఒక విష వలయం. ఇందులో మోసపోయేది అమాయక ప్రజలే. బడ్జెట్ అంకెల హోరులో, అధికార పార్టీ వందిమాగధుల ప్రచారార్భటంలో ప్రజలు తడిసి ముద్దవ్వాల్సిందే. వాస్తవాలు ప్రజలకు తెలిసే సరికి పుణ్యకాలం గడిచిపోతుంది. ప్రతిపాదిత బడ్జెట్ లో ఏమేరకు ఖర్చయ్యిందో వెల్లడయ్యేందుకు రెండేళ్ళు అవసరం. ఎందుకంటే ఆర్థిక సంవత్సరం ప్రారంభమయ్యే ఏప్రిల్ 1వ తేదీకి ముందు నెలలో బడ్జెట్‌ను ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టి, ద్రవ్య వినిమయ బిల్లు ఆమోదం తీసుకుంటుంది. ఆమోదిత బడ్జెట్ అమల్లోకి వచ్చిన తరువాత ఎంత ఖర్చయిందో తెలియాలంటే ఆర్థిక సంవత్సరం ముగిసే మరుసటి ఏడాది మార్చి 31కి పూర్తవుతుంది. ఆ తరువాత మాసంలో లెక్కలు తేల్చి, కాగ్ ఆడిటింగ్‌కు రాష్ట్ర ప్రభుత్వం పంపుతుంది. రాష్టాలు ఇచ్చే అంకెలను జల్లెడబట్టి, ఎంత వరకు బడ్జెట్ ఖర్చయింది? ఎంత వరకు పక్కదోవ పట్టింది? ఎంత ఖర్చు కాకుండా పోయింది? వంటి వివరాలతో కూడిన నివేదిక పూర్తిచేసి గవర్నర్‌కు పంపడం ఆనవాయితీ. ఆ తరువాత ప్రభుత్వానికి పంపి, ఆ నివేదికను మరో ఏడాది బడ్జెట్ సమావేశాల చివరి రోజు ప్రభుత్వం శాసనసభ ముందుంచుతుంది. ఈ లోగా, కొత్త బడ్జెట్ అంకెల్లో మునిగే ప్రజలకు పాత బడ్జెట్‌లో ఎంత ఖర్చయిందో తెలుసుకునే ధ్యాస ఉండదు. దీర్ఘకాలంగా అధికారంలో ఉండే పార్టీలు కాగ్ నివేదికలను శాసనసభల ముందుంచాల్సిన రాజ్యాంగ బద్ధ కర్తవ్యాలను సైతం విస్మరిస్తున్నాయి.

ప్రభుత్వ ఆదాయ, వ్యయాలపై ప్రతి నెలా కాగ్‌కు నివేదించినా, ఎప్పటికప్పుడు స్క్రూటినీ జరగదు. ఈ ప్రక్రియను మరింత పటిష్టం చేయడంతో పాటు, కొత్త బడ్జెట్ ప్రవేశపెట్టేనాటికే, ప్రస్తుత బడ్జెట్ వాస్తవ అంకెలు ఉజ్జాయింపుగా తెలిసేలా ఒక విధానాన్ని ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది. ప్రభుత్వాలు కూడా అబద్ధాల ఉయ్యాలలో ప్రజలను ఊపకుండా కట్టడి చేయాలంటే, ఊహల పల్లకి ఎక్కించే బడ్జెట్‌లను నియంత్రించే చట్టాలు రావాలి.


# రేవంత్‌వైపే జనం : ‘గ్రోక్’ విశ్లేషణ!



ఎస్‌కె. జకీర్
సీనియర్ జర్నలిస్ట్

“అసెంబ్లీ ఎన్నికలు ఇంకా మూడున్నర సంవత్సరాల దూరంలో ఉన్నాయి. రేవంత్ మళ్లీ సిఎం కావడానికి సానుకూల అంశాలు: 2023లో బిఆర్‌ఎస్‌ను ఓడించిన క్రెడిట్, కాంగ్రెస్‌ను బలోపేతం చేసిన చాకచక్యం, యువత, మహిళల మద్దతు, ఉచిత బస్సు, ఉద్యోగాల కల్పన. తెలంగాణలో బిజెపి పూర్తి ఆధిపత్యం సాధించలేదు. బిఆర్‌ఎస్ బలహీనంగా కనిపిస్తోంది”.అని “గ్రోక్” ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విశ్లేషించింది. ‘రేవంత్ రెడ్డి విజయం సాధిస్తారా’? అనే ప్రశ్నకు ఎ.ఐ.ఇచ్చిన సమాధానం ఇది. అయితే ఆయనకున్న ప్రతికూల అంశాలను కూడా తెలియజేసింది.

“అతి తక్కువ సమయంలో విఫల సిఎం అని కొందరు విమర్శిస్తున్నారు. బిఆర్‌ఎస్ తిరిగి పుంజుకుంటే లేదా బిజెపి ఊపు తెచ్చుకుంటే రేవంత్‌కు సవాల్‌గా మారవచ్చు. నీటి సమస్యలు, ఆర్థిక ఇబ్బందుల వలన ప్రజా వ్యతిరేకత పెరిగితే రేవంత్ విజయావకాశాలపై ప్రభావితం చూపవచ్చు. పాలనా పని తీరు, ప్రజల్లో సంతృప్తి, విపక్ష బలం, ఎన్నికల సమయంలో తలెత్తే పరిణామాలు ఎన్నికల్లో జయాపజయాలను నిర్దేశిస్తాయి. ప్రస్తుతం ఆయన దృఢమైన స్థితిలో ఉన్నారు. కానీ రాజకీయాల్లో ఊహించని మలుపులు సర్వసాధారణం. రేవంత్ విజయం ఆయన చర్యలు, ప్రత్యర్థుల బలాబలాలపై ఆధారపడి ఉంటుంది. రేవంత్ రెడ్డి 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్‌ను తెలంగాణలో అధికారంలోకి తెచ్చారు, బిఆర్‌ఎస్ ఆధిపత్యాన్ని ఛేదించి 64 సీట్లతో విజయం సాధించారు. రూ.18,000 కోట్ల రైతు రుణమాఫీ, 55,000 ప్రభుత్వ ఉద్యోగాల సృష్టి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం (మహాలక్ష్మి పథకం), రూ.500కి గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ (గృహ జ్యోతి) వంటి హామీలను నెరవేర్చడంలో ఆయన పురోగతి సాధించారు. రూ.2,500 నెల వారీ సాయం, రూ.4,000 పెన్షన్ వంటి కొన్ని హామీలు ఇంకా పూర్తిగా అమలు కాలేదు. అమలు చేయలేని మాటల మనిషి అని బిజెపి, బిఆర్‌ఎస్ విమర్శిస్తున్నాయి. నీటి కొరత, రైతు సమస్యలపై కూడా ప్రజల్లో కొంత అసంతృప్తి కనిపిస్తోంది. ఉత్సాహవంతమైన నాయకత్వం, బలమైన ఉపన్యాసాలు, రాహుల్ గాంధీతో సాన్నిహిత్యం రేవంత్ కు ప్లస్ పాయింట్లు. ఉత్తమ్ కుమార్ రెడ్డి, భట్టి విక్రమార్కలతో రేవంత్ కు అంతర్గత విభేదాలున్నాయి. రేవంత్ స్ట్రైకింగ్ రేట్ పెరగాలంటే “మిగిలిన హామీలను వేగంగా అమలు చేయడం, ప్రజల్లో విశ్వాసం నిలపడం ముఖ్యమైన అంశాలు” అని ‘గ్రోక్’ చెబుతోంది.




హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలో మిగతా ప్రాంతాల్లో కూడా రియల్ ఎస్టేట్ కుదేలైపోయింది. ఎంఐఎం శాసనసభాపక్ష నాయకుడు అక్బరుద్దీన్ ఒవైసీ అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, ప్రభుత్వాన్ని ఉతికి పారేశారు. నిజం చెప్పకుండా దాచిపెట్టి జనాన్ని మభ్య పెడుతూ ఊరిస్తే ఆ జనమే ప్రభుత్వానికి, పార్టీకి ఉరి వేస్తారన్న సంగతి రేవంత్‌కు తెలియనిది కాదు. ఫామ్ హౌస్‌లో కూర్చొని కెసిఆర్ అభివృద్ధి చేశారు. కానీ రేవంత్ రెడ్డి సచివాలయంలో కూర్చుని కూడా పనులు చేయలేకపోతున్నారు అనే ప్రచారాన్ని బిఆర్‌ఎస్ సోషల్ మీడియా జనంలోకి బలంగా తీసుకువెడుతోంది. వీటిని కౌంటర్ చేసే మెకానిజం లేదు. పైగా రేవంత్ విధేయుల బృందం ‘పైరవీలు’ చేసుకోవడానికే ఆసక్తి చూపుతున్నట్టు సెక్రెటేరియట్ కారిడార్లలో వినిపిస్తున్న సంగతి. రియల్ ఎస్టేట్ రంగం 2022 నుంచే పతనం దిశగా పయనిస్తున్న సంగతి కాంగ్రెస్ బలంగా ప్రచారం చేయలేకపోతోంది.

కాంగ్రెస్ పార్టీతో వచ్చిన ఇబ్బంది ఏమిటంటే ఎవరూ బాధ్యత వహించరు. ప్రభుత్వాన్ని సొంతం చేసుకోరు. అధికారంలోకి వచ్చిందాకా జనం పక్షాన ఉంటారు. అధికారంలోకి వచ్చాక వాళ్ళ పని వాళ్ళు చూసుకుంటారు. గ్రూపులు, ముఠాలు కట్టడం అధికారాన్ని కాపాడుకోవడానికి పుణ్యకాలం కాస్త గడిచిపోతుందన్న అభిప్రాయం దాదాపు 2014 వరకు కొనసాగింది. ఇందులో 2023 నుంచి కొంత మార్పు కనిపిస్తున్నా రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని మనసా వాచా బలపరచడానికి కొందరు సీనియర్లకు ‘ఇగో’ అడ్డు వస్తోంది.

కెసిఆర్ పార్టీ నాయకుల కథనం ప్రకారం ‘తాము మోసపోయినట్టు ప్రజలు గ్రహించారు. ఇక మీరు (కెసిఆర్) మరలా ముఖ్యమంత్రిగా రావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.’ సాధారణంగా రాజకీయపార్టీల సిలబస్ కు బిఆర్‌ఎస్ సిలబస్ కు ఎప్పుడూ తేడా ఉంటుంది. మిగతా రాజకీయపక్షాలు ‘ప్రాపగాండా’పై మితంగా ఆధారపడతాయి. బిఆర్‌ఎస్ సంపూర్ణంగా ‘ప్రాపగాండా’ పైనే ఆధారపడుతుందని అనేక సన్నివేశాలు రుజువు చేస్తున్నాయి.

కెసిఆర్ ఎందుకు రావాలి, ఆయన ఎందుకు కావాలి అనే అంశాన్ని విశ్లేషించవలసి ఉన్నది. కెసిఆర్ హయాంలో పదేండ్లలో ఏమి జరిగిందో చూడాలి. “రాజు కొలువులో మానావమానాలు ఓర్చుకొని అణకువతో ఉండాలి. తన ఉద్యోగానికి తగినట్టు సభలో ప్రవేశించాలి. తనకు తగిన ఆసనంలో కూర్చోవాలి. రాజుగారి అభిమానం పొందాను, నాకేమీ?అని తన హద్దులు మీరి నడుచుకొంటే ప్రమాదం తప్పదు.

రాజగృహం కంటే గొప్పగా సుందరంగా తన ఇల్లు నిర్మించుకోగూడదు. ఆయన ఎక్కడైనా విహరించదలచవచ్చు, అలంకరించుకోదలచవచ్చు. కానీ సేవకుడు ఆ విధంగా తన డాబు ప్రదర్శించగూడదు. ఆయన మాటలలో తన వైదగ్ధ్యం చూపవచ్చు. భృత్యుడు అడగకుండా తన పాండిత్యం చూపగూడదు. తన శుభ స్థితి కోసం రాజు ఎవరినైనా అడ్డు తొలగించి వేస్తాడు. పూర్వ స్నేహం, రక్త సంబంధం ఏదీ చూడడు. శత్రువులను శిక్షించినట్లే శిక్షకు గురి చేస్తాడు. ఎవరైనా ఒకరు రాజకార్యం చేస్తూ ఉంటే అంతకంటే బాగా ఇలా చేయవచ్చు అని పూసుకోని తిరగడం గానీ, వాళ్ల కు పోటీ కావడం గానీ చేయగూడదు. రాజు కొలువులో ఉండే వాళ్లకు ఎక్కువ మందికి విరోధమయ్యే మాటలు, చేష్టలు ఒక నాటికి గండంగా పరిణమిస్తాయి. పదిమందితో కలిసి తన గొంతు వినబడేట్టు బిగ్గరగా మాట్లాడకూడదు. రాజు ఆలోచన ఏమిటో సమయ సందర్భాలనుబట్టి ఊహించి, ఆజ్ఞాపించే లోపలే తెలుసుకొని చేసే నేర్పు ఉండాలి. చూపు రాజు గారి వైపే ఉండాలి. రాజ దర్బారులో జరిగేవి బయట చెప్పగూడదు. బయట జరిగేవి కూడా రాజు మెచ్చుకునేవి అయితేనే చెప్పవచ్చు. రాజెవరినైనా గౌరవించవలెనని గానీ, బాధించవలెనని గానీ అనుకొని ఉన్న సంగతి తనకు తెలిసినా బయటపెట్టగూడదు. శత్రువుల దూతలతోనూ, రాజు తిరస్కరించిన వాళ్లతోనూ కలిసి తిరగడం ప్రాణం మీదికి తెస్తుంది. రాజు సన్నిహితమైన దానితో అది ఏనుగైనా, దోమైనా దానితో వైరం పెట్టుకోగూడదు. రాజును, అగ్నిని దేవుని వలె ఆరాధించాలి.అగ్ని అవసరమే. తగినంత దూరంలో ఉండాలి. దేవుణ్ణి దూరంగా చూపుతో అర్చించాలి. రాజుకు ఎపుడైనా హితమైనవీ, ఆతని మనసు నొప్పించనివీ అయినవే చెప్పాలి. రాజును, రాజు కొడుకునూ గౌరవంతో చూచేవాడు ఉన్నత పదవులు పొందగలుగుతాడు. రాజు శిక్షించి కారాగారంలో ఉంచినా దూషించనివాడు కొంతకాలానికి రాజు మన్నన పొందుతాడు”ఇవన్నీ రాచరికపు పోకడలు.

రాజరికంలో ఐదువేల సంవత్సరాల క్రింద ఉన్న పరిస్థితులే మన నేటి ప్రజాస్వామ్య రాజ్యంలో ఇంకా విషమించాయని అర్థం చేసుకోవాలి. ప్రతిరోజూ జ్ఞాపకం చేసుకోవలసిందే. 1.కెసిఆర్ ఎప్పుడూ హితైషులను దరిచేరనిచ్చేవారు కాదు. 2. తనకు తాను ఒక రాజుగానే ఆయన ప్రవర్తించారు. 3.రాజరికాన్ని పరిపూర్ణంగా అనుభవించారు. 4.ప్రగతి భవన్ కు మించిన ఇల్లు మరొకటి కనిపించకూడదని అనుకున్నారు. అందుకే ఈటల రాజేందర్ కొత్త ఇల్లు చూసి అసూయ చెందినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. 5.తనను,తన కొడుకు కెటిఆర్ ను పొగిడిన వారినే అందలం ఎక్కించారు. 6.తనకు నచ్చేవారినే దగ్గరకు తీసేవారు.7.ప్రత్యర్థులతో స్నేహం చేసినా, వారి మనుషులతో తిరిగినట్టు సమాచారమందినా పరిణామాలు తీవ్రంగా ఉండేవి. 8.తన సొంత మనుషులు, బంధువులు, రక్త సంబంధీకులను కూడా కెసిఆర్ ఒక పట్టాన నమ్మేవారు కాదు. అడుగడుగునా నిఘా పెట్టి వారి కార్యకలాపాల గురించి తెలుసుకునేవారు. ఫోన్ ట్యాపింగ్ ఉదంతంలో ఇలాంటి చాలా విషయాలున్నాయి.

“నిజాంలాగే కెసిఆర్ కూడా రాచరికాన్ని తీసుకురావాలని చూశారు. 1948 సెప్టెంబర్ 17న నిజాం రాచరిక పాలన అంతమైంది. 2023 డిసెంబర్ 3న కెసిఆర్ పాలన అంతమైంది. తమ వారసులే అధికారంలో ఉండాలని నిజాం నవాబు కోరుకున్నారు. అభివృద్ధి చేశాను కాబట్టి తానే అధికారంలో ఉండాలని కెసిఆర్ భావించారు. ప్రజాస్వామ్యంపై కెసిఆర్‌కు నమ్మకం లేదు. ఏనాడు ప్రజల స్వేచ్ఛను కెసిఆర్ గౌరవించలేదు. కెసిఆర్ ఆనవాళ్లు ఇంకా ఉన్నాయి. ఆయన నాటిన గంజాయి మొక్కలు వాసన వెదజల్లుతున్నాయి. కెసిఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తా. అలాంటి మొక్కను మళ్ళీ మొలవనివ్వను” అని 2024 మార్చిలో విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

‘కెసిఆర్ ఆనవాళ్లు’ అంటే రాచరికపు లక్షణాలు అని అర్థం చేసుకోవాలి కానీ, దానిపై బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు తీవ్ర విమర్శలు గుప్పించారు. కెసిఆర్ ఆనవాళ్లు తుడిచిపారెయ్యడం ఎవరితరం కాదంటూ నిప్పులు కురిపించారు. కెసిఆర్ కుటుంబానికి, తెలంగాణ ప్రజలకు మధ్య జరుగుతున్న పోరాటమనే వాదనను రేవంత్ ఎన్నికల సమయంలో బలంగా వినిపించినప్పుడు జనం నమ్మారు. “సంక్షేమ పథకాలతో ప్రజల అకౌంట్లలో డబ్బులు పడుతూ ఉన్నాయి. పంటసాగు పెరిగింది.హైదరాబాద్ విస్తరించింది. రాష్ట్ర తలసరి ఆదాయం దేశ సగటుతో పోల్చితే రెండింతలు” అని తాము సాధించిన అభివృద్ధిని బిఆర్‌ఎస్ నేతలు ఘనంగా చెప్పుకున్నారు. కానీ, ప్రభుత్వంలో ప్రజల భాగస్వామ్యం లేకుండా, ప్రజలతో నిమిత్తం లేకుండా, వాళ్ళేమి ఆలోచిస్తున్నారో పట్టించుకోకుండా కెసిఆర్ పాల న సాగడం పట్ల ప్రజల్లో అసంతృప్తి పెరిగింది. ప్రజలతో కెసిఆర్ డిస్కనెక్ట్ కావడం కీలకమైన అంశం. దశాబ్దాల పోరాటాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ దశాబ్ద కాలం పాలనకే ప్రజలకు ఎందుకు మొహం మొత్తింది? అనే అంశాన్ని ఇప్పటివరకు కెసిఆర్ సమీక్షించుకోలేదు. ఆత్మ విమర్శ చేసుకున్న దాఖలాలు లేనే లేవు.

నిరుద్యోగుల ఆగ్రహం పట్ల కెసిఆర్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఉపాధి కల్పన ప్రభుత్వ బాధ్యత. తెలంగాణ ప్రజలు అభిమానాన్ని కోరుకుంటారే కానీ బానిసలుగా ఉండడానికి ఇష్టపడరని పలువురు మేధావులు, బుద్ధిజీవులు అభిప్రాయపడుతున్నారు . తాము సంక్షేమ కార్యక్రమాలు పెద్ద ఎత్తున అమలుచేస్తున్నందున తమకు ప్రజలు ఓటు వేసి తీరవలసిందే అన్న ధోరణితో కెసిఆర్, ఆయన కుటుంబం ప్రవర్తించారు. “బిఆర్‌ఎస్ పాలనలో ప్రజాస్వామ్య పద్ధతి లేదన్నది ప్రజల నుంచి వ్యక్తమైంది. తెలంగాణ సమాజానికి యాంటీఫ్యూడల్ ఉద్యమాల చరిత్ర ఉంది. ఈ ఎన్నికల ఫలితం బహూశా ఆ ఉద్యమాల కొనసాగింపు” అని 2023 ఫలితాల అనంతరం పౌర హక్కుల ఉద్యమ నాయకుడు ప్రొఫెసర్ హరగోపాల్ వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ ప్రభుత్వాలు అంటేనే బహు నాయకత్వం,అంతర్గత ఘర్షణలు అనే భావన సర్వత్రా ఉంటుంది. వేల కోట్లు ధారపోసి రైతు రుణమాఫీ చేసినా ఎందుకో కాంగ్రెస్ కు ఎలాంటి మైలేజ్ రాలేదు. అలాగే అనేక వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నా ‘మార్కెటింగు’ చేసుకోలేకపోవడం రేవంత్ టీమ్ వైపున కనిపిస్తున్న ప్రతికూల అంశం.

## మునుగోడుకు కృష్ణా జలాలే
# శాశ్వత పరిష్కారం

కరువు కాటకాలకు గుర్రై, ఫ్లోరైడ్ పీడిత ప్రాంతంగా ఉన్న మునుగోడు నియోజకవర్గానికి శాశ్వత పరిష్కారంలో భాగంగా కృష్ణాజలాలు అందించాలని సుదీర్ఘ పోరాటాల ఫలితంగా ఎస్‌ఎల్‌బిసి (శ్రీశైలం ఎడమ గట్టు సొరంగ)మార్గాన్ని చేపట్టడం జరిగింది. ఎస్‌ఎల్‌బిసిలు అంతర్భాగంగా నక్కలగండి రిజర్వాయర్ నుండి డిండి ఎత్తిపోతల పథకాన్ని చేపట్టి అక్కడి నుండి గ్రావిటీ ద్వారానే దేవరకొండ మునుగోడు నియోజకవర్గం గ్రామాలకు త్రాగు, సాగునీరు అందించటంతోనే సమస్యకు పరిష్కారం లభిస్తుందని సిపిఐ మరియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో 1994 నుండి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టిన నేపథ్యంలో 2007లో ఎస్‌ఎల్బీసీ సొరంగమార్గానికి ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి సాంక్షన్ చేస్తూ పనులను ప్రారంభించారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ఎస్‌ఎల్బీసీ సొరంగ పనులు వేగం తగ్గడంతోనే నియోజకవర్గానికి నీటి తరలింపు ఆలస్యం అయింది. నేడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం డిండి ఎత్తిపోతల పథకాన్ని చేపట్టుటకు 2024–25 బడ్జెట్‌లో రూ.800 కోట్లు కేటాయించి పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల స్కీములో భాగంగా ఉల్పర్ నుండి రోజుకు 0.5 టిఎంసి చొప్పున డిండి ఎత్తిపోతలకు నీరు కేటాయించడం జరిగింది. 2026 డిసెంబర్ వరకు సాగు, త్రాగునీరు అందిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ ప్రాజెక్టును పూర్తి చేయుట కు పెద్దఎత్తున ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావలసిన అవసరం ఉంది.



కాలుష్యమైన మూసి నీరు ఎందుకు? మూసి నీరు నారాయణపూర్ మండల గ్రామాలలోని చెరువులు, కుంటలు నింపి సాగుకు అందించాలని కొన్ని వర్గాలు, ప్రజా సంఘాల పేరుతో కార్యక్రమం చేపడుతున్నారు. హైదరాబాదు డ్రైనేజితో పాటు అనేక పరిశ్రమలు, రసాయనాలు, మురికి నీరుతో ప్రవహించే మూసి నీరు బీబీనగర్, చౌటుప్పల్ ప్రాంత ఫార్మా పరిశ్రమల నుండి కాలుష్యమై వస్తున్న నీరు ఏమాత్రం సాగు పంటలకు ఉపయోగపడదు. పిల్లాయపెల్లి ధర్మారెడ్డి కాల్వను నారాయణపురం మండల గ్రామాలకు పొడిగించాలని కోరటం ఏమాత్రం అనుకూలంగా లేదు. ఇప్పటికే చౌటుప్పల్ మండలంలోని వివిధ ఫార్మా పరిశ్రమల నుండి విడుదలవుతున్న వ్యర్థాలతో పూర్తి కాలుష్య కారకంగా మారింది. అంతేకాకుండా ఈ ఫార్మా పరిశ్రమలకు అతి సమీపంలో సంస్థాన్ నారాయణపురం మండలంలోని పలు గ్రామాలు ఉండటంతో అదే గ్రామాలలో కూడా ఇప్పటికే పంటలు సరిగా పడటం లేదు. పరిశ్రమల కాలుష్య కోరల్లో పంటలు దెబ్బ తిన్నాయని రైతాంగం ఆరోపిస్తున్నారు. మూసి నది జలాలు ఏ మాత్రం సాగుకు ఉపయోగ పడవని గ్రామాల్లో రైతాంగం తెలుపుతున్నారు. మూసి జలాలను ప్రభుత్వం శుద్ధిచేసి పంపిస్తామని చెబుతున్నదని, సదరు జలాలను మనం ఉపయోగించుకుంటే బాగుంటుందని చెప్పటం అవివేకమేనని రైతాంగం వ్యతిరేకిస్తున్నారు.

**కృష్ణా జలాలే ఏకైక మార్గం :**

మునుగోడు నియోజకవర్గానికి కృష్ణా జలాలను అందించి సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో సిపిఐ ఉద్యమిస్తుంది. డిండి ఎత్తిపోతల్లో భాగంగా శివన్నగూడ గ్రామంలో 11 టిఎంసిల సామర్థ్యంతో చర్లగూడెం రిజర్వాయర్ చేపట్టడం జరిగింది. అక్కడి నుండి మరొక లిఫ్ట్ ద్వారా నారాయణపూర్ మండల గ్రామాలకు అందించాలని డిపిఆర్ కూడా తయారు చేయుచున్నారు.

పల్లా వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే సిపిఐ జాతీయ సమితి సభ్యులు : మునుగోడు నియోజకవర్గానికి కృష్ణా జలాల సాధనతోనే సస్యస్యామలం చేయవచ్చు. ప్రభుత్వం పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల్లో భాగంగా డిండి లిఫ్ట్ పథకాన్ని చేర్చింది. పనులను శర వేగంగా పూర్తి చేయాలి. ఉల్పర వాగు పనులు వేగం పెంచేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తాం. రసాయనాలతో కాలుష్యమైన మూసి నీటితో రైతులకు ఎలాంటి లబ్ధి చేకూరదు. కృష్ణ నీటితోనే ఫ్లోరైడ్ నుండి విముక్తి లభించటంతో పాటు సాగుకు యోగ్యంగా ఉంటుంది.

కృష్ణా జలాలు అవకాశం ఉన్నప్పుడు మూసి జలాలు కోరవలసిన అవసరం లేదు. చర్లగూడెంలో చెరువు నుండి లిఫ్ట్ ద్వారా నారాయణపురం పై గ్రామాలకు కూడా నీరు అందించే విధంగా డిపిఆర్ తయారు చేస్తున్నారు. ప్రభుత్వం చేసే ప్రతిపాదనకు మద్దతు ఇస్తున్నాం.

నారాయణపురం మండలంలో పలు గ్రామాలకు మూసి నీటిని తీసుకొచ్చేందుకు సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. వారి మాయలో రైతులు పడి భవిష్యత్తు అంధకారం చేసుకోకూడదు. కృష్ణా జలాల సాధన కోసం మరిన్ని పోరాటాలు చేద్దాం. ఇన్ని సంవత్సరాలు వేచి ఉండి కాలుష్యమైన మూసి జలాల కోసం కాకుండా డిండి ఎత్తిపోతల ద్వారా, చర్లగూడెం రిజర్వాయర్ నుండి నారాయణపూర్ మండలానికి అందించే విధంగా ఉద్యమిద్దాం.

**కలకొండ సంజీవ**
ప్రజాపక్షం విలేకరి, సంస్థాన్ నారాయణపూర్ మండలం.

# భారతదేశంలో ఫాసిజాన్ని గుర్తించటం మరెప్పుడు?

**దీపాంకర్ భట్టాచార్య**
సిపిఐ(ఎంఎల్)ఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి

(నిన్నటి తరువాయి)

వాస్తవానికి భారతదేశంలో ఎన్నికలు జరుగుతూనే ఉన్నాయి. అయితే ఎన్నికలసంఘం పూర్తిగా ప్రభుత్వ నియంత్రణలో ఉన్నప్పుడు, ఓటర్ల జాబితాల తయారీ నుండి ఓట్లు లెక్కింపు వరకు మొత్తం ఎన్నికల ప్రక్రియ ఏమాత్రం పారదర్శకంగా లేకుండా ఏకపక్షంగా మారుతున్నప్పుడు భారతదేశ ప్రజాస్వామ్యానికి ఎన్నికలు ఒక ముఖ్యమైన రక్షణగా ఉండగలవా? హిట్లర్ కూడ ఎన్నికల మార్గం ద్వారా అధికారంలోనికి వచ్చి 99 శాతం ఓట్లను పొందేందుకు, శాశ్వతంగా నియంతృత్వాన్ని అమలు చేయడానికి మొత్తం ప్రతిపక్షాన్ని క్రమక్రమంగా తుడిచిపెట్టాడని గుర్తుంచుకోవాలి. భారతదేశంలో 50 ఏళ్ల పాటు నిరాటంకంగా పరిపాలన సాగిస్తామని అమిత్ షా చెబుతూనే ఉన్నాడు. ప్రతి ఎన్నికలలో గెలిచి అధికారాన్ని అంటిపెట్టుకొని ఉండేందుకు బిజెపి తెగించి విద్వేష ప్రచారం చేస్తున్న సందర్భాలను మనం ఇప్పటికే ఎన్నో చూసాము. భారతదేశంలో ఎన్నికలు చాలా హాస్యాస్పదంగా మారుతున్నాయి. ప్రపంచం దృష్టిలో భారతదేశం ఎన్నికల ద్వారా నడిచే ప్రజాస్వామ్య దేశమని చూపడానికి, దేశంలో ప్రజలకు చట్టబద్ధతను చూపటానికే ఉద్దేశించబడుతున్నాయి.

ఇప్పటివరకు తన రాజకీయ ప్రయాణంలో బిజెపికి అనేకమంది మిత్రులు సహాయకులు లభించిన మాట నిజమే. దాని సంప్రదాయ మిత్రులతో బాటు తరచుగా నయా ఉదారవాద అజెండా పునాదిగా ఉన్న పార్టీల నుండి విస్తృత మద్దతు పొందుతున్నట్లే, లోపాయకారీ హిందూత్వ రాజకీయ అజెండా కొనసాగింపు ఆధారంగా కూడా మద్దతు పొందగలుగుతుంది. అసమ్మతి వాదుల గొంతు నులమడం, ఇస్లామ్ మతాన్ని భూతంగా చూపించడం, ముస్లింలు ఇతర మైనార్టీలు అట్టడుగు వర్గాలపై తీవ్రస్థాయిలో హింస ద్వేష పూరిత ప్రచారం కొనసాగించడం, పౌర హక్కులు, ప్రజాస్వామిక హక్కులు, ప్రజాస్వామిక వేదికలు పలుచబడటం పట్ల భారతదేశ ప్రజాక్షేత్రంలో కొద్దిపాటి స్పందన, వ్యతిరేక వాణి కనిపిస్తున్నాయి. అంబేద్కర్, రాజ్యాంగాన్ని కేవలం ‘అప్రజాస్వామిక గడ్డపై అత్యంత ఉన్నతంగా అలంకరించిన ప్రజాస్వామ్యం’గా అభివర్ణించడంలో ఆశ్చర్యం లేదు. ఫాసిజానికి వ్యతిరేకంగా ప్రతిఘటనను నిర్మించడంలో నాయకత్వ పాత్ర పోషిస్తూ, పెరుగుతున్న ఫాసిస్టు దాడి నేపథ్యంలో అత్యంత స్థిరమైన ప్రజాస్వామ్యం కోసం ముందువరసలో నిలబడే నిబద్ధత గల కమ్యూనిస్టులుగా మన కర్తవ్యాన్ని బోధిస్తుంది.

సిపియమ్ ముసాయిదా తీర్మానం కొన్ని నయా ఫాసిస్టు లక్షణాలను గుర్తించింది. ఆ లక్షణాలను నిలువరించకపోతే పూర్తిస్థాయి నయా ఫాసిజంగా మారుతుందని పేర్కొంది. నయా ఫాసిస్టు లక్షణాల గురించి మరింత వివరిస్తూ ‘ప్రోటో నియో ఫాసిస్ట్ ఇన్డిడియంట్స్’ (నయా ఫాసిజం తాలూకు ప్రాథమిక లక్షణాలు) అనే కొత్త వ్యక్తీకరణను ఉపయోగించింది. బహుశా ఈ ప్రోటో మూలకాలు సాంప్రదాయ ఫాసిజం నుండి మూడుసార్లు తొలగించబడి ఆ తర్వాత 21వ శతాబ్దపు ఫాసిజం యొక్క పరిపూర్ణ అధ్యయన పాఠం గా పరిపక్వం చెందడానికి మనకు ఇంకా సమయం ఉందని సూచిస్తుంది కాబోలు. దాని ప్రయాణం ఏ దిశగా ఉందో అర్థమయ్యి, ఫాసిస్టు ప్రమాదం తాలూకు స్థాయీ తీవ్రతలను అంచనా వేయడం ఒక్కటే ప్రశ్న అయితే, ముసోలిని ఇటలీతో, హిట్లర్ జర్మనీతో పోల్చి చూస్తే భారతదేశంలో నేటికీ ఏదో మేరకు మనుగడలో ఉన్న ప్రజాస్వామ్యం నుండి ఉపశమనాన్ని పొందుతూ ప్రతిరోజు మన కళ్ళ ముందు జరిగిన, నేటికీ జరుగుతున్న వాటిని విస్మరిస్తూ వేచి చూసే తీరిక అవకాశం కమ్యూనిస్టులకు ఉన్నాయా? భారతదేశంలో ఆర్.ఎస్.ఎస్ క్రమక్రమంగా సుదీర్ఘకాలంపాటు పెరిగిందంటే దానికి కారణం భారతదేశ విస్తీర్ణత, తన బహుళ సంస్కృతి యొక్క విశాలత. ఒకే దేశం అనే ఏకరూప సూత్రంతో ఈ వైవిధ్యాన్ని బుల్డోజ్ చేయడానికి మోదీ పాలన ఒక్క క్షణాన్ని కూడా వృథా పోనీయడం లేదు.

భారత రాజ్యం ఫాసిస్టు రాజ్యం కాదని నోట్ పేర్కొంది. సరే, భారతదేశంలోని రాజ్యవ్యవస్థ పూర్తిస్థాయి ఫాసిస్టుగా మారిందని ఎవరూ చెప్పలేదు. కానీ విస్తృతమైన ప్రభుత్వ యంత్రాంగంలో అంతర్గత సంస్థాగత ప్రతిఘటన చాలా బలహీనంగా ఉందనీ, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ తాలూకు అవయవాలను, దాని సామర్థ్యాన్ని నాశనం చేయడానికి తీవ్ర ప్రయత్నం జరుగుతోందనే వాస్తవాన్ని మనం ఎన్నడైనా విస్మరించగలమా? అందుకే ఇప్పుడు అంబేద్కర్ కానీ, రాజ్యాంగం కానీ, స్వాతంత్ర్య ఉద్యమ వారసత్వం కానీ సంఘ్ పరివార్ ను తీవ్రంగా చికాకు పరిచే అత్యంత కీలక అంశాలుగా మారాయి. కారణం అవి రాజ్యాంగ దార్శనికతను తెలియచేసి స్ఫూర్తిదాయకమైన రాజ్యాంగ పీఠికలో అవి పొందుపరచబడి దిశా నిర్దేశం చేస్తున్నాయి. ఈ ఫాసిస్టు దూకుడు ప్రభావానికి బలవుతున్న ప్రజలు తమను తాము రక్షించుకోవడానికి రాజ్యాంగాన్ని ఆశ్రయిస్తున్నా రు. విభజనకు గురి చేసే వివక్షపూరితమైన నూతన పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా సాగిన షాహీన్ భాగ్ నిరసనల నుండి సామాజిక గౌరవం కోసం కొనసాగుతున్న దళిత ఆదివాసి బహుజన ఆందోళనలు, కార్పొరేట్ దోపిడీకి వ్యతిరేకంగా తీవ్రతరం అవుతున్న రైతులకార్మికుల పోరాటాల వరకు ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి రాజ్యాంగాన్ని ఒక ఆయుధంగా ప్రజలు ఎలా తిరిగి చేతబూనారో మనం చూడొచ్చు.

11 సంవత్సరాల పాటు నిరాటంకంగా అధికారంలో కొనసాగుతూ అపరిమితంగా ఫాసిస్టు శక్తులు సంఘటితమైన తర్వాత కూడా పెరుగుతున్న విపత్తుకు కారణభూతమైన దానిని చారిత్రకంగా ప్రసిద్ధి చెందిన దాని పేరుతో (ఫాసిజంగా) పిలవడానికి కమ్యూనిస్టులు ఇంకా ఎంత కాలం వేచి చూడాలి? ప్రసిద్ధ గాయకుడు బాబ్ డిలాన్ పాటను పునశ్చరణ చేస్తూ ‘వారిని ఫాసిస్టులుగా పిలవడానికి మనమంతా ఇంకా ఎంత ఎక్కువ నష్టపోవాలి?. ఈ తరుణంలో నయా ఉదారవాదం, నియంతృత్వం వంటి సాధారణ తరహా నుండి ఫాసిస్ట్ ప్రమాదాన్ని ప్రత్యేకించి చూడడంలో సందిగ్ధత కమ్యూనిస్టుల ఎన్నికల బలాన్ని, నైతిక ఆధిపత్యాన్ని నాశనం చేస్తుంది.

మరోవైపు కమ్యూనిస్టులు స్వాతంత్ర్య ఉద్యమం విప్లవ వారసత్వాన్ని, సామాజిక న్యాయంకోసం పోరాటాన్ని, ప్రజాస్వామ్యానికి రాజ్యాంగ పునాది వేయడంలో అంబేద్కర్ అందించిన రాడికల్ సహకారాన్ని స్వీకరించడం ద్వారా ఫాసిజాన్ని ప్రతిఘటించే సవాల్ చేబట్టి శ్రామిక వర్గాన్ని, మేధావులను వారి సంస్థాగత సమస్యలపై ఏకం చేయడానికి సాహసోపేతమైన చొరవలను తీసుకోగలిగితే, మోడీ ప్రభుత్వం ప్రత్యక్షంగా ట్రంప్ పాలనకు లొంగిపోతున్న ఈ సమయంలో సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయవాద జెండాను సమున్నతంగా నిలిపితే భారత కమ్యూనిస్టు ఉద్యమం అంచనాల ను తారుమారు చేస్తూ ఫాసిస్టులను వెనకకు నెట్టగలదు.

చారిత్రకంగా సిపియమ్ కి బలమైన కంచుకోటలైన కేరళ, పశ్చిమబెంగాల్ లో రాజకీయ, ఎన్నికల సంక్లిష్టతలను అర్థం చేసుకోవచ్చు. ఫాసిజం ఆవిర్భావాన్ని గుర్తించడం, దానిని ఫాసిజంగా పిలవడానికి సిపియమ్ ఎదుర్కొంటున్న ఇబ్బంది, ఈ రెండు రాష్ట్రాలలో వారు ఎదుర్కొంటున్న తక్షణ ఎన్నికల పరిస్థితుల వల్ల తగినంత సమాచారం లేకపోవడం వల్లనే అని అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పటికీ లోక్ సభఎన్నికల్లో కేరళలో సిపియమ్ పదేపదే వైఫల్యం చెందడం, పశ్చిమ బెంగాల్ లో నిరంతర పతనం కూడా అంతే ఆందోళన కలిగించే అంశం. సిపియమ్ ఓటర్లలో కొంత భాగం, కొంతమంది మాజీ అర్గనైజర్లు, నాయకులు కూడ బిజెపి లోనికి వలసపోవడం మరింత కలత కలిగించే అంశం.

పార్టీ తన స్వతంత్ర ఎదుగుదలకు, తన పాత్రను పెంచుకోడానికి కచ్చితంగా ప్రాధాన్యత ఇవ్వాలి. అయితే అంతే ప్రాధాన్యత గల ఫాసిస్టు వ్యతిరేక ఐక్యతను విస్తృత పరచుకొనే లక్ష్యానికి దానిని వ్యతిరేకంగా ఎక్కుపెట్టలా? ప్రస్తుత లోక్‌సభలో ఆ పార్టీకి ఉన్న నాలుగు స్థానాల్లో మూడు తమిళనాడు, ఒకటి రాజస్థాన్ నుంచి ఇండియా కూటమిలో భాగంగా వచ్చాయి. ఆనాటి పరిస్థితులకు కేంద్రమైన కీలక రాజకీయ సమస్యను మరుగున పడేయటం ద్వారా ఏ కమ్యూనిస్టు పార్టీ అయినా తన బలాన్ని, పాత్రను నిజంగా అభివృద్ధి చేసుకోగలదా? ఆధునిక భారతదేశపు ఇటువంటి కీలక సమయంలో కమ్యూనిస్టు ఉద్యమంలో భాగస్వామియైన ఏ విభాగం కూడా తడబాటుకు గురి కాదని మేము ఇప్పటికీ ఆశిస్తున్నాము. పెరుగుతున్న ఫాసిస్ట్ విపత్తు నుండి, అది ఇంకా తీవ్ర భయానక రూపం దాల్చక ముందే భారతదేశాన్ని రక్షించడానికి ఫాసిస్టు వ్యతిరేక ప్రతిఘటనలో కమ్యూనిస్టు స్రవంతిని మన ఐక్యతతో బలోపేతం చేయగలుగుతాము.

(ముగిసింది)



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## 11 మంది భారతీయ మత్స్యకారుల అరెస్టు

**కొలంబో :** శ్రీలంక నావికాదళం గురువారం ద్వీప దేశ జలాల్లో వేటాడినందుకు 11 మంది భారతీయ మత్స్యకారులను అరెస్టు చేసి, వారి ట్రాలర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు అధికారిక ప్రకటనలో తెలిపింది. డెల్ఫ్ దీవికి సమీపంలోని ఉత్తర సముద్ర ప్రాంతంలో 'ప్రత్యేక ఆపరేషన్' సందర్భంగా ఈ అరెస్టులు జరిగాయని నేవీ ఒక పత్రికా ప్రకటనలో తెలిపింది. 11 మంది మత్స్యకారులను కంకసంతురై హార్బర్‌కు తీసుకువచ్చారు, చట్టపరమైన చర్యల కోసం మైలాడి ఫిషరీస్ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగించనున్నట్లు తెలిపింది. భారతదేశం, శ్రీలంక మధ్య సంబంధాలలో మత్స్యకారుల సమస్య వివాదాస్పదమైనది. శ్రీలంక నావికాదళ సిబ్బంది పాక్ జలసంధిలో భారత మత్స్యకారులపై కాల్పులు జరపడం, శ్రీలంక ప్రాదేశిక జలాల్లోకి అక్రమంగా ప్రవేశించిన అనేక సంఘటనలలో వారి పడవలను స్వాధీనం చేసుకోవడం జరిగింది. తమిళనాడును శ్రీలంక నుండి వేరుచేసే ఇరుకైన జలసంధి అయిన పాక్ జలసంధి, రెండు దేశాల మత్స్యకారులకు గొప్ప మత్స్యకార ప్రదేశం.

## జడ్జి ఇంట్లో కరెన్సీ కట్టలపై
# హోంమంత్రి మౌనం ఎందుకు?



### లోక్‌సభలో ప్రకటనకు ప్రతిపక్షం డిమాండ్

**న్యూఢిల్లీ :** ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంటి ఔట్‌హౌస్‌లో కరెన్సీ కట్టలు లభ్యమైన ఘటనకు సంబంధించి పార్లమెంటులో ఒక ప్రకటన చేయాలని కాంగ్రెస్‌పార్టీ ఎంపి మనీశ్ తివారీ కేంద్ర న్యాయశాఖామంత్రి అర్జున్ రామల మేఘువాల్‌ను డిమాండ్ చేశారు. గురువారంనాడు లోక్‌సభ శూన్యగంట సందర్భంగా తివారీ ఈ అంశాన్ని ప్రస్తావించారు. ఆయనతోపా టు పలువురు ప్రతిపక్ష ఎంపీలు కూడా ఈ అం శంపై హోంమంత్రి ఎందుకు మౌనంగా ఉన్నారనీ, న్యాయమూర్తిని కాపాడే ప్రయత్నం ఎందుకు చేశారని ప్రశ్నించారు. న్యాయవ్యవస్థలో ఏర్పడిన అసాధారణత, చంచలబుద్ధి పరిస్థితుల గురించి మంత్రి సభలో వివరణ ఇవ్వాలని కోరారు.

న్యాయమూర్తి వర్మ నివాసం ఔట్‌హౌస్‌లో మార్చి 14వ తేదీ అర్ధరాత్రి మంటలు చెలరేగడం, ఆ మంటల్లో కరెన్సీ కట్టలు కాలిపోవడం సగం కాలిన మరికొన్ని కరెన్సీ బయటపడటం వంటి పరిణామాలపై సుప్రీంకోర్టు కొలీజియం రెండు సార్లు సమావేశాలు జరిపి లోతైన అంతర్గత విచారణ నిమిత్తం ఒక త్రిసభ్య కమిటీని నియమించింది. సదరు న్యాయమూర్తిని తిరిగి అలహాబాద్ హైకోర్టుకు తరలించాలని కేంద్రానికి సిఫార్సు చేసింది. విచారణ తేలేవరకు ఆయనకు ఎలాంటి న్యాయపరమైన బాధ్యతలు అప్పగించకూడదని ఆదేశించింది.

న్యాయవ్యవస్థలో సంభవించిన ఇలాంటి పరిణామాలన్నీ దేశంలో సక్రమ ఆలోచనాశీలురు, నిజాయతీగా ఆలోచించే ప్రజలు, బుద్ధిజీవులను తీవ్ర కలతకు గురిచేశాయని, ఐతే ఆయన నేరం చేశారని ఇప్పుడే నిర్ధారణకు రావడం చాలా తొందరపాటు చర్యే కాగలదని కూడా లోక్‌సభలో మనీశ్ తివారీ అన్నారు. న్యాయవ్యవస్థను పర్యవేక్షించే బాధ్యతలు పార్లమెంటుకు ఉన్నాయని ఆయన గుర్తుచేశారు. ''భారత ప్రధాన న్యాయమూర్తి ఈ కేసులో మరింత లోతుగా విచారణ చేయడానికి ఒక అంతర్గత కమిటీని ఏర్పాటు చేశారు, ఈ ప్రక్రియను మనం గౌరవించాల్సిన అవసరం ఉంది, ఆ నివేదిక కోసం కూడా మనం ఎదురుచూడాల్సిన అవసరం ఉంది, ఐనప్పటికీ కూడా నివేదిక వచ్చే లోపుగా కేంద్ర న్యాయశాఖ మంత్రి సభకు వచ్చి ఈ మొత్తం ఘటనకు సంబంధించిన పూర్వపరాలన్నింటినీ వివరించాల్సిన బాధ్యత ఉందని, న్యాయవ్యవస్థపై పర్యవేక్షణ బాధ్యతలను నెరవేర్చాల్సి ఉందన్నారు. తృణమూల్ కాంగ్రెస్‌పార్టీ ఎంపి కల్యాణ్ బెనర్జీ సభలో ఇదే అంశంపై మాట్లాడుతూ, లెక్కల్లో చూపించని సొమ్ము భారీ మొత్తంలో న్యాయమూర్తి ఔట్‌హౌస్‌లో లభ్యమైందని అన్నారు. న్యాయమూర్తి కూడా ప్రజాసేవకుడే మనలాగా, కానీ అవినీతి ఫిర్యాదు రాగానే ఆయనపై ఎందుకు దర్యాప్తు ప్రారంభం కాలేదు, న్యాయమూర్తిపై అవినీతి ఆరోపణలు వచ్చిన తర్వాత వాస్తవాలను పక్కనపెట్టి ముందుగా ప్రధాన న్యాయమూర్తి విచారణకు అనుమతి ఇచ్చారా?లేదా? అని బెనర్జీ ప్రశ్నించారు. మన లాగా ఆయన కూడా ఒక ప్రజాసేవకుడే ఐనప్పుడు లోక్‌పాల పరిధిలో ఆయనను విచారణ చేయడానికి ఎందుకు అనుమతించలేదు? ఈ న్యాయమూర్తిని ఢిల్లీ నుండి అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేశారు, అలహాబాద్ హైకోర్టు గానీ, కోల్‌కతా హైకోర్టుగానీ చెత్తను దాచిపెట్టడానికి ఉపయోగపడే కేంద్రాలు కాదు, అవినీతికి పాల్పడిన న్యాయమూర్తులందరినీ అలహాబాద్, కోల్‌కతా హైకోర్టులకే పంపుతున్నారు'' అన్నారు. కాంగ్రెస్ ఎంపి ఆర్.సుధా కూడా ఈ అంశాన్ని శూన్యగంట సమయంలో ప్రస్తావిస్తూ, ఈ ఘటన జరిగిన వారం రోజుల తర్వాత ఒక ఆంగ్ల పత్రిక వార్త ప్రచురించిందన్నారు. ''ఈ ఘటన జరిగినప్పటినుండీ ఎంతో ఆసక్తికరమైన పరిణామాలు సంభవిస్తున్నాయి, ఫైర్ సర్వీస్, పోలీసులు కేంద్ర హోంమంత్రికి సమాచారం ఇచ్చారు, అసలు ఆయనకు ఎప్పుడు ఈ విషయం తెలిసింది? ఆయన ఏమీ పైకి చెప్పకుండా ఎందుకు మౌనంగా ఉన్నారు? ఒకవైపు పార్లమెంటు సమావేశాలు జరుగుతుంటే ఆయన సభలో ఈ విషయం చెప్పకుండా ఎందుకు మౌనంగా ఉన్నారు?'' అని సుధా ప్రశ్నించారు. '''ఒక్క పైసా కూడా అక్కడ దొరకలేదని అగ్నిమాపకదళం ప్రధానాధిపతి ఎందుకు ప్రకటన చేశారు? న్యాయమూర్తిని కాపాడే ప్రయత్నం ఎందుకు జరిగింది?'' అని ఆమె ప్రశ్నించారు.

## ఎంపి నివాసంపై దాడి...
## రాజ్యసభ నుంచి విపక్షాలు వాకౌట్

### వాయిదా తీర్మానాలను తిరస్కరించిన చైర్మన్ ధన్‌ఖడ్



**న్యూఢిల్లీ :** ఆగ్రాలో సిట్టింగ్ ఎంపి నివాసంపై దాడికి యత్నించడం, బెదిరింపులకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపై రాజ్యసభ చైర్మన్ చర్చకు అనుమతి నిరాకరించడంతో ఎస్‌పి, కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు గురువారం ఉదయం సభ నుంచి వాకౌట్ చేశారు. ఈ అంశంపై చర్చించేందుకు సభా కార్యక్రమాలను రద్దు చేయాలని సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పి) విజ్ఞప్తి చేసింది. రూల్ 267 కింద పలు అంశాలపై ఏడు నోటీసులు అందినట్లు జీరో అవర్‌లో రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ సభకు సమాచారమిచ్చారు. సమాజ్‌వాది పార్టీకి చెందిన జావెద్ అలీ ఖాన్, రామ్‌జి లాల్ సుమన్‌లు కొంతమంది సంఘవిద్రోహశక్తులు ఆగ్రాలో సిట్టింగ్ రాజ్యసభ ఎంపి, మాజీ కేంద్రమంత్రి నివాసంపై దాడికి యత్నం, బెదిరింపులకు పాల్పడినట్లు వచ్చిన అభియోగాలపై చర్చించాలని డిమాండ్ చేస్తూ నోటీసు ఇచ్చారని చైర్మన్ ప్రకటించారు. అయితే, జీరో అవర్‌లో సభ్యులు తమ అంశాలను లేవనెత్తడానికి తాను అవకాశం ఇస్తానని ధన్‌ఖర్ చెప్పారు. జీరో అవర్ ప్రస్తావనలతో సభ నడుస్తుండగా, ఎస్‌పి సభ్యులు వెల్ వైపు దూసుకెళ్లారు. నిరసన మధ్య ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడటానికి ప్రయత్నించారు, కానీ ఆయనకు అవకాశం ఇవ్వలేదు. అదే సమయంలో బిజెపి సభ్యులు 'రాణా సంగ జిందాబాద్' అంటూ నినాదాలు చేయడం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఎస్‌పి, కాంగ్రెస్, టిఎంసి, సిపిఐ, సిపిఐ(ఎం), ఆర్‌జెడి, ఇతర ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎంపిలు సభ నుండి వాకౌట్ చేశారు. అయితే బిజెడి, వైసిపి సభ్యులు మాత్రం సభలోనే కూర్చుండిపోయారు. రాణా సంగపై ఎంపి చేసిన వ్యాఖ్యలు వివాదం రేపిన కొన్ని రోజుల తర్వాత, కర్ణి సేన కార్యకర్తలు బుధవారం ఆగ్రాలో ఎస్‌పి రాజ్యసభ ఎంపి రామ్‌జి లాల్ సుమన్ నివాసంపై దాడి చేశారు. రాజ్యసభ ఎంపి రాణా సంగ ఇబ్రహీం లోడిని ఓడించడానికి బాబర్‌ను తీసుకువచ్చిన 'దేశద్రోహి' అని చెప్పినట్లు ఇటీవల ఒక వీడియో బయటపడింది. రాణా సంగ లేదా సంగ్రామ్ సింగ్ 1508 నుండి 1528 వరకు మేవార్ పాలకుడుగా ఉన్నారు.

## వారి డిమాండ్‌ను పరిశీలిస్తాం: సుప్రీం

### బార్ అసోసియేషన్ ప్రతినిధులకు సంజీవ్ ఖన్నా హామీ

**న్యూఢిల్లీ :** ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మని బదిలీ చేస్తూ కొలిజియం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ ప్రతినిధులు చేసిన డిమాండ్‌ను పరిశీలిస్తామని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా హామీ ఇచ్చారని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్ తివార్ తెలిపారు. వివిధ కోర్టుకు సంబంధించిన ఆరు బార్ అసోసియేషన్‌ల ప్రతినిధులు గురువారం మధ్యాహ్నం ప్రధాన న్యాయమూర్తితో పాటు సుప్రీం కోర్టు న్యాయమూర్తులు బి.ఆర్.గవాయ్, సూర్యకాంత్, అభయ్ ఎస్. ఒకా, విక్రమ్ నాథ్‌లను కలిసారు. జస్టిస్ వర్మను మాతృ కోర్టుకు బదిలీ చేయాలనే ప్రతిపాదన పట్ల నిరసన వ్యక్తం చేస్తూ మార్చి 25 నుంచి కొనసాగిస్తున్న నిరవధిక సమ్మెను కొనసాగించాలా లేదా అనే అంశాన్ని అలహాబాద్ హైకోర్టు పునఃపరిశీలించాల్సి ఉన్నదని చైర్మన్ అనిల్ తివారి తెలిపారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తులను కలిసిన ప్రతినిధి బృందంలో అలహాబాద్, గుజరాత్, కేరళ, జబల్‌పూర్, కర్నాటక, లక్నో బార్ అసోసియేషన్‌కు చెందిన వారు ఉన్నారు. వారు ఇచ్చిన వినతిపత్రంలో వర్మ విషయంలో పారదర్శకతను అవలంభిస్తూ సిజెఐ తీసుకున్న చర్యలను ప్రశంసిస్తూనే, ఢిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్ నివేదికను, ఇతర సమాచారాన్ని ప్రజలకు తెలిసేందుకు సుప్రీం కోర్టు వెబ్‌సైట్‌లో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. జస్టిస్ వర్మ బదిలీని ఉపసంహరించడంతో పాటు ఇప్పటికే ఉపసంహరించిన



న్యాయ సంబంధిత పనులుతో పాటు ఇతర పాలనాపరమైన పనుల నుంచి కూడా ఉపసంహరించాలని కోరారు. ఢిల్లీ చీఫ్ జస్టిస్ నివేదికలో జస్టిస్ వర్మ నివాసం నుంచి అగ్ని ప్రమాదం జరిగిన మరుసటి రోజు కొన్ని వస్తువులు తొలగించినట్లు ఉందని, దానికి అనుగుణంగా క్రిమినల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి నేరాలలో ఇతరుల భాగస్వామ్యం ఉందని, ఎఫ్ఐఆర్ నమోదు కాకపోతే ప్రాసిక్యూషన్ వ్యతిరేక ప్రభావానికి లోనవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

## పప్పులు, ఆవాల సేకరణకు ప్రభుత్వం ఆమోదం



**న్యూఢిల్లీ :** రబీ (2025) మార్కెటింగ్ సీజన్ కోసం ప్రభుత్వం 37.39 లక్షల టన్నుల పప్పులు, కందులు అదే విధంగా 28.28 లక్షల టన్నుల ఆవాలు సేకరణకు ఆమోదం తెలిపిందని వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ గురువారం తెలిపారు. మద్దతు ధర పథకం (పిఎస్ఎస్) కింద ప్రధాన సాగు రాష్ట్రాలైన రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్ నుంచి కేంద్ర నోడల్ ఏజెన్సీలు నాఫెడ్, ఎన్‌సిసిఎఫ్ ద్వారా ప్రభుత్వం నిత్యావసరాలను కొనుగోలు చేస్తుంది. పప్పుధాన్యాల సేకరణలో 27.99 లక్షల టన్నుల కందులు, 9.40 లక్షల టన్నుల పప్పులు లక్ష్యంగా పెట్టుకున్నట్లు చౌహాన్ చెప్పారు. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) కంటే తక్కువ సేకరణ జరగకుండా చూసుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఖరీఫ్ (వేసవి) పప్పుధాన్యాలపై మంత్రి వివరిస్తూ కంది సేకరణ 2.46 లక్షల టన్నులకు చేరుకుందని, దీని వల్ల 1.71 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుందని మంత్రి చెప్పారు. ఆంధ్రప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్రతో సహా తొమ్మిది రాష్ట్రాల నుండి టర్, ఉరద్, కందులు సేకరిసుత్న్నామన్నారు. ఆంధ్రప్రదేశ్, గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణలలో ఎంఎస్‌పికే సేకరణ కొనసాగుతోందని చౌహాన్ విలేకరులతో అన్నారు. ఉత్తరప్రదేశ్‌లో కంది ధరలు ప్రస్తుతం ఎంఎస్‌పి కంటే ఎక్కువగా ఉన్నాయని, కేంద్రం నోడల్ ఏజెన్సీల ద్వారా 100 శాతం సేకరణకు కట్టుబడి ఉందని పేర్కొన్నారు. కర్ణాటకలో కొనుగోలు వ్యవధిని మే 1 వరకు 30 రోజులు పొడిగించామన్నారు. 2025 బడ్జెట్‌లో స్వయం సమృద్ధి సాధించడానికి ప్రభుత్వం ఈ పప్పుధాన్యాల సేకరణను రానున్న నాలుగు సంవత్సరాలకు ప్రకటించింది.

## జమ్మూకశ్మీర్ కథువాలో ఎన్‌కౌంటర్

### పోలీసు సిబ్బందికి గాయాలు

**జమ్మూ, :** గత నాలుగు రోజులుగా భారీ ఉగ్రవాద నిరోధక ఆపరేషన్ కొనసాగుతున్న జమ్మూ కశ్మీర్‌లోని కథువా జిల్లాలో గురువారం ఉగ్రవాదులతో జరిగిన తాజా కాల్పుల్లో ఒక పోలీసు సిబ్బంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. హిరానగర్ సెక్టార్‌లో ఆదివారం ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం నుండి 30 కి.మీ దూరంలో ఉన్న రాజ్‌బాగ్‌లోని ఘాటి జుతానా ప్రాంతంలోని జఖోల్ గ్రామం సమీపంలో భద్రతా దళాలు ఉగ్రవాదులను గుర్తించినప్పుడు కాల్పులు జరిగాయి. ఇరువర్గాల మధ్య కాల్పులు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. ఆదివారం సాయంత్రం హిరానగర్ సెక్టార్‌లో అరగంటకు పైగా జరిగిన కాల్పుల తర్వాత ఉగ్రవాదులు తప్పించుకున్నవారేనని భావిస్తున్నారు. పాకిస్తాన్‌తో అంతర్జాతీయ సరిహద్దు సమీపంలోని సన్యాల్ గ్రామంలోని ఒక నర్సరీలో (ధోక్) లోపల వారు ఉన్నట్లు నిఘా సమాచారం అందిన తర్వాత స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ (ఎస్ఒజి) పోలీసులు ఆపరేషన్ ప్రారంభించారని వారు తెలిపారు. పోలీసులు, సైన్యం, ఎన్ఎస్‌జి, బిఎస్ఎఫ్, సిఆర్‌పిఎఫ్ బృందాలు సాంకేతిక, నిఘా పరికరాలతో కూడిన భారీ శోధన ఆపరేషన్‌ను కొనసాగించాయి. హెలికాప్టర్లు, యుఎవిలు, డ్రోన్‌లు, బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలు, స్నిఫర్ డాగ్‌ల మద్దతుతో శనివారం ఉగ్రవాదులు లోయ మార్గం ద్వారా లేదా సరిహద్దు అవతల నుండి కొత్తగా సృష్టించబడిన సొరంగం ద్వారా చొరబడ్డారని భావిస్తున్నారు. భద్రతా దళాలు ముఖ్యంగా బిల్లావర్ అడవికి దారితీసే మార్గాల్లో శోధన ఆపరేషన్‌ను విస్తరించాయి, ఉగ్రవాదులను గుర్తించడంలో విజయవంతమయ్యాయని అధికారులు తెలిపారు. సోమవారం బృందాలు హిరానగర్‌లో ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశానికి సమీపంలో నాలుగు లోడ్ చేసిన మ్యాగజైన్‌లు ఎం4 కార్బైన్, రెండు గ్రెనేడ్‌లు, ఒక బుల్లెట్ ప్రూఫ్ జాకెట్, స్లీపింగ్ బ్యాగులు, ట్రాక్‌సూట్‌లు, అనేక తినుబండారాల ప్యాకెట్లు, ఐఇడి పరికరాల తయారీకి సంబంధించిన సామగ్రిని కలిగి ఉన్న ప్రత్యేక పాలిథిన్ బ్యాగులను కనుగొన్నాయి. పోలీస్ డైరెక్టర్ జనరల్ నళిన్ ప్రభాత్ కథువాలో ఉన్నారు. గత నాలుగు రోజులుగా జమ్మూ జోన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ భీమ్ సేన్ టుటితో కలిసి ఉగ్రవాద నిరోధక ఆపరేషన్‌కు నాయకత్వం వహిస్తున్నారు.

## భారత్ బలమైన దేశమైనప్పుడు
# ఎందుకీ ఎక్కువ అక్రమ వలసలు?

### లోక్‌సభలో నిలదీసిన ప్రతిపక్ష ఎంపిలు



**న్యూఢిల్లీ :** భారతదేశం నిజంగా ప్రపంచంలో ఒక బలమైన,శక్తిమంతమైన దేశమైనప్పుడు ఎక్కువమంది అక్రమంగా వలస వెళ్ళేందుకు సంక్లిష్టమైన అడ్డదారులను, విషాదకరమైన ప్రయాణ మార్గాలను ఎందుకు ఎంచుకుంటున్నారని, అమెరికా ప్రభుత్వం భారత పౌరులను అవమానకరమైన పద్ధతులలో సంకెళ్ళువేసి ఎందుకు తిప్పిపంపుతోందని లోక్‌సభలో ప్రతిపక్ష ఎంపీలు గురువారంనాడు ప్రశ్నించారు. శక్తిమంతమైన దేశమని ప్రభుత్వం చెప్పుకుంటున్నప్పుడు ఇలా ఎందుకు జరుగుతోందన్నారు. వలసలు,విదేశీయుల బిల్లు–2025పై చర్చ సందర్భంగా, భారతీయుల అక్రమవలసలు, సంకెళ్ళువేసి వారిని అమెరికా వెనక్కు తిప్పిపంపడం గురించి పలువురు ప్రతిపక్ష ఎంపీలు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అమెరికా, కెనడా, యూరప్ దేశాలలోకి ప్రవేశించేందుకు యోగ్యతాపత్రాలతో కాకుండా మానవ అక్రమ రవాణా వ్యవస్థల ద్వారా సంక్లిష్ట మార్గాల్లో వెళుతున్నారు. ఈ బిల్లు ద్వారా వలసలు, భారతదేశంలోకి ప్రవేశించే విదేశీయులు, వారిని తిప్పిపంపడం, భారత్‌లో అధికారికంగా విదేశీయుల నివాసం వంటి విషయాలలో అనుసరించే విధానాలను తాజా పరిస్థితులకు అనుగుణంగా ఈ బిలుల్లో సమగ్రంగా పొందుపరిచారు. సమాజ్‌వాదీపార్టీ ఎంపీ రాజీవ్ రాయ్ సభలో మాట్లాడుతూ, భారతదేశం ప్రపంచంలో ఒక బలమైన,శక్తిమంతమైన దేశంగా అవతరిస్తున్నప్పుడు మనదేశ పాస్‌పోర్ట్ ర్యాంకింగ్ ఎందుకు పడిపోతోందని విమర్శించారు. ''2014లో మన పాస్‌పోర్టు ర్యాంకింగ్ 76గా ఉండగా, పదేళ్ళ తర్వాత ఎంతో అభివృద్ధి చెందామని చెప్పుకుంటున్న ఈనాడు సాస్‌పోర్టు ర్యాంకింగ్ 85 కు దిగజారిందని విమర్శించారు. మరి దీనికి ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. భారతీయ యువకులను అక్రమ వలస ప్రజల పేరుతో చేతులకు బేడీలు వేసి పంపారు, ప్రధానమంత్రి మోదీ అమెరికా పర్యటన తర్వాత వారిని తిప్పిపంపారు, మన దేశం ఎంతో అభివృద్ధి చెందిన తర్వాత కూడా ఎందుకు ఇలా అక్రమ మార్గాల్లో వలసలు పోతున్నాం?'' అని ప్రశ్నించారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపి సౌగతారాయ్ మాట్లాడుతూ, భారతీయులు అమెరికా వెళ్ళేందుకు ఎన్నో కష్టాలు పడుతున్నారన్నారు. షా రూఖ్ ఖాన్ చిత్రం ''దుంకీ' ని చూస్తే, ఒక మంచి జీవితం పొందడంకోసం ఇలా అక్రమంగా వలసవెళ్ళే వారు ఎన్ని కష్టాలు పడుతున్నారో మనకు తెలుస్తుంది'' అన్నారు. కానీ అమెరికా నుండి భారతీయ యువకుల చేతులకు కాళ్ళకు కలిపి బేడీలు వేసి వెనక్కు తిప్పిపంపే విధానం జాతికి అవమానకరంగా ఉందని అన్నారు. చండీగఢ్ విమానాశ్రయానికి వచ్చిన అమెరికా సైనిక విమానం భారతీయులను వదిలేసిన పద్ధతిపై ప్రభుత్వం ఇప్పటికీ మౌనంగానే ఉందని విమర్శించారు. ఈ అవమానాన్ని అడ్డుకోవడంలో కేంద్రం విఫలమైందన్నారు. డిఎంకె ఎంపి కనిమొళి మాట్లాడుతూ, భారతీయులను తిప్పిపంపే విధానం ఏమీ బాగోలేదన్నారు. అంతర్జాతీయస్థాయిలో మన పౌరులను ఎంత దారుణంగా, అమానుష పరిస్థితుల్లో తిప్పిపంపుతున్నారో తెలుస్తోందన్నారు. 2006లో భారతదేశం ప్రపంచ పాస్‌పోర్ట్ ర్యాంకింగ్‌లో 71వ స్థానంలో ఉండగా, ఈనాడు 85వ స్థానానికి దిగజారిందని విమర్శించారు. చాలామంది భారతీయులకు ప్రపంచవేదికలను చేరడం పెద్ద సవాలుగా మారిందన్నారు.

## 1న ఢిల్లీకి చిలీ అధ్యక్షుడు




న్యూఢిల్లీ : భారతదేశంలో ఐదు రోజుల పర్యటన నిమిత్తం చిలీ అధ్యక్షుడు గ్రాబియెల్ బోరిక్ ఫంట్ ఏప్రిల్ 1వ తేదీన ఢిల్లీకి రానున్నారు. ఈ సందర్భంగా ఉభయ దేశాల మధ్య వాణిజ్య, రక్షణ సహా అనేక రంగాలలో ద్వైపాక్షిక సహకారం గురించి అవకాశాల గురించి మార్గాల అన్వేషణ జరుగుతుంది. అధ్యక్షుడి హోదాలో బోరిక్‌కు భారతదేశంలో ఇది తొలి పర్యటన. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు ఆయన భారత పర్యటనకు వస్తున్నారని విదేశాంగ మంత్రిత్వ శాఖ గురువారం ప్రకటించింది. బోరిక్‌తో పాటు చిలీ దేశ ఎంపిలు, మంత్రులు, సీనియర్ అధికారులు, వ్యాపార,మీడియా ప్రతినిధులతో కూడిన ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం భారత పర్యటనకు వస్తుంది. ఢిల్లీలో పాటు ఆగ్రా, ముంబాయి, బెంగళూరు నగరాలలో కూడా పర్యటిస్తుంది. ఏప్రిల్ 1వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీతో చిలీ అధ్యక్షుడు సమావేశమై భారత్ – చిలీ సంబంధాల మీద లోతుగా చర్చిస్తారని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. చిలీతో భారతదేశ సంబంధాలు సంప్రదాయంగా స్నేహపూర్వకంగా ఉన్నాయని, లాటిన్ అమెరికా ప్రాంతంలో భారత్‌కు చిలీ ముఖ్య భాగస్వామి అని పేర్కొంది. ఇరు దేశాల మధ్య అనేక అంతర్జాతీయ అంశాలలో ఒకే తరహా అభిప్రాయాలు ఉన్నాయని, ఇందులో ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సంస్కరణలు, వాతావరణ మార్పు, పునరుత్పాదక విద్యుత్, ఉగ్రవాదం వంటి అంశాలు ఉన్నాయని తెలిపింది. భారతదేశ స్వాతంత్ర్య వేడుకలకు 1947లో తమ ప్రతినిధిని పంపిన ఏకైక లాటిన్ అమెరికా ప్రాంత దేశం చిలీ.

## ఆక్స్‌ఫర్డ్ నిఘంటువులో గిగిల్–అల్‌మాక్ కొత్త పదాలు

**మనీలా :** ఆక్స్‌ఫర్డ్ ఆంగ్ల నిఘంటువులోకి రెండు కొత్త పదాలు వచ్చి చేరాయి. . 'గిగిల్', 'అల్‌మాక్' అనే ఈ రెండు పదాలను రెండు ఇతర భాషల నుండి తీసుకున్నారు. మీరు జీవితంలో ఎన్నడూ ఊహించనంత అందాన్నీ, ఆకర్షణను, చురుకుదనాన్ని చూసినప్పుడు నిశ్చేష్టులైపోతే, మిమ్మల్ని మాటలు లేకుండా మూగపోయేట్టు చేసే ఆ అద్వితీయమైన భావాన్ని మీరు ఏమని పిలుస్తారు. ఇప్పుడు ఆ భావానికి కూడా ఒక పదం ఉంది. దానినే 'గిగిల్' అంటారు. అనువాదం చేయడానికి సాధ్యంకాని పదాల జాబితాలో ఈ 'గిగిల్'ను చేర్చారు. ఆంగ్లభాషలో ఈ భావం వ్యక్తం చేయడానికి ఇప్పటివరకూ సమానార్థకం లేదు. ఆంగ్లంలో అనువదించడానికి సమానార్థకంలేని పదంజాబితాలో ఈ గిగిల్‌ను చేర్చారు. ఫిలిప్పైన్స్ టగలోగ్ భాష నుండి ఈ గిగిల్ పదాన్ని ఆక్స్‌ఫర్డ్ నిఘంటువులోకి దత్తత తీసుకున్నారు. అంతులేని ఆరాధనీయభావం కలిగినప్పుడు, చేతులు, పళ్ళు బిగబట్టి, నోటిని శుభ్రం చేసుకుని ఆ భావాన్ని ఆస్వాదించడానికి సిద్ధపడిన సందర్భాన్ని వ్యక్తం చేయడానికి ఈ గిగిల్ ఉపయోగిస్తారు. అదేవిధంగా సింగపూర్, మలేసియా దేశాలలో స్థానిక వ్యావహారిక భాషలో అలవికాని దిగ్భ్రాంతిని, పరాభవాన్ని వ్యక్తం చేయడానికి 'అల్‌మాక్' పదాన్ని ఉపయోగిస్తారు. ఈ పదాన్ని కూడా ఆక్స్‌ఫర్డ్‌లోకి దత్తత తీసుకున్నారు. ఇతరభాషలతోపాటు ఇంగ్లీషు మాట్లాడేవారు కొన్ని భావాలను వ్యక్తం చేయడానికి తగిన పదాలు ఆ క్షణానికి లభ్యంకావు. ఈ విధంగా ఇతర భాషల నుండి అరువు తెచ్చుకున్న పదాలతో భావవ్యక్తీకరణ శూన్యతను భర్తీ చేస్తారు. సూర్యుడు ఆకులమీద పడి ప్రకృతికి గొప్ప అందాలు కలగజేస్తుంటే కలిగే భావజాలాన్ని వ్యక్తం చేయడానికి ఒక పదం కావాలని మనకు అనిపించదా? ఆరు బయట అందమైన ప్రకృతిమధ్య కూర్చుని ఇష్టమైన పానీయం సేవిస్తూ ఉన్నప్పుడు కలిగే భావాన్ని వ్యక్తం చేయడానికి ఒక పదం కావాలి కదా? అలాంటప్పుడు లెక్సికల్‌ను ఇలా దత్తత పదాలతో భర్తీచేస్తారు. ఈ మధ్య ఆక్స్‌ఫర్డ్ నిఘంటువుఓకి మలేసియా, సింగపూర్‌ల నుండి ఆహారం, వంటలకు సంబంధించిన ఎక్కువ పేర్లను దత్తత చేసుకున్నారు.

## 25 వేల కి.మీ. మేర
# 2లేన్ రోడ్లు 4లేన్‌గా మార్పు

### రూ. 10 లక్షల కోట్ల వ్యయంతో నిర్మిస్తాం : గడ్కరీ



**న్యూఢిల్లీ :** దేశంలో 25 వేల కిలోమీటర్ల మేర రెండు లైన్ల జాతీయ రహదారులను నాలుగు లైన్లుగా మారుస్తామని కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. రూ.10 లక్షల కోట్ల వ్యయంతో ఈ పనులు చేపడతామని, తద్వారా రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గుముఖం పడతాయన్నారు. గురువారం గడ్కరీ లోక్ సభలో మాట్లాడుతూ.. రూ.6లక్షల కోట్లతో 16వేల కి.మీ జాతీయ రహదారులను ఆరు లైన్లుగా మార్చుతామన్నారు. రూ.10లక్షల కోట్లతో 25వేల కి.మీ మేర రెండు లైన్ల జాతీయ రహదారులను నాలుగు లైన్లుగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. వీటికి సంబంధించి డిపిఆర్‌లు సిద్ధమవుతున్నాయని, రెండేళ్లలో పనులు పూర్తవుతాయని భావిస్తున్నామని నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇస్తున్నామని, అవి పూర్తైన తర్వాత రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గే అవకాశం ఉందన్నారు. మరోవైపు దేశంలో ఏటా 4.8లక్షల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని కేంద్ర మంత్రి గడ్కరీ ఇటీవల వెల్లడించారు. వీటిలో 18 నుంచి 45 ఏళ్ల వయసు కలిగిన 1.88లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. ఈ ప్రమాదాల కారణంగా దేశ జిడిపి ఏటా 3శాతం నష్టపోతోందన్నారు. 2030 నాటికి ఈ ప్రమాదాల సంఖ్యను సగానికి తగ్గించే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు

## పాక్‌జైలులో ఉరి వేసుకుని
## భారత మత్స్యకారుడు ఆత్మహత్య

**కరాచీ:** పాకిస్థాన్ జైలులో మగ్గిపోతున్న భారత్‌కు చెందిన ఓ మత్స్యకారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాత్‌రూమ్‌లో ఉరి వేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు. జైలు సూపరింటెండెంట్ ఈ విషయాన్ని వెల్లడించినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. భారత్–పాకిస్థాన్ జల సరిహద్దులపై సరిగా అవగాహన లేకుండా చేపల వేటకు వెళ్లి అక్కడి అధికారులకు చిక్కినవారు ఎంతోమంది ఉన్నారు. అదేవిధంగా భారత్‌కు చెందిన మత్స్యకారుడు గౌరవ్‌రామ్ ఆనంద్‌ను (52) 2022లో అదుపులోకి తీసుకున్నారు. అతడిని అరెస్టు చేసి కరాచీ జైల్లో ఉంచారు. నాటి నుంచి అతడు అక్కడి కారాగారంలోనే మగ్గిపోతున్నాడు. అయితే.. మంగళవారం రాత్రి బాత్‌రూమ్‌లోకి వెళ్లిన మత్స్యకారుడు తాడుతో బలవన్మరణానికి పాల్పడ్డాడు. అతడు ఎంతసేపటికి బయటకి రాకపోవడంతో అనుమానించిన జైలు అధికారి లోపలికి వెళ్లి చూడగా అప్పటికే అతడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయడంతో విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసేంతవరకు మృతదేహాన్ని కోల్డ్‌స్టోరేజ్‌లో ఉంచనున్నట్లు పాక్ అధికారులు తెలిపారు. కాగా.. గత నెలలో తమ కారాగారంలో ఉన్న 22 మంది మత్స్యకారులను పాక్ ప్రభుత్వం విడుదల చేసిన సంగతి తెలిసిందే. వారి శిక్షాకాలం పూర్తికావడంతో కరాచీలోని మాలిర్ కారాగారం నుంచి విడుదల చేసింది. మత్స్యకారులు సరిహద్దులను సరిగా గుర్తించకపోవడంతో ఇరువైపులా ఈ అరెస్టులు జరుగుతున్నాయి. ఇదిలాఉంటే.. జనవరి 1న ఇరుదేశాల ఖైదీల జాబితా మార్పిడి జరిగింది. పాకిస్థాన్‌లో 266 మంది భారత ఖైదీలు ఉన్నారు. భారత జైళ్లలో మొత్తం 462 మంది పాకిస్థానీయులు ఉన్నట్లు మన దేశ జాబితా పేర్కొంది. తాజాగా ఓ మత్స్యకారుడు జైల్లో ఆత్మహత్యకు పాల్పడడం ఆందోళన కలిగిస్తోంది.

## అక్రమ ఇసుక ఫిల్టర్లపై దాడులు

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి:** కృత్రిమ ఇసుక తయారీ కేంద్రాలపై గురువారం గట్టు రెవెన్యూ, పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి అక్రమ ఫిల్టర్ ఇసుక తయారీ కేంద్రాలను ధ్వంసం చేశారు. గట్టు మండల పరిధిలోని చిన్నోనిపల్లి రిజర్వాయర్ లో అక్రమార్కులు మట్టి ద్వారా ఫిల్టర్ ఇసుకను తయారీ చేస్తూ ప్రకృతి వనరులను దోచుకుని అక్రమార్జనకు పాల్పడుతున్నారు. విషయం తెలుసుకున్న గట్టు తహసీల్దార్ సలీముద్దీన్, ఎస్ఐ మల్లేష్, చిన్నోనిపల్లి రిజర్వాయర్ లో దాడులు నిర్వహించి ఫిల్టర్ ఇసుక కేంద్రాలను, డంపు ను సీజ్ చేశారు. అక్రమ ఇసుక తయారు చేస్తున్న జెసిబి వెంకటేష్, రమేష్ తో పాటు మరి కొందరిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ ఐ తెలిపారు. కృత్రిమంగా ఇసుకను తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



## కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

**సిపిఐ మండల కార్యదర్శి అనంతుల రామచంద్రయ్య**

**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని పిఏసిఎస్, ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని సిపిఐ మండల కార్యదర్శి అనంతుల రామచంద్రయ్య ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ సిజన్ ప్రారంభం అయి 20 రోజులు కావస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదని దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని ఆయన అన్నారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఐకేపి, పిఏసిఎస్ కేంద్రాలను ఏర్పాటు చేసిన తర్వాత కేంద్రాలలో మౌలిక సదుపాయాలను కల్పించి, అకాల వర్షాలకు ధన్యం తడిసి రైతులు ఇబ్బందులు పడకుండా టార్పలిన్ కవర్లను ఏర్పాటు చేయాలని, త్వరిత గతిన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి సకాలంలో రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు తరలించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. రైతులు ధాన్యాన్ని కేంద్రాలకు అమ్మిన మూడు, నాలుగు రోజులలో రైతుల అకౌంట్లలో డబ్బులు జమ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకొని రైతులు నష్టపోకుండా కాపాడాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.



## ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే

**ప్రజాపక్షం/డిండి:** ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులేనని సిపిఐ డిండి మండల కార్యదర్శి శ్రీరామదాసు క నకాచారి అన్నారు. బుధవారం రాత్రి చెరుకుపల్లి గ్రామశాఖ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సిద్దమవ్వాలని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి బొల్లే శైలేష్, గ్రామశాఖ కార్యదర్శి నూతనగంటి హనుమంత్, సహాయ కార్యదర్శి రాములు, సభ్యులు సాలయ్య, మల్లయ్య, జంగు, మల్లయ్య, మకోజి, లింగయ్య, సైదులు, చంద్రయ్య, ఆంజనేయులు, చరణ్, హుస్సేన్, అలివేలు, హలీమా, నాగమ్మ, సైదమ్మ, రామకృష్ణ, ముత్యం, గణేష్, సైదులు, మురళి, వెంకటేష్ పాల్గొన్నారు.

## బంజారా భాషను గుర్తించడం హర్షణీయం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాష్ట్రంలో 33లక్షల మంది బంజారాలు మాట్లాడే గోర్‌బోలీ బాషాను కేంద్ర ప్రభుత్వం గుర్తించి రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని తెలంగాణ శాసనసభ గురువారం ఆమోదించి పార్లమెంట్‌కు పంపడం హర్షణీయమని బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరద్‌నాయక్ అన్నారు. గురువారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో బంజారా భాషను గుర్తించి రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని శాసనసభ తీర్మాణం చేయడం గొప్ప విషయమన్నారు. శాసనసభలో తీర్మాణం చేయడానికి కృషి చేసి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, బంజారా ఎమ్మెల్యేలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే గోర్‌బోలి బాషను 8వ షెడ్యూల్‌లో చేర్చి ఆమోదించాలని కోరారు.

## నవోదయ ఫలితాల్లో ఎలైట్ క్రియేటివ్ స్కూల్ విద్యార్థి ప్రతిభ



**ప్రజాపక్షం/కోదాడ:** ప్రభుత్వం మంగళ వారం విడుదల చేసిన నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో కోదాడ ఎలైట్ క్రియేటివ్ స్కూల్ విద్యార్థి షేక్ జాస్మిన్ ఉత్తమ ప్రతిభ కనబర్చి 6వ తరగతి ప్రవేశానికి అర్హత సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కోటి సీతాలక్ష్మి, డైరెక్టర్ వేదాంతరావులు అన్నారు. గురువారం పాఠశాల ఆవరణలో నవోదయలో సీటు సాధించిన విద్యార్థిని షేక్ జాస్మిన్‌ను, తల్లిదండ్రులను పాఠశాల తరుపున ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోదాడలోని తమ పాఠశాల విద్యార్థులు నవోదయ, సైనిక పాఠశాలలో ప్రవేశాలకై సీట్లు సాధించారని తెలిపారు. విద్యార్థులు భవిష్యత్‌లో మరెన్నో ఉన్నతమైన అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సర్టిఫికెట్ కోర్స్ విద్యార్థులకు ఉపయోగం



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** సర్టిఫికెట్ కోర్స్ విద్యార్థులకు భవిష్యత్తులో ఆదాయ పన్ను ప్రొఫెషనల్ గా స్థిరపడడానికి ఉపయోగపడుతుందని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫసర్ కె శ్రీనివాసరాజు సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగము ఆధ్వర్యంలో ఇన్కమ్ టాక్స్ రిటర్న్ ఈఫైలింగ్ పై 30 రోజుల కాల వ్యవధి గల సర్టిఫికెట్ కోర్సు నిర్వహించినారు. ఈ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు గురువారం సర్టిఫికెట్స్ ప్రధానం చేసినారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ సర్టిఫికెట్ కోర్స్ విద్యార్థులు భవిష్యత్తులో ఆదాయ పన్ను ప్రొఫెషనల్ గా స్థిరపడడానికి ఉపయోగపడుతుందని ఇన్కమ్ టాక్స్ రిటర్న్ ఈ ఫైలింగ్ అనేది ఈరోజుల్లో ఎంతో ఉపయోగకరమైనదని భావించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కె సాలయ్య,డాక్టర్ జి అమరావతి, డాక్టర్ ఎస్. రాజారామ్, డాక్టర్ ఎస్. రాజు, శైలజ,రవి చంద్ర, నగేష్,విద్యార్థులు,పాల్గొన్నారు.

## ఎర్రవల్లి చౌరస్తాపై ఫ్లైఓవర్ నిర్మించాలి



**ప్రజాపక్షం/ఎర్రవల్లి :** ఎర్రవల్లి చౌరస్తాలో రోజురోజుకు ట్రాఫిక్ పెరిగిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. గతంలో ఎర్రవల్లి చౌరస్తా ప్రాంతం అభివృద్ధి లేకపోవడం ఇక్కడ బెటాలియన్ ఏర్పాటు కావడం మండలం కావడం జరిగింది. ఇంతేగాక జాతీయ రహదారిపై వేల వాహనాలు కర్నూలు హైదరాబాద్ వేల్పు ఇక్కడి గ్రామాల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నది, రోడ్డు దాటాలంటే ఇరువైపులా చూసుకుని వెళ్లాల్సి వస్తుంది. షేక్ పల్లి పల్లెపాడు తదితర గ్రామాల ప్రజలు రోడ్డు దాటడానికి నానా ప్రయాస పడాల్సి వస్తున్నది. జాతీయ రహదారి మధ్యలో జిబ్రా గుర్తులు వేసి ట్రాఫిక్ నియంత్రణ చేసిన వాహనాల రాకపోకల ఇబ్బంది తప్పడం లేదు. గతంలో మాజీ ఎంపీ డాక్టర్ మంద జగన్నాథం ఫ్లైఓవర్ నిర్మించాలని డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికైనా ఫ్లైఓవర్ నిర్మించి ఇక్కడి గ్రామాల ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## ఏప్రిల్ 4వరకు చేయూత పింఛన్లు పంపిణీ

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లాలో వివిధ రకముల చేయూత పింఛను దారులు 27నుండి ఏప్రిల్ 4వరకు బట్వాడా చేయబడునని డిఆర్ డిఓ శేఖర్ రెడ్డి తెలిపారు. పింఛనుదారులైన వృద్ధులు, వితంతు, వికలాంగుల, చేనేత, కల్లుగీత, ఒంటరి మహిళలు సంబంధిత పోస్టల్ శాఖ ద్వారా పొందాలన్నారు. పింఛనుదారులు మధ్య దళారీలను నమ్మ కుండా పింఛను మొత్తం నేరుగా సంబంధిత పోస్టల్ శాఖ వారి వద్ద నుండి పొందాలన్నారు. అదేవిదంగా పింఛను మొత్తం సొమ్ము రూ.16తో సహా అడిగి తీసుకోవాలని సూచించారు.



## సాగునీరందించి వరిని కాపాడండి

**కలెక్టరేట్ ముందు రైతుల ధర్నా**

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి:** యాసంగిలో సాగు చేసిన వరి పంటకు సాగు నీరు సరఫరా చేసి పంటను కాపాడాలని జిల్లా కలెక్టరేట్ ముందు రైతులు ధర్నా చేపట్టి కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. గద్వాల మండలంలోని కొత్తపల్లి గుంటిపల్లి రేకులపల్లి, చెనుగోనిపల్లి గ్రామాల రైతులు మాట్లాడుతూ జూరాల కుడి కాల్వ కింద 2 వేల ఎకరాలు ఆయకట్టు సాగుతోందన్నారు. ప్రస్తుతం వారబందీ పద్దతిలో సాగునీరు వదులుతున్నామని చెబుతున్నా, వారానికి కేవలం రెండు రోజులే నీటిని వదలడంతో పంటలకు నీరు అందక ఎండు ముఖం పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం బావులు, బోర్ల నీటితో నైనా పంటలను కాపాడేందుకు ప్రయత్నించగా కరెంటు కోతల కారణంగా చివరి దశలో ఉన్న వరి పంటను కాపాడుకునేందుకు ఇబ్బందు లు పడుతున్నామన్నారు తక్షణమే కలెక్టర్ స్పందించి సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

## పరిశ్రమలలో స్థానికులకు ఉద్యోగాలు

**యాదాద్రి భువనగిరి జిల్లా ఎఐవైఎఫ్ అధ్యక్షుడు ఎల్లంకి మహేష్ డిమాండ్**




**ప్రజాపక్షం/మోటకొండూర్ :** పరిశ్రమలలో స్థానికులకు 75 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ఎన్నికల ముందు ప్రకటించిన యూత్ డిక్లరేషన్ తోపాటు జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి లాంటి హామీలు అమలు చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఎఐవైఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లంకి మహేష్, పేరబోయిన మహేందర్‌లు అన్నారు. గురువారం మోటకొండూరు మండల కేంద్రంలో అఖిలభారత యువజన సమైక్య (ఎఐవైఎఫ్) మోటకొండూర్ 3వ మండల మహాసభ మండల అధ్యక్షులు బీరకాయల మధు అధ్యక్షతన నిర్వహించగా వారు పాల్గొని మాట్లాడుతూ మూటకొండూర్ మండలంలో నిరుద్యోగ సమస్య చాలా ఇబ్బందికరంగా ఉన్నదని, మండలంలోని కాటేపల్లిలో ఉన్న ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో స్థానికులకే 75 శాతం ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రభుత్వ ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలని అన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్రంలో అటు బిజెపి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తాత్సారం చేస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ శాఖలలో ఖాళీ పోస్టులు ఉన్నా నియామకాలు మాత్రం చేపట్టకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. పాలకుల అనుసరిస్తున్న తీరుపై నిరుద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి ఉందని అన్నారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఆలేటి బాలరాజ్, అధ్యక్షులుగా బీరకాయల మధు, ఉపాధ్యక్షులుగా గట్టిపాముల సునీల్, మారబోయిన దేవరాజ్, ప్రధాన కార్యదర్శిగా బోలగాని అశోక్, సహాయ కార్యదర్శులుగా మం చాల మచ్చ గిరి, ఇందిరియాల రేవతి, కోశాధికారిగా గట్టి కొప్పుల శ్రీకాంత్, గంధమల్ల రాకేష్, బీరకాయల గణేష్, తోపాటు 21 మంది కౌన్సిల్, 9 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గాధగని మాణిక్యం, నల్ల రాములు, బోగారం పాండు, సాయికుమార్, శ్రీనివాస్, రమేష్, వినయ్ కుమార్, స్వామి పాల్గొన్నారు.



## లక్ష్యసాధనకు కృషి చేయాలి

**నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**ప్రజా పక్షం/ నల్లగొండ టౌన్ :** విద్యార్థి దశనుండే ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ఆ లక్ష్యసాధనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి విద్యార్థులకు బోధించారు.గురువారం ఆమె జిల్లా కేంద్రం సమీపంలోని శ్రీ రామానంద తీర్థ ఇన్స్టిట్యూట్ లో ఏర్పాటుచేసిన నిడమనూరు తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా జిల్లా కలెక్టర్ తరగతి గదులలోకి వెళ్లి విద్యార్థుల తెలివితేటలను పరీక్షించారు. గణితం, సైన్స్, సోషల్ ,హిందీ ,ఇంగ్లీష్ సబ్జెక్టులపై వివిధ రకాల ప్రశ్నలను అడిగారు.

## కులం పేరుతో దూషించిన ముగ్గురికి ఏడాది జైలు

**ప్రజాపక్షం/ మాడ్గులపల్లి:** కులం పేరుతో దూషించి దాడి చేసిన ముగ్గురికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ స్పెషల్ కోర్టు ఫర్ ట్రయల్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ కేసెస్ కమ్ సెకండ్ ఏడీజే కోర్టు గురువారం తీర్పునిచ్చింది. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం మాడ్గులపల్లి మండలం కుక్కడం గ్రామానికి చెందిన నకిరేకంటి శ్రీను, రజిత భార్యభర్తలిరువురు 2020 సంవత్సరంలో వారి వ్యవసాయ పొలంలో వరికోత మిషన్‌తో వరి కోస్తుండగా ఇంకో మడిలోకి వెళ్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన బట్టు సైదిరెడ్డికి చెందిన పొలంలోకి కోత మిషన్ వెళ్లగా మా పొలంలోకి మిషన్ ఎందుకు వచ్చిందంటూ సైదిరెడ్డితో పాటు కుమారుడు మహేందర్‌రెడ్డి, భార్య లక్ష్మమ్మ ముగ్గురు కలిసి నకిరేకంటి శ్రీనును కులం పేరుతో దూషించి దాడి చేయడంతో శ్రీను చేయికి తీవ్ర గాయాలయ్యాయి. నా భర్తను కులం పేరుతో దూషించి దాడి చేశారంటూ భార్య నకిరేకంటి రజిత మాడ్గులపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేయడంతో మిర్యాలగూ డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు విచారణ చేపట్టి నల్లగొండలోని ఎస్సీ, ఎస్టీ కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణ అనంతరం ముగ్గురు నిందితులకు ఒక్కొక్కరికి కులం పేరుతో దూషించినందుకుగాను ఆరు నెలలు, దాడి చేసినందుకు మరో ఆరు నెలలు మొత్తం ఏడాది జైలు శిక్షతోపాటు, ముగ్గురికి రూ.3వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి రోజారమణి గురువారం తీర్పునిచ్చారు.

## మహిళలు ఆర్థికంగా బలోపేతం అయ్యేలా చర్యలు



**ప్రజాపక్షం/ నల్లగొండ :** ధాన్యం కొనుగోలు, పాఠశాల విద్యార్థుల యూనిఫామ్స్, పెట్రోల్ బంకుల నిర్వహణ తదితర కార్యక్రమాల వల్ల స్వయం సహాయక మహిళా సంఘాలు ఆర్థికంగా మరింత బలోపేతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ అన్నారు. గురువారం ఆయన హైదరాబాద్ నుండి సెర్ప్ సిఈఓ దివ్య తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, డిఆర్‌డిఓ,సెర్ప్ అధికారులతో స్వయం సహాయక మహిళా సంఘాల కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఐకెపి ద్వారా రబీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను మరింత పెంచాలని, కొనుగోలు కేంద్రాల నిర్వహణలో భాగంగా ఐకెపి మహిళా సంఘాలకు ఇవ్వాల్సిన పెండింగ్‌లో ఉన్న కమిషన్ ను సమీక్షించాలని, కమిషన్ మొత్తాన్ని 10 జిల్లా సమాఖ్యలు, 90 గ్రామ సమస్యలకు వెళ్లే విధంగా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని, గన్ని బ్యాగుల సమీకరణ చేయాలని , భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మండల కేంద్రంలో మహిళ సంఘాల ద్వారా గోడౌన్లతో పాటు, రైస్ మిల్లుల ఏర్పాటు వంటివి ఆలోచిస్తున్నందున ధాన్యం కొనుగోలులో స్వయం సహాయక మహిళా సంఘాలు చురుకుగా పాల్గొనేలా చూడాలన్నారు. ఈ పెట్రోల్ బంకుల వద్ద రెస్టారెంట్, మాల్స్ నిర్వహించాలని, భవిష్యత్తులో ఇందిరా మహిళా శక్తి బజార్ వంటి వాటిని నిర్వహించేందుకు ఆస్కారం ఉందన్నారు . సాధారణ జీవిత బీమా, ప్రమాద బీమా ల పై ఆయన సమీక్షించారు.సర్ఫ్ సిఈవో దివ్య వివిధ అంశాలపై జిల్లా కలెక్టర్లకు సూచనలు, సలహాలు ఇచ్చారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ ,డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చెరువులు, కుంటలను, అడవులను కాపాడాలి

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** రాష్ట్రీయ ఆవిష్కార్ సప్తహ కార్యక్రమంలో భాగంగా తేది గురువారం కొరటికల్ గ్రామంలో ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీగా వెళ్లి గ్రామంలోని చెరువును సందర్శించి రాబోయే వేసవి కాలంలో నీటి ఎద్దడిని గుర్తించి, ప్రతి గ్రామంలో చెరువులను, కుంటలను, అడవులను కాపాడుకోవాలని తెలుసుకున్నారు. గ్రామంలోని పెద్ద మర్రి చెట్టును సందర్శించి దానిపై నివసిస్తున్న వివిధ జీవులకు ఇదే ఆవాసమని తెలుసుకొని, నేటి మొక్కలే రేపటి వృక్షాలు అని ప్రతి ఒక్కరూ రాబోయే రోజులలో మొక్కలను నాటాలని కోరారు. గ్రామాల్లో పెద్ద పెద్ద వృక్షాలు ఉండటం లేదని అందుకే వర్షాలు పడడం లేదని అన్నారు.మహా వృక్షాలు ఉన్న రైతులకు ప్రోత్సహకాలు ఇవ్వాలని అన్నారు. తదనంతరం పాఠశాలలో జరిగిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు డి.వెంకన్న మాట్లాడుతూ ప్రపంచానికి మొక్కే దిక్కు అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రటరీ నరేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు స్వామి, రవి, వర ప్రసాద్, శ్రీనివాస చారి, అనురాధ, వెంకటేశంలు పాల్గొన్నారు.

## కోదాడలో రాష్ట్రస్థాయిలో క్రీడలు అభినందనీయం

**కోదాడ డిఎస్‌పి మామిళ్ల శ్రీధర్‌రెడ్డి**

**ప్రజాపక్షం/కోదాడ :** కోదాడలో మూడు రోజుల పాటు రాష్ట్రస్థాయి క్రీడాసాహిత్య సాంస్కృతిక వేడుకలు నిర్వహించడం అభినందనీయమని కోదాడ డిఎస్పీ మామిళ్ల శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో కోదాడ యూనిట్ అధ్యక్షులు వేనేపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వానికి ఎంతో కాలం సేవలందించి పదవి విరమణ పొందిన అనంతరం విశ్రాంతి తీసుకోకుండా సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. సూర్యాపేట జిల్లా నుంచి రాష్ట్రస్థాయి క్రీడల్లో గెలుపొందిన విజేతలకు, పిఈటిలకు కార్యక్రమ నిర్వహణ కన్వీనర్లను అభినందించారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షులు రావెళ్ల సీత రామయ్య మాట్లాడుతూ కోదాడ పెన్షనర్ల సంఘం అనేక కార్యక్రమాలను చేపడుతూ రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తుందని ఈ కార్యక్రమాలను చూసి రాష్ట్ర వ్యాప్తంగా పెన్షనర్లు అనుసరిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్పీ శ్రీధర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం మార్చినెలలో జరుపుకునే పెన్షనర్ల జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం నాయకులు వేనేపల్లి శ్రీనివాసరావు, కృష్ణయ్య, సుబ్బయ్య, ఎర్నేని రంగారావు, సుదర్శన్‌రెడ్డి, బొల్లు రాంబాబు, సోమయ్య, రఘు, వరప్రసాద్, శోభ, భ్రమరాంబ తదితరులు పాల్గొన్నారు.




## రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకే కందుల కొనుగోలు

**ప్రజా పక్షం/ హాలియా:** రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలనే ఉద్దేశంతోనే హాలియా మార్కెట్లో కందుల కొనుగోలు కేంద్రాన్ని మంజూరు చేయించినట్లు మాజీ సిఎల్‌పి నేత కుందూరు జానారెడ్డి అన్నారు. గురువారం ఆకస్మికంగా హాలియా మార్కెట్లో నిర్వహిస్తున్న కందుల కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి రైతులతో ముచ్చడించారు. ఇక్కడ కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి అని ఈ ప్రాంత రైతులు నా దృష్టికి తీసుకు వచ్చారని వారికి కనీస మద్దతు ధర అందించాలనే ఉద్దేశంతోనే ఇక్కడ కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయించినట్లు నాయకులు జానారెడ్డి రైతులకు తెలిపారు. జిల్లా మొత్తంలో మన హాలియా మార్కెట్ లోనే పెద్ద ఎత్తున కందులు కొనుగోలు జరగడం అభినందనీయమన్నారు. హాలియా మార్కెట్లో కందుల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసిన తర్వాత ఇప్పటివరకు 283 మంది రైతులు 7110 బస్తాల కందులు తెచ్చారని తెలిపారు. 3555 క్వింటాళ్ల కందులను కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి, డిసిసి కార్యదర్శి కాకునూరి నారాయణ గౌడ్, గౌని రాజా రమేష్,నాగిరెడ్డి, మార్కెట్ అధికారులు పాల్గొన్నారు.



## పగడాల ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరపాలి




**నియోజకవర్గ ఫాస్టర్స్ ఫెలోషిఫ్ అధ్యక్షులు బిషప్ సుదర్శనం**

**ప్రజాపక్షం/మునగాల:** క్రైస్తవ ప్రభోదకుడు, గ్రంధాల పరిశోధకుడిగా పేరొంది. హైద్రాబాద్ నగ కేంద్రంగా చేసుకుని ప్రపంచ వ్యాప్తంగా సువార్తికుడిగా పనిచేస్తున్న పగడాల ప్రవీణ్ గత మంగళవారం తెల్లవారుజామున అనుమానస్పద స్థితిలో రాజమండ్రి సమీపంలో మరణించడం క్రైస్తవ లోకానికి తీరనిలోటు అని, పగడాల ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరపాలని కోదాడ నియోజకవర్గ ఫాస్టర్ ఫెలోషిఫ్ అధ్యక్షులు బిషప్ డాక్టర్ జె.సుదర్శనం అన్నారు. గురువారం మునగాల మండల కేంద్రంలో శాంతిర్యాలీ నిర్వహించి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం బిషఫ్ డాక్టర్ సుదర్శనం మాట్లాడుతూ ప్రవీణ్ మృతి రెండు తెలుగు రాష్ట్రాల్లో మాత్రమే కాదని, ప్రపంచ వ్యాప్తంగా ఆయన మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఇది మతచందసవాదులు చేసిన కుట్రలో భాగమేనని ఆయన దుయ్యబట్టారు. ప్రవీణ్ మృతిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసులు సమగ్ర విచారణ జరిపి హత్యకు కారణమైన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రైస్తవ మీడియా కన్వీనర్ జెజె సామ్యూల్‌సన్, మునగాల ఫాస్టర్స్ పెలోషిఫ్ అధ్యక్ష, కార్యదర్శులు ఆదాం, సామ్యూల్ పీటర్, సామాజిక కార్యకర్త గంధం సైదులు, కోదాడ టౌన్ అధ్యక్షులు పి.పాల్‌చారి, ఎల్.లాజర్, డేవిడ్‌రాజు, లుకా, వసంత్, ఎం.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ నిధులు దుర్వినియోగం

**ఫీల్డ్ అసిస్టెంట్ చర్యలు తీసుకోవాలని మండల సామాజిక తనిఖీలో జిల్లా అధికారులకు గ్రామస్తుల ఫిర్యాదు**

**ప్రజాపక్షం/డిండి:** నల్గొండ జిల్లా డిండి మండలంలోని చెరుకుపల్లి ఉమ్మడి గ్రామ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ మూడావత్ గోపాల్ నాయక్ నిధులు దుర్వినియోగం చేశారని బంధువులకు పనులు కల్పించి పనిచేయని వారి పేర్లతో ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేశారని, ఉపాధి హామీకి సంబంధించిన పనిముట్లు సైతం ఎవరికి ఇవ్వకుండా తన ఇష్టానుసారంగా వాడుకున్న ఫీల్డ్ అసిస్టెంట్ గోపాల్‌పై చర్యలు తీసుకోవాలని గురువారం డిండి మండల కేంద్రంలో జరిగిన మండల సామాజిక తనిఖీలో హాజరైన ఉపాధి హామీ జిల్లా అధికారులకు చెరుకుపల్లి ఉమ్మడి గ్రామ పంచాయతీ పరిధిలోని తండా వాసులు ఫిర్యాదు చేశారు. కొంతమంది వారి కుటుంబ సభ్యులు బంధువుల జాబ్ కార్డులతో పనిచేయకున్న హైదరాబాద్‌లో ఉన్న వారికి సైతం మాస్టర్ కేటాయించి డబ్బులు తీసుకున్నారని తెలిపారు. కుందేలుబావితండా, బురాన్‌పూర్‌తండా, గదరాల తండాలో మాత్రమే బంధు ప్రీతీతో పనులు కల్పించి చేరుకుపల్లి పరిసర ప్రాంతాల్లో పనులు కల్పించకుండా అధికార దుర్వినియోగం చేస్తూ ప్రభుత్వ నిధులను పక్కదారి పట్టించి పనులు చేయకుండానే డబ్బులు పేమెంట్ చేసి ఆర్థిక దోపిడికి పాల్పడుతున్నారని, అలాంటి ఫీల్డ్ అసిస్టెంట్ పై చర్యలు తీసుకోవాలని 25 మంది గ్రామ ప్రజలు ఆధారాలతో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో సర్వన్, కాట్రావత్ రాజు, జగన్, బాలకృష్ణ, మురళి, రమేష్, పవన్, జగ్య, రవి, గోపి ఉన్నారు.



# 30లోగా ఉపాధి హామీ పనులు పూర్తి

కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన నిర్మాణ పనులను ఈ నెల 30వ తేదీలోగా పూర్తి చేసి ఎం.బి. రికార్డులు సమర్పించాలని, జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో జూమ్ మీటింగ్ ద్వారా జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, పంచాయతీరాజ్ ఇఇ ప్రభాకర్ లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరం ముగింపుకు 4 రోజులు మాత్రమే ఉన్నందున, మండలాల వారీగా మంజూరైన సిసి రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు ఉపయోగపడేలా పనుల నాణ్యతను కచ్చితంగా పాటించాలని, ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షణను పెంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



ప్రజాపక్షం/నిజాంసాగర్: మహ్మద్‌నగర్ మండలంలోని ఓ వ్యక్తికి సీఎం సహాయనిధి చెక్కును పిట్లం ఏఎంసీ చైర్మెన్ చీకోటి మనోజ్‌కుమార్ గురువారం అందజేశారు. మండలంలోని గిర్నితాండాలో అనారోగ్యంతో భాధపడుతూ ఆయా ఆసుపత్రులలో చికిత్స పొందిన పలువురు సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోవడంతో వారికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను జుక్కల్ ఎమ్మెల్యే సూచన మేరకు పిట్లం ఏఎంసీ చైర్మెన్ చీకోటి మనోజ్‌కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు సవాయిసింగ్, నాయకులు రాములు, మోతిలాల్, డాన్‌సింగ్, వర్ష, యువ నాయకుడు సురేష్, సూర్య, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ రంగంలోకి చదువుకున్న యువత రావాలి

సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి సుధాకర్

ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్: వ్యవసాయ రంగంలోకిచదువుకున్న యువత రావాలని అప్పుడే వ్యవసాయాభివృద్ధి అవుతుందని సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. గురువారం స్తానిక బిఎల్ఎన్ గార్డెన్లో రాష్ట్ర మూడవ రైతు మహాసభలు ముగింపు సందర్భంగా మాట్లాడారు. ఏ రంగం అభివృద్ధి చెందాలన్నా ముఖ్యమైన భూమిక పోషించే యువత ఆ రంగంలోకి పనిచేయాలని, చదువుకున్న యువత వల్ల వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతుందని అన్నారు. నేడు శాస్త్ర, సాంకేతిక రంగం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ కాలంలో అట్టి శాస్త్ర, సాంకేతిక రంగాలను వ్యవసాయ రంగంలో ఉపయోగించుకుని ప్రస్తుత ప్రభుత్వాలు ఈ మార్కెట్లను అభివృద్ధిచేస్తుంది. ఇలాంటి పరిస్తితుల్లో చదువుకున్న యువత వ్యవసాయ రంగంలో రాణించినట్లయితే వ్యవసాయ రంగం సైతం నూతన ఒరవళ్లతో ముందుకు వెళుతుందన్నారు. ఈ దిశగా ప్రభుత్వాలు యువతని వ్యవసాయ రంగంవైపు ఆకర్షితులయ్యే విధంగా విద్యావిధానంలో మార్పులు చేయాలన్నారు. జిల్లాలో రాష్ట్ర రైతు మహాసభ నిర్వహించడానికి జిల్లాలోని పార్టీ అన్ని విభాగాలు ఐకమత్యంతో ఒక కట్టుగా పనిచేయడం వల్లే విజయవంతం చేయగలిగామని అన్నారు. ఈ విజయానికి పాల్పడిన పార్టీ కార్యకర్తలకి, వివిధ విభాగాల నాయకులకు పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా విచ్చేసిన రైతు నాయకులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.

# ప్రణాళికాబద్ధంగా ధాన్యం కొనుగోలు

కలెక్టర్ రాహుల్ రాజ్



ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి: యాసంగి 202425 వరి పంట కొనుగోలు నిమిత్తం ధాన్యము కొనుగోలు కేంద్రాలను ఏప్రిల్ మాసంలో అవసరానికి తగ్గట్టుగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా పౌర సరఫరా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యాసంగి ధాన్యం కొనుగోలు పై అదనపు కలెక్టర్ నగేష్ తో కలిసి సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో తప్పనిసరిగా తాగు నీరు, విద్యుత్ వసతి కల్పించాలని, టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తూకం వేసే యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ధాన్యం తూకంలో పారదర్శకంగా ఉండాలని, నిర్దేశించిన విధంగా కొనుగోళ్లు చేయాలని సూచించారు. నిర్దేశించిన బరువుకంటే ఎక్కువ ఎట్టి పరిస్థితుల్లోనూ చేయవద్దని ఆయన స్పష్టం చేశారు.

**మద్దతు ధరకే విక్రయించాలి:** రైతులు తాము కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని పిలుపు నిచ్చారు. రైతులు తమ ధాన్యాన్ని తాలు, తప్ప లేకుండా, తేమ శాతం 17 ఉండేలా చూసుకుని, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ కేంద్రాలకు తరలించాలని సూచించారు. ప్రభుత్వం గ్రేడ్ ఏ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2320, సాధారణ రకానికి రూ.2300 నిర్ణయించినందని వెల్లడించారు. నిబంధనల మేరకు రైతులు తమ ధాన్యాన్ని శుభ్రంగా తీసుకువచ్చి, మద్దతు ధర పొందాలని సూచించారు.

**ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం:** రబీ సీజన్ కోతలు మొదలవుతున్న దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 21 మండలాల్లో ఏప్రిల్ మాసం నుండి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ధాన్యాన్ని సేకరించేందుకు 480 కేంద్రాలు ప్రారంభించనున్నట్లు వివరించారు. రైతులకు టోకెన్లు ఇవ్వాలని, దాని ప్రకారం కొనుగోళ్లు చేయాలని సూచించారు. ఆయా శాఖల అధికారులు కొనుగోళ్లు నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించారు.

**అందుబాటులో పరికరాలు:** జిల్లాలో అవసరం మేరకు అన్ని పరికరాలు అందుబాటులో ఉన్నాయని అదనపు కలెక్టర్ వెల్లడించారు. టార్పాలిన్లు 14919, తూకం వేసే యంత్రాలు 700, ప్యాడీ క్లీనర్లు 500 తేమ శాతం చూసే మెషిన్లు 700 అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లాలోని రైతులు వీటిని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ మద్దతు ధరకే ధాన్యాన్ని విక్రయించాలని అదనపు కలెక్టర్ సూచించారు.

**జిల్లా వ్యవసాయ అధికారి, వినయ్:**డిఎం సివిల్ సప్లై జగదీష్ కుమార్, జిల్లా పౌరసరఫల అధికారి సురేష్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి, యాదయ్య,డి.సి.ఓ, కరుణాకర్, లీగల్ మెట్రాలజీ అధికారి, సుధాకర్, ఆర్డీవోలు మెదక్ రమాదేవి, తూఫ్రాన్ జై చంద్ర రెడ్డి, నర్సాపూర్ మహిపాల్ రెడ్డి ఐకెపి, పిఎ సి.ఎస్, మార్కెట్ చైర్మన్లు, రైస్ మిల్లర్స్, అసోసియేషన్ రవాణా, శాఖ తదితరులు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధి పథకం యువతకు మంచి అవకాశం

ప్రజాపక్షం/పాపన్నపేట: స్వయం ఉపాధి పథకాల కోసం ఎదురుచూస్తున్న యువతకు రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ఎంతో లబ్ధి చేకూరుతుందని, అర్హత కలిగిన వారు ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలని మెదక్ అసెంబ్లీ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు భరత్ గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు చెందిన యువతకు మార్చ్ 17వ తేదీ నుండి ఏప్రిల్ 5వ తేదీ వరకు ఆన్లైన్ లో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల మంది నిరుద్యోగులకు లబ్ధి పొందనున్నట్లు వారు తెలిపారు. 50వేల రుణానికి ఒక్క రూపాయి కూడా తిరిగి కట్టవలసిన పనిలేదు అన్నారు. అలాగే లక్షల లోపల యూనిట్లకు 90 శాతం, రెండు లక్షల లోపు రాయితీ 80, నాలుగు లక్షల యూనిట్లకు 70 శాతం సబ్సిడీని నిర్ణయించారన్నారు. ఉపాధి అవకాశాలు మెరుగుపడటానికి ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు.

## హనుమాన్ మండల భిక్షకు హాజరైన పార్టీ ఇన్‌చార్జి ఏనుగు రవిందర్‌రెడ్డి



ప్రజాపక్షం/బాన్సువాడ: బాన్సువాడ మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామంలో గురువారం మార్కెట్ కమిటి చైర్మన్ మంత్రి అంజవ్వ గణేష్, కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన హనుమాన్ మండల భిక్ష కార్యక్రమానికి పార్టీ ఇన్‌చార్జి ఏనుగు రవిందర్‌రెడ్డి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాములకు ఏర్పాటు చేసిన భిక్ష కార్యక్రమంలో భోజనం వడ్డించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ మంత్రి అంజవ్వ గణేష్, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ పాత బాలకృష్ణ, నాయకులు నందు పటేల్, సత్యనారాయణ, బండి సాయిలు యాదవ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాను గౌడ్, బాడి శ్రీనివాస్, వెంక గౌడ్, గాండ్ల సాయిలు, నవీన్ రెడ్డి, దీక్ష స్వాములు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు అడుగుతే అక్రమ అరెస్టులు సరికాదు..



ప్రజాపక్షం/లోకేశ్వరం: పెండిగ్ బిల్స్ గాంధేయ మార్గంలో అడిగితే కూడా ఈ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గం దేశంలో ఎక్కడ లేని విధంగా గ్రామాలను అబివృద్ధి పథంలో వుంచితే మాకు ఇచ్చే గౌరవం అరెస్ట్ చేయడమా అప్పులు తీసుకువచ్చి గ్రామాలలో అనేక మంచి పనులు చేసి ఈరోజు అప్పులపాలు అయి రాష్ట్రంలో అనేక సర్పంచ్ లు ఆత్మహత్య చేసుకుంటున్నారు. అయిన ఈ ప్రభుత్వం చలనం లేకుండా బిల్స్ విడుదల చేయకుండా ఇలా అరెస్టులతో మమ్మల్ని మనోవేదనకు గురి చేయడం మంచిది కాదు అని మండల సర్పంచులు హెచ్చరించారు. అరెస్ట్ అయిన వారిలో గౌరవ మాజీ హవర్గా సర్పంచ్ బుజంగ్ రావు లోకేశ్వరం మాజీ సర్పంచ్ సౌజన్య కపిల్ వట్టొలి మాజీ సర్పంచ్ రజిత సాయన్న, జోహర్పూర్ మాజీ సర్పంచ్ దిగంబర్ లను ఎస్ఐ అశోక్ అరెస్టు చేశారు.

# వైకల్యాన్ని అధిగమించి జీవితంలో ముందుకు సాగాలి

కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజాపక్షం/మంచిర్యాల: దివ్యాంగులు వైకల్యాన్ని అధిగమించి జీవితంలో ముందుకు సాగాలని, అన్ని రంగాలలో రాణించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ, అలింకో సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి ఎస్. యాదయ్య, అలింకో సంస్థ ప్రతినిధులు డా. రంజిత్ రెడ్డి, రిషిగుప్తా లతో కలిసి దివ్యాంగ విద్యార్థులకు సహాయ ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులు తమ వైకల్యాన్ని అధిగమించాలని, అన్ని రంగాలలో రాణించాలని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన స్టీఫెన్ హాకిన్ పూర్తి అంగవైకల్యం కలిగి కదలలేని స్థితిలో మనోధైర్యంతో ఉత్తమ శాస్త్రవేత్తగా ఎదిగాడని, దివ్యాంగులకు ఆదర్శంగా నిలిచాడని, సాధించాలనే పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని అన్నారు. కొంత మంది 70 నుండి 90 శాతం వరకు అంధత్వం కలిగి ఉంటారని, అటువంటి వారికి కంటి లెన్సు అందించి కంటి చూపు మెరుగుపర్చవచ్చని తెలిపారు. చెవుటి దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. ఎంతటి సమస్య ఎదురైనా ముందడుగు వేయాలని, ఎలాంటి సమస్యలు ఎదురైనా ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని, అధైర్యపడకుండా పట్టుదలతో కృషి చేయాలని తెలిపారు. సైనికులుగా పని చేసి ప్రమాదాలలో కాలు, చేతులు కోల్పోయిన వారికి రోబోటిక్ అవయవాలు ఏర్పాటు చేయడంతో వారు అందరిలా సాధారణ జీవితం గడుపుతారని, ఏ సందర్భంలోను ధైర్యాన్ని కోల్పోకూడదని తెలిపారు. అలింకో సంస్థ ద్వారా 17 లక్షల 50 వేల రూపాయల విలువ గల వినికిడి యంత్రాలు, ట్రై సైకిళ్ళు, బ్రెయిలీ కిట్లు, సిపి చైర్లు మొత్తం 215 ఉపకరణాలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమానికి హాజరైన దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్రాగునీరు, భోజన వసతి, ఇతర సౌకర్యాలు కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పోషకాహారం పంపిణీ



ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి: విద్యార్థుల్లో పోషకారం లోపాన్ని మెరుగు పర్చేందుకు పోషకాహార సప్లిమెంట్లను అర్మడ్ వెహికల్స్ నిగమ్ లిమిటెడ్, ఓడిఎఫ్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ సహకారంతో కంది మండలంలోని మూడు ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి విద్యార్థులకు పోషకాహారాన్ని అందిస్తున్నారు. కందిలో రెండు మండల పరిషత్ ప్రైమరీ పాఠశాలలు ఓడీఎఫ్‌లో ఒక ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు పోషకాహార సప్లిమెంట్లను పంఫిణి చేశారు. కందిలో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ఎవిఎన్ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కేసి మోహన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు ఫోషకాహారం అందిస్తున్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి జోగప్ప ,ఉపాధ్యాయులు ,సంధ్యరాణి, విజయలక్ష్మి, శారద ,సరిత ,నర్సింహులు ,విద్యార్థులు, సామాజిక కార్యకర్త కాశీనాథ్‌లు పాల్గొన్నారు.

# మహిళా సంఘాలకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు

కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే




ప్రజాపక్షం/ఆసిఫాబాద్: రబీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ బాధ్యతను ఐకెపి ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు అప్పగించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో సెర్ప్ సిఇఒ దివ్య దేవరాజన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు, జిల్లా గ్రామీణాభివృద్ధి, పౌరసరఫరాల శాఖ అధికారులతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణ కోసం ముందుగా గన్ని సంచులు, టార్పాలిన్ కవర్లు జిల్లాకు కేటాయించామన్నారు. దివ్యాంగులకు యుడిఐడి కార్డులు జారీ చేయడానికి ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నామని, అవసరమైన పరికరాలు అందుబాటులో ఉంచేందుకు భవనాన్ని గుర్తించామని తెలిపారు. వృద్ధాప్య పింఛన్ పొందుతూ మరణించిన వారి కుటుంబాల్లో అర్హులకు పింఛన్ మంజూరు చేస్తామని, జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద కుటుంబ పెద్ద మరణిస్తే సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. మహిళా సంఘాలకు ఏకరూప దుస్తులు కుట్టే బాధ్యత అప్పగించి, జూన్ 12న పాఠశాలలు తెరవడానికి ముందే విద్యార్థులకు అందించేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. మహిళా శక్తి భవనం నిర్మాణం కోసం అనువైన స్థలాన్ని గుర్తించి నిర్మాణం చేపడతామని, మహిళా సంఘ సభ్యులు మృతి చెందినట్లయితే వారి కుటుంబాలకు బీమా వర్తించేలా చూస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## చేపూర్ గ్రామానికి ఎస్‌డిఎఫ్ ఫండ్ రూ.73 లక్షల నిదులు మంజూరు



ప్రజాపక్షం/ఆర్మూర్: ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి ఆర్మూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురకంటి చిన్నారెడ్డి చొరవతో చేపూర్ గ్రామానికి సిసి రోడ్లు, డ్రైనేజీలు, స్కూల్ బిల్డింగ్ కొరకు దాదాపు స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ప్రోస్టింగ్ 73 లక్షల మంజూరుపత్రాలు బుదవారం పిప్రి గ్రామంలో జరిగిన జై బాపు జై భీమ్ జై సంవిదాన్ కార్యక్రమంలో అందుకున్నారు. ఈ నిధులు ఇచ్చినందుకు వినయ్ రెడ్డికి చొరవ చూపిన సురకంటి చిన్నారెడ్డిలకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు దాసరి శ్రీకాంత్, పల్లె గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్కపతి రాజేందర్, అలియాస్ రామ్ సన్, మాజీ ఉప సర్పంచ్ అగాలాదివిటి శ్రీనివాస్, మాజీ ఎంపిటిసి జన్నాపల్లి గంగాదర్, బద్దం రాజు, చిట్యాల పోశెట్టి, సొసైటీ మాజీ డైరెక్టర్ సారంగి శాంతి, గంగ సాయన్న, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## న్యాయం చేయాలని విద్యుత్ అధికారులు ధర్నా



ప్రజాపక్షం/శివ్వంపేట: విధ్యుత్ అధికారులు న్యాయం చేయాలని ధర్నా చేసిన ఘటన శివ్వంపేట మండలం చెన్నాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే గ్రామానికి చెందిన సింగిరెడ్డి సుధాకర్‌రెడ్డి (45) అనే వ్యక్తి తన నూతన ఇంటి నిర్మాణానికి నీరు పడుతుండగా పక్కనే ఉన్న త్రిఫేస్‌విధ్యుత్ వైర్‌కు చేతు తాకడంతో విధ్యుత్‌షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్థులు చెన్నాపూర్ గ్రామంలోని ప్రధానరహదారిపై ధర్నా నిర్వహించారు. ఎన్నో రోజులుగా ఇళ్ల మద్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి దూరంగా వేయాలని చెప్పినా వినలేదని, విధ్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో సుధాకర్‌రెడ్డి మృతిచెందాడని మండిపడ్డారు. విధ్యుత్ అధికారులు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. పోలీసులు కలగజేసుకొని విధ్యుత్ అధికారులతో మాట్లాడారు. వెంటనే సమస్యను పరిష్కరించి న్యాయం చేస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు. మృతదేహాన్ని నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## ఎంపిడిఒ కార్యాలయానికి తాళం వేసిన మాజీ సర్పంచ్‌లు



ప్రజాపక్షం/ కాగజ్‌నగర్ రూరల్: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండల ఎంపిడిఒ కార్యాలయానికి గురువారం మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల మాజీ సర్పంచ్‌లు తాళం వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండేళ్ల కాలంగా బిల్లులు మంజూరు కాకపోవడంతో తీవ్ర అసహనానికి గురవుతున్నామని, అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినప్పటికి సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం లక్షల రూపాయలు వెచ్చించి సిసి రోడ్లు, వీధి దీపాలు, మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలల అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మండలంలో సుమారు 25 మంది మాజి సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులు రావాలని తాము అప్పులు చేసి అభివృద్ధి పనులు చేయించామని తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రాజన్న, నగునూరి శ్రీనివాస్, గంగన్న, లక్ష్మి , ఉప సర్పంచ్ పొన్నం, తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆకస్మిక తనిఖీ

కలెక్టర్ అభిలాష అభినవ్



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం నిర్మల్ గ్రామీణ మండలం ముజ్గి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్నీ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బయోమెట్రిక్ హాజరు, ఇన్ పెషేంట్ వార్డు, ఆయుష్ క్లినిక్, డ్రగ్స్ స్టోరూం లను సందర్శించి, రిజిస్టర్లను పరిశీలించారు. అందిస్తున్న వైద్య సేవలు, రోగులకు లభిస్తున్న సదుపాయాలపై వైద్యులకు, సిబ్బందికి పలు సూచనలు చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరగైన వైద్య చికిత్సలు అందించాలని ఆదేశించారు. వైద్యం కోసం వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు కల్పించాలని, ఆసుపత్రుల్లో సరిపడివనన్ని బెడ్లు, మందులు, ఇతర వైద్య పరికరాలు అందుబాటులో ఉండాలని సూచించారు. అందిస్తున్న వైద్యచికిత్సలు,మందులను రోజువారీగా రిజిస్టర్ లలో నమోదు చేయాలన్నారు.వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా సమయ పాలనను పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆసుపత్రిలో నిరంతరం పరిశుభ్రతను పాటించాలని, ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అనంతరం చికిత్స కోసం వచ్చిన రోగులతో కలెక్టర్ మాట్లాడుతూ, ఆసుపత్రిలోని సౌకర్యాలు, అందిస్తున్న చికిత్సల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ రాజేందర్, శ్రీనివాస్, రవీందర్, తహసీల్దార్ సంతోష్, ఎంపిడిఓ గజానంద్, సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



ప్రజాపక్షం/సారంగాపూర్ : సారంగాపూర్ మండలంలోని కౌట్ల బి శాంతి నగర్ నుండి పెద్దమ్మ గుడి వరకు 30 లక్షల తో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగింది.మండల బిజెపి నాయకులు సాదు రామ్ రెడ్డి సత్యపాల్ రెడ్డి మాట్లాడుతూ రోడ్డు అభివృద్ధి గ్రామ ప్రజలకు అనేక ప్రయోజనాలు అందించనున్నదని రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల బిజెపి నాయకులు రాజారెడ్డి,వంగ దయాకర్ రెడ్డి,మంద నరసయ్య,భీమన్న,పున్న సాయందర్ ఆడే ప్రభాకర్,రవి,గోవింద్ చిన్న రాజారెడ్డి,బుజ్జన్న కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూసార పరీక్ష కేంద్రం ప్రారంభం..

ప్రజాపక్షం/సోన్ : మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో రైతు నేస్తం భూసార పరీక్ష కేంద్రం శుక్రవారం ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు బొండ భోజన్న,కొండ రవి లు తెలిపారు.ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ న్యూవెల్మల్ గ్రామంలో ఉదయం 11 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయం ముందుగల షట్టర్ రూములో ప్రారంభిస్తామని,కేవలం 5 నిమిషాలలోనే భూసార పరీక్ష రిపోర్టు ఇవ్వడం జరుగుతుందని అన్నారు.ఈ గొప్ప సదవకాశాన్ని మండలంలోని అన్ని గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వ్యవసాయ సంస్థ సీఈవో మెండు శ్రీనివాస్,వ్యవసాయ అధికారులు,గ్రామ రైతులు హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

# ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిశీలన

ఎస్‌పి పరితోషి ఫంకజ్



ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి: పటాన్ చెరు ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ ఆకస్మికంగా గురువారం రోజు తనిఖి చేసారు. ఈసందర్భంగా పోలీసు స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను ,స్టేషన్,రికార్డులను తనిఖి చేశారు. అండర్ ఇన్వెస్టిగేషన్ లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి వర్టికల్ కు ఒక అధికారిని నియమించాలని యస్.హెచ్. ఓ కు సూచనలు చేశారు. ప్రతి రికార్డు అప్ టు డేట్ ఉండాలన్నారు. అధికారులు ,సిబ్బంది ప్రతి ఒక్కరు భాధ్యత యుతంగా విధులు నిర్వహించి జిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. పటాన్ చెరు హైదరాబాద్ పరివాహక ప్రాంతం కావున అధిక ట్రాఫిక్ రద్దీ అదిగమించడానికి ప్రధాన కూడళ్లలో ఫ్రీ లిఫ్ట్ ఏర్పాటు చేయడం ,సంబందిత అధికారులతో మాట్లాడి బోలార్డ్స్ వేయించడం ,విజిబుల్ పోలిసింగ్ వంటి కార్యక్రమాలు చేపటాలన్నారు. ట్రాఫిక్ ఎన్ఫోర్స్మెంట్ లో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లు నిర్వహించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని యస్.హెచ్. ఓ కు పలు సూచనలు చేశారు. ఈ విజిటింగ్‌లో ఎస్పీ అదనపు ఎస్పీ సంజీవరావ్, పటాన్ చెరు ,డియస్పీ రవీందర్ రెడ్డి, ఇన్స్పెక్టర్స్ వినాయక రెడ్డి, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్స్ లాలు నాయక్, పాల్గొన్నారు.

ఫోకస్

# వ్యవసాయం



## లాభదాయకం.. వ్యవసాయ వ్యాపారం..

అత్యంత పురాతనమైన వృత్తుల్లో ఒకటైన వ్యవసాయం కాలానుగుణంగా ఎన్నో మార్పులు చెందుతున్నప్పటికీ, ఒక దేశ ఆర్థిక వ్యవస్థలో దాని ప్రాధాన్యం ఎన్నడూ తగ్గలేదు. అయితే, గత కొన్ని సంవత్సరాలుగా వ్యవసాయ రంగం అనేకానేక సమస్యలు ఎదుర్కొంటున్నది. మన దేశంలోనూ ఇదే పరిస్థితి. వ్యవసాయాన్ని లాభసాటి వృత్తిగా మార్చుకోవాలంటే, దీని ఆధారంగా వ్యాపారాలు చేసుకోవడం అత్యవసరం. లాభదాయక వ్యవసాయ వ్యాపారాల్లో ముందుగా వ్యవసాయ క్షేత్రాలపై పెట్టుబడులు అత్యంత కీలకమైనవి. వ్యవసాయ క్షేత్రాలు అత్యంత ఫలవంతమైన వ్యవసాయ వ్యాపార ఆలోచనగా పేర్కోవచ్చు. సారవంతమైన భూమి, వ్యవసాయ పరికరాలు, విత్తనాలు, ఎరువులపై పెట్టుబడి పెట్టాలి. అప్పుడు, కూరగాయలు, పండ్లు మరియు ధాన్యాలు పండించవచ్చు. వాటిని స్థానిక హోల్ సేల్ మార్కెట్‌లలో అమ్మవచ్చు. ఇటీవల కాలంలో ప్రజలు ఆరోగ్యంపై ఎక్కువ శ్రద్ధ వహిస్తున్న కారణంగా, ఆర్గానిక్ లేదా సేంద్రియ వ్యవసాయానికి అవసరమైన ఎరువుల సరఫరా వ్యాపారం మంచిది. కృత్రిమ ఎరువుల స్థానంలో సేంద్రియ ఎరువుల వాడకం మంచిది. జంతువులు లేదా మొక్కల వ్యర్థాల నుంచి పొందిన ఎరువులను జీవ ఎరువులుగా పేర్కొంటారు. ఈ జీవ ఎరువులు అటు రైతులకు, ఇటు వ్యాపారులకు లాభం చేకూరుస్తాయి. ఇక, వ్యవసాయోత్పత్తులకు ఉన్న డిమాండ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. దేశీయంగానే విస్తృత మార్కెట్ ఉంది. ప్రపంచ వ్యాప్తంగా భారత వ్యవసాయోత్పత్తులకు డిమాండ్ ఎక్కువ. కాబట్టి, కూరగాయలు, పండ్లు, ధాన్యాలను పండించడమేగాక, విదేశాలకు కూడా ఎగుమతి చేయవచ్చు. అదే విధంగా, ఆన్‌లైన్ కిరాణా పోర్టల్ కూడా వ్యవసాయాధారిత మంచి వ్యాపారాల్లో ఒకటి.

దేశంలో పట్టణీకరణ వేగంగా పెరుగుతున్నది. టైర్ వన్, టైర్ టూ నగరాలు విస్తరిస్తున్నాయి. యువ జనాభా పండ్లు, తాజా కూరగాయలను కోరుకుంటున్నారు. చాలా మందికి మార్కెట్‌వెళ్లే సమయం ఉండక పోవడంతో, ఆన్‌లైన్ ఆర్డర్లు పెరుగుతున్నాయి. ఈ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని, ఆన్‌లైన్ కిరాణా పోర్టల్‌ను ప్రారంభిస్తే, మెరుగైన లాభాలు వస్తాయన్నది వాస్తవం. పండ్ల తోటలకు, కలపకు డిమాండ్ ఎక్కువ. ఈ దిశగా కూడా ఆలోచనలు చేయవచ్చు. శుభాశుభ కార్యాల్లో పూల వాడకం పెరిగింది. ఈ వ్యాపారం కోసం భారీ పెట్టుబడులు అవసరం లేదు. వ్యాపారం లాభదాయకంగా ఉండటానికి వివిధ రకాల పువ్వులను, ముఖ్యంగా అరుదైన వాటిని పెంచాలి. పూల వ్యాపారాన్ని పొడి పూల వ్యాపారంలోకి కూడా విభజించవచ్చు. ఆరబెట్టిన పూలను క్రాఫ్ట్ స్టోర్లకు విక్రయించవచ్చు. పూర్తిగా వ్యవసాయ అనుబంధంగా పేర్కోలేకపోయినప్పటికీ, తేనెటీగల పెంపకాన్ని చూడా చేపట్టవచ్చు. పలురకాల ఆరోగ్య ప్రయోజనాల రీత్యా మన దేశంలో తేనెకు విపరీతమైన డిమాండ్ ఉంది. మార్కెట్‌లో అమ్ముడవుతున్న అనేక ఆహార, సౌందర్య ఉత్పత్తులకు ఇది కీలకమైన ముడి పదార్థం. కాబట్టి, కొన్ని అత్యంత లాభదాయకమైన వ్యవసాయ వ్యాపార ఆలోచనల కోసం చూసేవారికి తేనెటీగల పెంపకం ఉత్తమ ఎంపిక. పాల వ్యాపారం గురించి కొత్తగా చెప్పాల్సిన అవసరం లేకపోయినప్పటికీ, వ్యవసాయ స్టార్టప్‌గా పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవడం కొత్త ట్రెండ్. పశువులు, వాటి సంరక్షణతోపాటు యంత్రాలపైన పెట్టుబడి అవసరమవుతుంది. పాలను రకరకాలుగా అమ్ముకోవచ్చు. లాభదాయకమైన వ్యవసాయ ప్రారంభ ఆలోచనల జాబితాలో ఔషధ మూలికల వ్యవసాయం కూడా చేరుతుంది. భారతదేశంలో ఆయుర్వేద చికిత్స అత్యంత పురాతనమైనది. నేటి ఆధునికతను రంగరించి, కొత్త విధానాలను రూపొందించుకోవడానికి వివిధ రకాల ఔషధ మూలికలు అవసరం. కాబట్టి ఈ రంగం లాభసాటిగా ఉంటుది. ఇలాంటి వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ వ్యాపారాలతో భారీ లాభాలను ఆర్జించవచ్చు.

### కస్టమర్ సేవలో శిక్షణ అవసరం..

రైతులు, గ్రామీణ ప్రజలకు కస్టమర్ సేవ, టూర్ నిర్వహణ, వసతిలో శిక్షణ లేకపోవడం వల్ల సందర్శకులను ఆకట్టుకోవం సవాలుగా మారింది. వ్యవసాయ టూరిజం అభివృద్ధి చెందాలంటే, ఈ అంశాలపై వారికి సరైన అవగాహన కల్పించాలి. అదే విధంగా, సరైన ప్రణాళిక లేకపోవడం కూడా సమస్యలకు కారణమవుతున్నది. ఇది వ్యవసాయం మరియు పర్యాటక రంగం మధ్య సమతుల్యతను మరింత దెబ్బతీస్తున్నది. దీనిపైన కూడా చర్యలు అవసరం. పర్యావరణ అనుకూల వసతి సౌకర్యాలను అభివృద్ధి చేయడానికి రైతులకు ఆర్థిక సహాయంతో స్థిరమైన, సరసమైన వ్యవసాయ బసలను ప్రోత్సహించాలి. భద్రతాపరమైన సమస్యలను పరిష్కరించడానికి అన్ని ఏర్పాట్లు నియమాలు, నిబంధనలకు అనుగుణంగా జరగాలి. వ్యవసాయ పర్యాటక రంగంలో ఆచరణాత్మక శిక్షణ అందించడానికి ప్రైవేటు పబ్లిక్ భాగస్వామ్యం (పిపిపి) కింద వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, వివిధ సంస్థలతో కలిసి సమష్టి చర్యలు చేపట్టడానికి ప్రభుత్వాలు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. రైతులు, యువతకు ఆతిథ్యం, కస్టమర్ సేవ, వ్యవసాయ నిర్వహణలో పర్యాటక మిత్రులుగా శిక్షణ ఇప్పించాలి. సామూహిక వ్యవసాయ పర్యాటక నిర్వహణ కోసం మౌలిక సదుపాయాలు, నైపుణ్య అభివృద్ధి కోసం పర్యాటక బోర్డులు ఏర్పడాలి. ఇందుకుగాను పెట్టుబడిదారులతోపాటు, స్వచ్ఛంద సంస్థలను కూడా భాగస్వాములు చేయాలి. గ్రామీణ పర్యాటకాన్ని అభివృద్ధి చేయడానికి, ప్రోత్సహించడానికి గ్రామసభలకు అధికారం ఇవ్వాలి. వారి ఆర్థిక కమిషన్ గ్రాంట్లను ఆయా కార్యక్రమాల విజయంతో అనుసంధానించడం ద్వారా పరోక్షంగా ప్రోత్సాహకాలు అందచేయాలి. ఇలాంటి చర్యలు చేపట్టినప్పుడు 'వ్యవసాయ పర్యాటకం' మన దేశంలో ఒక బలమైన వ్యవస్థగానూ, ఆర్థిక వనరుగానూ అభివృద్ధి చెందుతుంది.



## మన దేశంలో రుతుపవనాలు...



నైరుతి రుతుపవనాలు (జూన్–సెప్టెంబర్): వీటిని 'ముందుకు వస్తున్న రుతుపవనాలు' అని కూడా పిలుస్తారు. హిందూ మహాసముద్రం నుండి తేమతో కూడిన గాలులను తీసుకొస్తాయి. టిబెట్‌పై అల్పపీడనం, హిందూ మహాసముద్రంపై అధిక పీడనం కారణంగా భారత దేశంలోని చాలా ప్రాంతాలకు భారీ వర్షాలు అందిస్తాయి.
ఈశాన్య రుతుపవనాలు (అక్టోబర్–డిసెంబర్): దీనిని 'తిరోగమన రుతుపవనాలు' అని కూడా పిలుస్తారు. ఇది రుతుపవన ద్రోణిల దక్షిణం వైపు కదలిక, నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ఫలితంగా ఏర్పడుతుంది. ఈ రుతుపవనాలు ఆగ్నేయ భారతదేశానికి, ముఖ్యంగా తమిళనాడు, కోస్తా ఆంధ్రప్రదేశ్‌కు వర్షాన్ని తెస్తుంది.
భారత రుతుపవనాలను ప్రభావితం చేసే అంశాలు: వేసవిలో ఇంటర్ ట్రాపికల్ కన్వర్జెన్స్ జోన్ (ఐటిసిజెడ్) ఉత్తరానికి మారుతుంది. ఇది భారతదేశంపై అల్పపీడనాన్ని సృష్టిస్తుంది. టిబెటన్ పీఠభూమి తీవ్రంగా వేడెక్కుతుంది. ఉష్ణమండల తూర్పు జెట్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఈ కారకాలు కలిసి హిందూ మహాసముద్రం నుండి తేమతో కూడిన గాలులను ఆకర్షించి, నైరుతి రుతుపవనాలను ప్రేరేపిస్తాయి. కాగా, ఈశాన్య రుతుపవనాలతో సంబంధం కలిగిన ఉపఉష్ణమండల పశ్చిమ జెట్ ప్రవాహాలు కూడా రుతుపవనాల తీవ్రతను నియంత్రిస్తాయి. అదనంగా, సోమాలి జెట్ నైరుతి రుతుపవనాల గాలులను బలపరుస్తుంది.




వర్షాలకు కీలకం

## 'క్లౌడ్ బ్యాండ్'

రుతుపవనాల్లో వచ్చే వర్షాల తీరుతెన్నులు, ప్రభావస్థాయి 'క్లౌడ్ బ్యాండ్'లపై ఆధారపడి ఉంటుంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్) తాజా అధ్యయనం ప్రకారం రుతుపవనాల కదలిక, వర్షపాతాలను వాటి మేఘాల సమూహ పరిమాణం ప్రభావితం చేస్తాయి. సహజంగా రుతుపవన మేఘాలు చిన్నవిగా ఉంటాయి. అయితే, కొన్ని మేఘాలు ఒకటి నుంచి నాలుగు రెట్లు పెద్దవిగా ఉంటాయి. వీటినే క్లౌడ్ బ్యాండ్ లేదా మేఘాల సమూహంగా పేర్కొంటారు. ఈ క్లౌడ్ బ్యాండ్ ఎంత పెద్దదిగా ఉంటే, వర్షపాతం అంత విస్తారంగా ఉంటుంది. బలమైన భూమధ్యరేఖ క్లౌడ్ బ్యాండ్‌లు మాత్రమే ఉత్తరం వైపుకు కదులుతాయి. మన దేశంలో వర్షపాతాన్ని ప్రేరేపిస్తాయి. బలహీనమైన బ్యాండ్‌లు వర్షపాతాన్ని పెంచడంలో విఫలమవుతాయి. ఈ క్లౌడ్ బ్యాండ్‌ల పరిమాణం, బలం లేదా క్తిపై వర్షాలు ఆధరపడతాయని తాజా అధ్యయనం గుర్తించింది. బోరియల్ సమ్మర్ ఇంట్రాసీజనల్ ఆసిలేషన్ (బిఎస్ఐఎస్ఓ) భూమధ్యరేఖ నుండి భారత ఉపఖండానికి క్లౌడ్ బ్యాండ్‌లు తొలగినప్పుడు, రుతుపవనాల వర్షాలు, పొడి వాతావరణాలను ప్రభావితం చేస్తాయి. హిందూ మహాసముద్రంలోని భూమధ్యరేఖలో వాయుసముద్ర సంకర్షణలు తేమ పెరుగుదలకు, గాలి బలానికి కీలకం. బలమైన సంయోగం వాతావరణ తేమను పెంచుతుంది. రుతుపవనాలను తీవ్రతరం చేస్తుంది. కాగా, వెచ్చని వాతావరణం వల్ల నేపథ్య తేమ పెరుగుతుంది. మేఘావృతమైన వాతావరణ పరిస్థితులు నెలకొంటాయి. క్లౌడ్ బ్యాండ్స్‌లో మార్పులను దృష్టిలో ఉంచుకుంటే, మన దేశంతోపాటు పరిసర సముద్ర ప్రాంతాల్లోనూ వర్షపాతం 42 నుంచి 63 శాతం పెరుగుతుందని అంచనా. ఈ ఫలితాలు కాలానుగుణ, ఉపకాలిక రుతుపవనాల అంచనా నమూనాల సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఇలా వుంటే, జూన్ నుంచి సెప్టెంబర్ వరకూ, హిందూ మహాసముద్రం నుంచి పశ్చిమ పసిఫిక్ వరకూ ఉష్ణవ్యాప్తిని నడిపించే రుతుపవనాల నమూనాను బిఎస్ఐఎస్ఓగా పేర్కొంటారు. ఇదివర్షపాతం, గాలి నమూనాలు, సముద్ర అలలను ప్రభావితం చేసే రుతుపవనాల 'చురుకైన' (వర్షపు), 'విరామ' (పొడి) దశలను నియంత్రిస్తుంది. ఖచ్చితమైన బిఎస్ఐఎస్ఓ అంచనాలు తీరప్రాంత నిర్వహణ, వాతావరణ అంచనాలో సహాయపడతాయి. ఎల్ నినో సదరన్ ఆసిలేషన్ (ఇఎన్ఎస్ఓ) ద్వారా దీని బలం, కదలికలు నియంత్రించబడతాయి. లా నినా ఉత్తరం వైపు వ్యాప్తిని పెంచుతుంది. ఎల్ నినో దానిని బలహీనపరుస్తుంది. రుతుపవనాలను ఆంగ్లండ్‌లో మాన్‌సూన్స్ అంటారు. ఇది అరబిక్ పదం 'మౌసమ్' అనే పదం నుంచి ఉద్భవించింది. మౌసమ్ అంటే కాలమని అర్థం.

---

## మే 20న దేశవ్యాప్తంగా కార్మికుల సమ్మె




**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** దేశవ్యాప్తంగా కార్మిక హక్కులను కార్పొరేట్ శక్తులు కొల్లగొడుతున్నాయని, కార్మిక చట్టాల సవరణకు బిజెపి ప్రభుత్వం వత్తాసు పలుకుతూ కార్మిక వర్గానికి అన్యాయం చేస్తోందని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజు అన్నారు. గురువారం శ్రీరాంపూర్‌లో నిర్వహించిన మంచిర్యాల జిల్లా సివిల్ సప్లై, హమాలీ యూనియన్ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్ లుగా విభజించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఏప్రిల్ 1 నుండి అమలుకు సిద్ధమైన ఈ చట్టాలను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు మే 20న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, ఉపాధ్యక్షులు మిట్టపల్లి పౌలు, సివిల్ సప్లై హమాలీ కార్మికులు పానుగంటి సత్యనారాయణ, తిప్పని సత్తయ్య, పోరాండ్ల సంపత్, నరేష్, రాజన్న, మామిడి చంద్రయ్య పాల్గొన్నారు.

## భారత కమ్యూనిస్టు పార్టీలో ప్రజలు భాగస్వామ్యం కావాలి




**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** స్వతంత్ర ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొని ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొని, ప్రజా సమస్యల పైన రాజీలేని పోరాటాలు నిర్వహిస్తూ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుని సజీవంగా ప్రజల్లో ఉన్నటువంటి పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని, అధికారం ఉన్నా లేకపోయినా అనేక పోరాటాలు నిర్వహించినటువంటి భారత కమ్యూనిస్టు పార్టీలో ప్రజలు భాగస్వామ్యం కావాలని సిపిఐ యాదాద్రి జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ విజ్ఞప్తి చేశారు. గురువారం యాదగిరిగుట్ట మండలంలోని చిన్న కందుకూరు గ్రామంలో సిపిఐ గ్రామ శాఖ మహాసభ శాఖ కార్యదర్శి కాటం శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నిర్మాణంలో భాగంగా గ్రామ శాఖ మహాసభలు,మండల మహాసభలు, రాష్ట్ర, జాతీయ మహాసభలు, జరగబోతున్నటువంటి సందర్భంగా గ్రామ సభలు నిర్వహించుకుంటున్నామని తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ అధికారం ఉన్నా లేకపోయినా కార్మిక, కర్షక విద్యార్థి, ఉద్యోగ, నిరుద్యోగ సంస్థల సమస్యలపైన అనేక పోరాటాలు నిర్వహించినటువంటి చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీకి ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ సభ అనంతరం గ్రామ శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు గ్రామ శాఖ కార్యదర్శులుగా రేఖ సాగర్, నమిల సంజీవతో పాటు 13 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు బబ్బూరి శ్రీధర్, సిపిఐ మండల కార్యదర్శి కల్లెపల్లి మహేందర్, మండల సహాయ కార్యదర్శి పెరబోయిన మహేందర్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు గోరేటి రాములు, మండల కార్యవర్గ సభ్యులు సబ్బూరి నరసయ్య, రేఖల స్వామి, కాటం శ్రీశైలం అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ వర్గాలకు కాసులు... కార్మిక వర్గానికి కన్నీళ్లా?

మహబూబ్‌నగర్ జిల్లా సిపిఐ కార్యదర్శి బి.బాలకిషన్



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** దళారి గుత్త పెట్టుబడిదారులకు కార్పొరేట్ వర్గాలకు కాసులు కురిపిస్తూ కోట్లాది అసంఘటిత రంగం కార్మిక వర్గానికి కన్నీళ్లు మోదీ పాలన విధానామా అని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ ప్రశ్నించారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం పి.సురేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో బి.బాలకిషన్ మాట్లాడుతూ నరేంద్ర మోదీ పది సంవత్సరాల పాలనలో కార్మిక వర్గ సంక్షేమం దివాలా తీసిందని ఆరోపించారు. అనేక పోరాటాలు చేసి సాధించుకున్న పటిష్టమైన కార్మిక చట్టాలను సవరణలు చేస్తూ కార్పొరేట్ ప్రైవేట్ యాజమాన్యాలకు అనుకూలంగా మారుస్తూ 44 కార్మిక హక్కులను నాలుగు కోడ్‌లుగా తీసుకొచ్చారని దీని ఫలితంగా కార్మిక వర్గం ఉనికి ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక శాఖ కార్యాలయాలు దిష్టిబొమ్మలుగా మారిపోయాయని కార్మిక శాఖ అధికారులు ఎలాంటి అధికారాల లేని షోకేసులో బొమ్మల వలె పాలకులు మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో పని భద్రత లేకుండా కనీస వేతనాలు అములు కాక శ్రమజీవులు శ్రమదోపిడికి గురవుతున్నారని అన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. కార్మిక వర్గం నిరంతరం హక్కుల సాధనకై రణం బాట నడుస్తూనే ఉండాలని పిలుపునిచ్చారు. ఎఐటియుసి సంఘాన్ని అన్ని రంగాల్లో విస్తరింపచేసి కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమ కార్యాచరణ ప్రకటించి ఐక్య పోరాటాలు నడపాలన్నారు. ఈ సమావేశంలో ఎఐటియుసి జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి పి.సురేష్, ఎఐటియుసి జిల్లా నాయకులు కోటకదిర నరసింహ, భాగ్యకృష్ణ యాదవ్, అమరజ్యోతి, శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సత్యనారాయణరెడ్డి, చాంద్‌భాషా, శంకర్, చెన్నయ్య, దేవానంద్, మొగులన్న, రంగన్న, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక సంక్షేమ బోర్డు పరిరక్షణకు ఉద్యమించాలి

భవన నిర్మాణ కార్మిక సంఘం మండల సమావేశంలో పల్లా దేవేందర్ రెడ్డి




**ప్రజాపక్షం/ నాంపల్లి :** భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పరిరక్షణ కోసం కార్మికులు అంతా కలిసి ఉద్యమించాలని ఎఐటియుసి భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా దేవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం మండల సమావేశంలో అయన మాట్లాడారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న సంక్షేమ బోర్డు ఈరోజు సమస్యల నిలయముగా మారిందని ఆరోపించారు. కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ఎఐటియుసి నిరంతరం అండగా నిలిచి పోరాడుతుందని అన్నారు. గత కొన్ని నెలలుగా కార్మికులకు డబ్బులు ఇవ్వడం లేదని ఆన్‌లైన్‌లో తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పరిష్కరించడంలో లేబర్ డిపార్ట్మెంట్ వైఫల్యం చెందిందని ఆన్‌లైన్ అప్డేట్ పేరుతో కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. కార్మికులు రోజుల తరబడి లేబర్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 28 చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని నిజమైన కార్మికులు లబ్ధి పొందే విధంగా లేబర్ డిపార్ట్మెంట్ వారు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈనెల 12వ తేదీన నల్లగొండలో జరిగే జిల్లా మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి సుదనబోయిన రమేష్, భవనా నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి నేతల్ల అగ్గిరాజు, ఏం లక్ష్మి నరసయ్య ,శ్రీనివాసులు, శామ్యూల్, శంకర్, ఆర్ ముత్యాలు ఊరుపక్క వెంకటయ్య, బి ప్రశాంత్ రూక్కయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## తక్షణం విద్యా హక్కు చట్టం అమలు

ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ డిమాండ్

**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్రంలో విద్యా సంవత్సరం పూర్తి కాకుండానే ప్రైవేట్ కార్పొరేట్ స్కూల్స్, ఇంటర్మీడియట్ కళాశాలలు 2025–26 విద్యా సంవత్సరానికి ముందస్తు అడ్మిషన్ నిర్వహిస్తున్న అధికారులు మాత్రం మొద్దు నిద్ర వీడటం లేదని ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ అన్నారు. గురువారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ఎఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మ ణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కొన్ని ప్రైవేటు కార్పొరేట్ స్కూల్స్, కళాశాలల్లో అప్పుడే అడ్మిషన్లు పూర్తైనట్లు ప్రైవేటు కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు చెప్పడం బాధాకరమన్నారు. ముందస్తుగా చేరితే అడ్మిషన్ ఫీజులో రాయితీ అంటూ తల్లిదండ్రులను బురిటి కొట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రకరకాల పేర్లతో ప్రైవేటు విద్యా సంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తూ అడ్మిషన్ల పేరుతో ప్రత్యేక దస్త్రాలు నిర్వహిస్తున్న అధికార యంత్రాంగం ఆవైపు కనెత్తి చూడటం లేదన్నారు. చెబుతున్న ఫీజు ఒకటి, వసూలు చేసే ఫీజు మరో విధంగా ఉందని రామకృష్ణ ఆరోపించారు. ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని అవసరమైతే అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖాధికారులు మొద్దునిద్ర వీడి ఇప్పటికైనా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఎఐఎస్ఎఫ్ పక్షాన ఆందోళనలు నిర్వహిస్తామని రామకృష్ణ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు మనోజ్, గోపి, ప్రతాప్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



## హెచ్‌పిసిఎల్ డ్రైవర్‌లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలి

సూర్యాపేట జిల్లా సిపిఐ కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు డిమాండ్

**ప్రజాపక్షం/సూర్యాపేట :** ఇటీవల ఎఐటియుసి అనుబంధ హెచ్‌పిసిఎల్ డ్రైవర్స్ వర్కర్స్ వేతనాలు పెంచాలని కోరుతూ సమ్మె చేసిన కారణంతో విధుల నుండి తొలగించిన 14 మంది డ్రైవర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ ధర్మభిక్షం భవన్‌లో ఎఐటియుసి ప్రాంతీయ గౌరవ సలహాదారులు చామల అశోక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంత కాలంగా కార్మికులు, యాజమాన్యం మధ్య సంప్రదింపులు జరగకపోవడం యూనియన్ రేట్లు పెరగకుండా కార్మికులు హక్కులను హరించే విధంగా తొలగించడం అన్యాయమన్నారు. డ్రైవర్ల పట్ల కక్ష సాధింపు దోరణిని హెచ్‌పిసిఎల్ యాజమాన్యం వ్యవహరిస్తే ఎఐటియుసి ఆధ్వర్యంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. న్యాయం జరిగేంత వరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, బొమ్మగాని శ్రీనివాస్, దొరెపల్లి శంకర్, దంతాల రాంబాబు, నిమ్మల ప్రభాకర్, పెంద్రా కృష్ణ పాల్గొన్నారు.




### సిపిఐ పార్టీ నిరంతరం పేద ప్రజల పక్షాన పోరాడుతుంది

**కోదాడ (చిలుకూరు) :** భారత కమ్యూనిస్టు పార్టీ నిరంతరం పేద ప్రజల పక్షాన పోరాడుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం చిలుకూరు మండల కేంద్రంలోని దొడ్డా నర్సయ్య హాభవన్‌లో జరిగిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏప్రిల్ మొదటి తేదీన నారాయణపురం శాఖ మహాసభతో జిల్లాలో శాఖ మహాసభలు ప్రారంభం కానున్నాయని, ఏప్రిల్ చివరి తేదీన శాఖ మహాసభలు పూర్తి చేసుకోవాలని ఈ మహాసభలు ఉత్సాహ వాతావరణంలో కార్యకర్తలు జరుపుకొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే అసెంబ్లీలో సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంభశివ రావు ప్రజల సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీలో అనేక సమస్యలు ప్రభుత్వం దృష్టికి తెస్తున్నారని, పెద్దల సభలో ప్రజలపక్షాన మాట్లాడటానికి నెల్లికంటి సత్యంని సిపిఐ పార్టీ పక్షాన పంపించిదని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికకు సహకరించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,జిల్లా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా శాసనసభ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, సాహెబ్‌బెల్లి, కె.వెంకటయ్య, రెమిడాల రాజు, పిల్లుట్ల కనకమ్మ, దొడ్డా నాగేశ్వరరావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## రేషన్ షాపులు పరిశీలించిన డిఎస్ఒ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రేషన్ షాపులను జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి కె.చందన్‌కుమార్ గురువారం పరిశీలించారు. ఖమ్మం నగరంలోని సారధినగర్‌లో రెండు రేషన్ దుకాణాలను, బొక్కలగడ్డలో ఉన్న రేషన్ దుకాణాన్ని ఆయన పరిశీలించారు. ఆయా దుకాణాల్లో స్టాక్‌ను పరిశీలించి రికార్డు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ ఒకటి నుంచి ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేయనుందని తెలిపారు. అన్ని రేషన్ దుకాణాలకు సన్న బియ్యాన్ని సరఫరా చేసినట్లు ఆయన తెలిపారు. ఏప్రిల్ ఒకటి నుంచి సన్న బియ్యం సరఫరాకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డిఎస్ఒ చందన్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డిటి విజయ్‌బాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యువతను విస్మరిస్తున్న పాలకులు

ఎఐవైఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రావణ్‌కుమార్




**ప్రజాపక్షం/కారేపల్లి :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనాభాలో సగభాగమున్న యువతను విస్మరిస్తున్నాయని అఖిల భారత యువజన సమాఖ్య ఆర్గనైజింగ్ కార్యదర్శి మద్దోజు శ్రావణ్‌కుమార్ ఆరోపించారు. మండల పరిధిలోని సీతారామపురంలో పునెం రామచంద్రు అధ్యక్షతన ఎఐవైఎఫ్ గ్రామ శాఖ మహాసభ జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మద్దోజు శ్రావణ్ మాట్లాడుతూ పాలకుల వైఖరి కారణంగా దేశంలో యువశక్తి నిర్వీర్యమవుతుందని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక యువత నైరాశ్యంలో ఉందన్నారు.యేటా రెండు కోట్ల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానన్న మోడీ కనీసం వెయ్యి ఉద్యోగాలు కూడా కల్పించకపోగా ఉన్న ఉద్యోగాలను తొలగిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుకు దారాదత్తం చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యువకులకు ఇచ్చిన హామీని పట్టించుకోవడం లేదని కేసిఆర్ మాటల మాదిరే కాంగ్రెస్ నిరుద్యోగ భృతి కూడా అటకెక్కిందని ఆయన తెలిపారు. ఉద్యోగ, ఉపాధి హక్కుల కోసం పోరాడాలని ఆయన కోరారు. సమావేశంలో సిపిఐ నాయకులు చిన్నంశెట్టి భూషయ్య, నాయకులు నరేష్, సాయి పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : ఎఐటియుసి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి సింగమనేని ప్రసాద్ అన్నారు. గురువారం ఐటిసి పిఎస్‌పిడి యూనిట్ భద్రాచలం పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న ఆర్థికపరమైన స్కిల్ మాట్రిక్స్ స్కిల్డ్, సెమిస్కిల్డ్ సమస్యలపై అర్హత కలిగిన కార్మికులు అందరికి ఎల్‌టిఏ రాసుకున్న విధంగా యాజమాన్యం ఇవ్వాలని ఏఐటియూసి ఆధ్వర్యంలో మెమొరాండం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్య పరిష్కారమయ్యేవంత వరకు దశల వారి పోరాటాలు వివిధ రూపాలలో, కాంట్రాక్ట్ కార్మికుల నిరసన కార్యక్రమాలు చేపడతామని కాంట్రాక్ట్ కార్మికుల తరపున యాజమాన్యంకు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటియూసి గౌరవ సలహాదారుడు తన్నీరు వెంకటేశ్వర్లు, స్వామి గౌడ్, ఏఐటియూసి కాంట్రాక్ట్ కార్మిక నాయకుల అధ్యక్షులు బల్లెం నాగయ్య, ప్రధాన కార్యదర్శి జెహిర్ పాషబూ, వర్కింగ్ ప్రెసిడెంట్ రాయల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## మల్టిపర్పస్ వేతన విధానాన్ని రద్దు చేయాలని వినతి



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** గ్రామపంచాయితీ కార్మికులకు గ్రీన్ చానల్ ద్వారా వేతనానలు చెల్లించి మల్టి పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని ఎఐటియుసి జిల్లా కోశాధికారి జి.పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఈసందర్భంగా గురువారం గ్రామపంచాయితీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ ఆధ్వర్యంలో మండల ఎంపిడిఓకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి రాగానే గ్రామ పంచాయితీ కార్మికులను పర్మినెంట్ చేస్తానని ఇచ్చిన హామీని విస్మరించి 15 నెలలు పూర్తిఅయిందని ఆవేదన వ్యక్తం చేసారు. వారికి కనీస వేతనం రూ.26 వేలు ప్రకటించాలని వారు కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి నరేష్ , అధ్యక్షుడు వెంకటేష్ భవాని తదితరులు పాల్గొన్నారు.

## మృతిచెందిన బిల్డింగ్ వర్కర్లకు రూ.50లక్షల నష్టపరిహారం ఇవ్వాలి



**ప్రజాపక్షం/జూలూరుపాడు :** భద్రాచలంలో బిల్డింగ్ కుప్పకూలి చనిపోయిన భవన నిర్మాణ కార్మికులకు రూ.50 లక్షల నష్టపరిహారం అందించాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) జిల్లా ఉపాధ్యక్షులు సిలివేరి నరసింహారావు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రమైన జూలూరుపాడులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భద్రాచలంలో కార్మికులు పనిచేస్తుండగా బిల్డింగ్ కుప్పకూలి మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు గుడిమెట్ల సీతయ్య, నరసింహారావు, సురేష్, వెంకటేష్, రమేష్ పాల్గొన్నారు.

## కుల గణన రెమ్యూనరేషన్ చెల్లించండి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కుల గణన సర్వేకు సంబంధించి రెమ్యూనరేషన్‌ను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని పిఆర్‌టియు రఘునాథపాలెం మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కేశవరావు, తుమాటి సైదుబాబు కోరారు. గురువారం పిఆర్‌టియు రఘునాథపాలెం మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే పూర్తి చేసి నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ప్రభుత్వం ప్రకటించిన రెమ్యూనరేషన్ అందించకపోవడం బాధాకరమన్నారు. ఎన్నడులేనివిధంగా ఏకంగా ఐదు డిఏలను పెండింగ్‌లో పెట్టడం సరికాదన్నారు. గతేడాది పదవ తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం పారితోషికం ఇప్పటి వరకు చెల్లించలేదన్నారు. వెంటనే రెమ్యూనరేషన్, పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సోమ్లానాయక్, సతీష్, ఎండి జబ్బార్, రంగారావు, తిరుపతిరావు, చందన, సురేష్, వెంకటకిషోర్, మహతి, కోటేశ్వరరావు, ఉపేందర్‌రెడ్డి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# భవన ప్రమాదంపై విచారణ

సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా డిమాండ్



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఆరంతస్తుల భవన కూలి అత్యంత విషాధకర సంఘటన చోటు చేసుకోవడం దురదృష్టమని, ఈప్రమాదంపై ప్రభుత్వం తగిన విచారణ జరిపించి కారకులపై తగిన చర్యలు తీసుకుని, ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా డిమాండ్ చేశారు. భద్రాచలం పట్టణంలోని బోనాలవారి వీధిలో నిర్మాణంలో ఉన్న ఆరు అంతస్తుల భవనం కుప్పకూలిన ప్రదేశాన్ని గురువారం సిపిఐ ప్రతినిధి బృంధం పరిశీలించింది, బాధిత కుటుంబాల వారిని పరామర్శించి ఓదార్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా ఇంత పెద్ద భవనం నిర్మాణమవుతుంటే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా ఉండటం సరైంది కాదన్నారు. నిర్మాణానికి అనుమతి ఇచ్చింది ఎవరని, నాణ్యతా ప్రమాణాలు పాటించారా లేదా అని చూసింది ఎవరో చెప్పాలన్నారు. నిర్మాణానికి సంబంధించి అధికారులు నోటీసులు అందించినప్పటికీ సదరు నిర్మాణ దారుడు లెక్కచేయకుండా పనులు చేసుకుంటూ పోతుంటూ అధికారులు ఏం చేశారని ప్రశ్నించారు. ఈసంఘటనపై ప్రభుత్వ సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. శిధిలాల కింద మృతిచెందిన కార్మిక కుటుంబాలకు రూ.50లక్షల నష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని, భవన నిర్మాణదారుడి నుంచి కూడా పరిహారం ఇప్పించాలన్నారు. కేసులు పెట్టి ఊరుకుంటే సరిపోదని, బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు సిపిఐ అండగా ఉంటుందన్నారు. అనంతరం సంఘటనా స్థలంలో ఎఎస్‌పి విక్రాంత్ కుమార్ సింగ్‌తో పాషా మాట్లాడారు. బాధిత కుటుంబాలను ఆదుకునే విధంగా ప్రభుత్వానికి నివేదికలు పంపించాలని, ప్రమాదానికి కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు రావులపల్లి రవికుమార్, కంచర్ల జమలయ్య, భూక్యాశ్రీను, ఎస్‌విఎస్ నాయుడు, మారెడ్డి శివాజీ, ఏపూరి వెంకటేశ్వరరావు, కంభంమెట్టు శ్రీనివాస్, రామారావు, శోభన్, సాయిరామ్, సాయిశివ, మహేష్, సందీప్, ప్రశాంత్ పాల్గొన్నారు.

## సామాజిక తనిఖీలో బయటపడ్డ అవినీతి

పనిచేయకుండానే బిల్లులు.. మొక్కలు లేకుండానే రికార్డులు

**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** మండల పరిధిలో 23–24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీలో చేసిన పనులపై 16వ విడత సామాజిక తనిఖీ మండల కేంద్రంలో గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో జరిగింది. తనిఖీలో అడిషనల్ డిఆర్డిఏ పిడి సుంచు శ్రీనివాస్, ఎంపిడిఒ సిలార్ సహాబ్ ఆధ్వర్యంలో ఓపెన్ ఫారం నిర్వహించారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో జరిగిన పనుల్లో అవినీతి, అక్రమాలు జరిగాయని సామాజిక తనిఖీలో తేలింది. ఇష్టానుసారం పనులు నిర్వహించడం వలన జరిగిన పనులకు బిల్లు చెల్లించిన పనులకు పనులు చేయించలేదని తనిఖీ బృందం గుర్తించారు. మొక్కలు పెంచకుండా మొక్కలు పెంచినట్టు రికార్డులు సృష్టించారు. పలు గ్రామాల్లో ఉపాధి హామీ పనిలో చేసిన సీసీ రోడ్లు నర్సరీలు సైడ్ కాలువలు డొంక రహదారులు కాల్వమరుమతుల్లో పనులు చేసిన వారి కాకుండా చేయని వారికి బిల్లులు చెల్లించినట్లు గుర్తించారు. జరిగినా అవినీతినిపై కలెక్టర్ విచారణ జరిపించి ప్రజాధనాన్ని రికవరీ చేయాలని ప్రజలు కోరుతున్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ షేక్ సిలార్ సాహెబ్, అడిషనల్ డిఆర్డిఏ పిడి చుంచు శ్రీనివాసరావు, డివిఓ సక్రియనాయక్, డిసి వీరయ్య, అసిస్టెంట్ డివిఓ పవన్, ఏపీవో శ్రీదేవి రమేష్ బాబు, ఎస్ఆర్పి చారి పంచాయతీరాజ్ జేఈ ప్రఫుల్‌కుమార్ ఏపీవో నరసింహారావు, ఎస్.వెంకటయ్య, టీఏలు బాబు, ఈ.మనోహర్, ఆర్.మోహన్, బి.కళ్యాణ్, సురేష్, కే.వెంకటేశ్వర్లుపాల్గొన్నారు.




# సంస్థాగతంగా బలోపేతమే లక్ష్యం





సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్

**ప్రజాపక్షం/ఖమ్మం :** సంస్థాగతంగా పార్టీ బలోపేతమే లక్ష్యంగా కార్యకర్తలు కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ పిలుపునిచ్చారు. గురువారం ఖమ్మం రూరల్ మండలం పెద్ద తండ, నాయుడుపేట, జలగంనగర్ సిపిఐ శాఖ మహాసభలు బానోత్ దేవా, రావుల శ్రీను, రావూరి రామచంద్రయ్య అధ్యక్ష వర్గంగా జరిగాయి. మహాసభకు ముందు పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకులు బానోత్ చందానాయక్ ఆవిష్కరించారు. సభలో దండి సురేష్ మాట్లాడుతూ ఇది మహాసభల సంవత్సరమని గ్రామశాఖ నుంచి జాతీయ స్థాయి వరకు మహాసభలు నిర్వహించుకుని నూతన నాయకత్వాన్ని ఎన్నుకోవడంతో పాటు పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా మాట్లాడుతూ నేటి యువతను మతం మత్తులో ఉంచాలని బిజెపి ప్రయత్నిస్తుందని మెజార్టీ, మైనార్టీ ప్రాతిపదికన మతం అడ్డుగా తన కుటిల యత్నాలను సాగిస్తుందన్నారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసిన బిజెపి కార్పొరేట్ శక్తులకు మాత్రం కోట్ల రూపాయల రాయితీలను ప్రకటిస్తుందని ఆరోపించారు. రుణమాఫీ, రైతు భరోసా విషయంలో రాష్ట్ర ప్రభుత్వ విధానం సరైంది కాదన్నారు. రెండు లక్షల పైబడిన రైతులకు కూడా రుణమాఫీ చేయాలని మౌలానా డిమాండ్ చేశారు. హామీలన్నీ అమలు చేయాలని కోరారు. సభలో గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు అజ్మీర రామ్మూర్తి, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, నాయకులు పాల్తియా శ్రీను, సురేందర్, దండి రంగారావు, గడ్డా నాయక్, బద్యా నాయక్ పాల్గొన్నారు. పెద్దతండ శాఖ కార్యదర్శిగా బానోత్ దేవా, సహాయకార్యదర్శులుగా గుగులోత్ కిరణ్, మూడు శ్రీను, భూక్యా రవి, నాయుడుపేట కార్యదర్శిగా రావుల శ్రీను, సహాయ కార్యదర్శిగా మలిశెట్టి శ్రీనివాస్, రాజు ఎన్నికయ్యారు.

## అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వమే న్యాయం చేయాలి : సిపిఐ




**ప్రజాపక్షం/ఖమ్మం :** అగ్రిగోల్డ్ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వమే న్యాయం చేయాలని రాష్ట్ర అగ్రిగోల్డ్ బాధితుల సంఘం నాయకులు యర్రాబాబు, తాటి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ బాధితుల కమిటీ సమావేశం గురువారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గుడిమెట్ల రజిత అధ్యక్షతన జరిగింది. సమావేశంలో తాటి వెంకటేశ్వర్లు, యర్రాబాబు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరిగే వరకు సిపిఐ అండగా ఉంటుందన్నారు. 1995లో ప్రారంభించిన అగ్రిగోల్డ్ కంపెనీలో డిపాజిట్ చేస్తే ఎక్కువ లాభాలు ఉంటాయని నమ్మించారన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో దాదాపు రూ.5 వేల కోట్లు వసూలు చేసి ప్రజల సొమ్ముతో పలు కంపెనీలు ప్రారంభించారని, స్థలాలు కొన్నారని, రిసార్ట్స్ నిర్మించారని తెలిపారు. 2015లో డిపాజిట్‌దారులకు నగదు తిరిగి ఇవ్వాల్సి వచ్చినప్పుడు అగ్రిగోల్డ్ కంపెనీ చేతులేత్తేసిందన్నారు. బాధితులు ఆందోళన చేయడంతో కంపెనీకి సంబంధించిన బాధ్యులను అరెస్టు చేసి ప్రభుత్వాలు చేతులు దులుపుకున్నాయని ఆరోపించారు. అగ్రిగోల్డ్ కంపెనీలో డిపాజిట్ చేసిన తెలంగాణ ప్రజల సొమ్ము రూ.500 కోట్లు ఉంటుందని అగ్రిగోల్డ్ ఆస్తులు అమ్మి బాధితులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. గతంలో ముఖ్యమంత్రిని కలిసినప్పుడు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని దానిని నిలబెట్టుకోవాలని కోరారు. సమావేశంలో గోగుల వెంకటేశ్వర్లు, మేకల శ్రీనివాసరావు, ఇటికాల రామకృష్ణ, ఎన్. సునీత, వీరబ్రహ్మాచారి, ఎస్‌డి పాషా, లక్ష్మి నారాయణ, సతీష్, రాజు, కృష్ణయ్య, లక్ష్మి , అనసూర్య, రమాదేవి, సురేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

## మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోళ్లు : సిపిఐ డిమాండ్



**ప్రజాపక్షం/బోనకల్ :** మార్క్‌ఫెడ్ ద్వారా మొక్క జొన్నలను కొనుగోలు చేయాలని, మొక్కజొన్నలకు గిట్టుబాటు ధర కల్పించాలని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ముష్టికుంట గ్రామంలో ఎఐకెఎస్ మండల అధ్యక్షులు కొంగర భాస్కర్‌రావుతో కలిసి కల్లాల్లో ఆరబోసిన మొక్కజొన్నలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ ఇప్పటికే మిర్చికి గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సన్న వడ్లకు ఇప్పటికీ ప్రభుత్వం బోనస్ ఇవ్వలేదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు దృష్టి సారించాలన్నారు. మద్దతు ధర ఇచ్చి మొక్కజొన్న పంటను కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు, జయరాజు, రామారావు, సత్యం, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్ల నిర్వహణ

భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్




**ప్రజాపక్షం/భద్రాచలం :** యాసంగి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడిఓసిలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. 184502 మెట్రిక్ టన్నులు కాగా అందులో సన్న రకాలు 99729 మెట్రిక్ టన్నులు, దొడ్డు రకాలు 144 మెట్రిక్ టన్నులు ధాన్యం వస్తుందనే అంచనాలు ఉన్నాయని, ఇందు కోసం 144 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఏ గ్రేడ్ రకం క్వింటా రూ.2320,బి గ్రేడ్‌కు రూ.2300 మద్దతు ధర నిర్ణయించినట్లు చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎవ్వరూ వడదెబ్బకు గురికాకుండా చలువ పందిళ్లు, టెంట్లు, మంచినీటి సదుపాయాన్ని కల్పించాలన్నారు. క్రాప్ బుకింగ్ చేసిన ప్రకారం రైతులకు టోకెన్లు జారీ చేయడం ద్వారా రద్దీ తగ్గుతుందన్నారు. జిల్లా సమీప రాష్ట్రాల నుండి ధాన్యం తరలివచ్చే అవకాశం ఉన్నందున సరిహద్దుల్లో మొత్తం 8 చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఏరోజుకారోజు ఆన్‌లైన్ చేసి మిల్లులకు తరలించాలన్నారు. తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సెంటర్ ఇంచార్జ్, మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని, సంబంధిత అధికారులంతా వారి వారి విధులు తప్పకుండా నిర్వహించాలని, ఎలాంటి లోపాలు తలెత్తినా తనకు ఫిర్యాదు చేయాలని చెప్పారు. అనంతరం పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ త్రినాధ్, రుక్మిణి, వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులు, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

### రాజీవ్ యువ వికాసాన్ని సద్వినియోగం చేసుకోండి

జిల్లాలోని ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, ఈబిసి, ఈడబ్ల్యూఎస్ నిరుద్యోగులు రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఆర్థికాభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఆర్థికంగా స్థిరపడవచ్చున్నారు. 21 సం. నుండి 55 సం.ల వారి వరకు ఈ పథకానికి అర్హులని, దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

# ఆర్‌టిసి కార్మికుల సేవలు ప్రశంసనీయం

జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్






**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజల జీవన వ్యవస్థ సజావుగా జరిగేందుకు కృషి చేస్తున్న ఆర్‌టిసి కార్మికుల సేవలు ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కొనియాడారు. గురువారం ఖమ్మం బస్సు డిపోలో ఆర్‌టిసి సిబ్బందికి కలెక్టర్ వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు సేవలు అందించే విభాగంలో ఆర్‌టిసి సేవలు ముఖ్యమని, ఆర్‌టిసి కార్మికుల కృషి ఫలితంగా విద్యార్థులకు, మహిళలకు, ప్రజలకు మెరుగైన రవాణా సేవలు అందుతున్నాయని ఈ సందర్భంగా వారికి ధన్యవాదాలు తెలిపారు. డ్రైవర్లు, కండక్టర్లు కష్టపడి పని చేస్తున్నారని ప్రస్తుత వేసవి కాలంలో వారికి ఉపయోగపడేవిధంగా జిల్లా యంత్రాంగం తరుపున 650 వాటర్ బాటిల్స్ పంపిణీ చేస్తున్నామన్నారు. ఆర్‌టిసి కార్మికుల పిల్లల చదువులు, డిపోలో ఇతర సౌకర్యాలు, ఇబ్బందులను తమ పరిధి మేరకు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. సమాజంలో మనం ఎంత బాగా పని చేసినా గుర్తింపు రాదని, మనం లేని సమయంలో ఆ లోటు బాగా తెలుస్తుందన్నారు. అటువంటి విభాగాల్లో ఆర్‌టిసి ఒకటన్నారు. కార్మికులకు ఉన్న సమస్యలను డిపో మేనేజర్‌కు అందించాలని జిల్లా పరిధిలో పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్మికులందరికీ ఫైనాన్షియల్ ప్లానింగ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్‌ను ప్రత్యేకంగా పంపి శిక్షణా తరగతుల ఏర్పాటుకు సహకారం అందిస్తామన్నారు. మహిళా కండక్టర్లు, సిబ్బందికి మార్గ మధ్యలో ఉన్న అవసరం ఉన్నచోట పెట్రోల్ బంక్‌లలో మరుగుదొడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఆపరేషన్స్, మెకానికల్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ మల్లయ్య, డిపో మేనేజర్ దినేష్‌కుమార్, డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### వ్యాపార విస్తరణ దిశగా ప్రణాళికాబద్ధంగా అడుగులు వేయాలి

వ్యాపార విస్తరణ దిశగా ప్రణాళికాబద్ధంగా అడుగులు వేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. గురువారం ఖమ్మం నగరం బుర్హాన్‌పురం పాత డిఆర్‌డిఒ ఆఫీస్ పక్కన ఏర్పాటు చేసిన విజయ డెయిరీ పార్లర్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతనంగా విజయ డెయిరీ పార్లర్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు నాణ్యమైన పాల పదార్థాలు విక్రయిస్తూ మంచి లాభాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. మధిరలో ఇందిరా మహిళా డెయిరీ ఏర్పాటు చేశామని విజయ డెయిరీతో సమన్వయం చేసుకుంటూ పాడి రైతుల నుంచి పాల సేకరణ చేసి సరఫరా చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. వేసవి కాలం దృష్ట్యా వ్యాపారాభివృద్ధికి అవకాశాలు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. పాల ఉత్పత్తులతో అధిక లాభాలు వస్తాయని ఆ దిశగా ఆలోచనలు చేయాలని కలెక్టర్ నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో విజయ డెయిరీ డిడి మోహన్ మురళి, డిస్ట్రిబ్యూటర్లు నరేష్, జగదీష్, విజయ డెయిరీ పార్లర్ నిర్వాహకులు మదార్ తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## సబ్సిడీ యంత్రాలు సద్వినియోగం

**ప్రజాపక్షం/ నర్సంపేట :** సబ్సిడీ యంత్రాలను రైతులను సద్వినియోగం చేసుకోవాలని నర్సంపేట డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు దామోదర్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణ పథకం 2024–25( ఎస్ఎంఎఎం)లో భాగముగా నర్సంపేట డివిజన్‌కు రాయితీపైన యంత్ర పరికరాలు కేటాయించడం జరిగిందన్నారు. లక్ష రూపాయల లోపు ఉన్న పనిముట్లను మండల స్థాయి కమిటీ, లక్ష రూపాయలకు పైగా ధర ఉన్న పనిముట్లను జిల్లా స్థాయి కమిటీ ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. వ్యవసాయం చేస్తున్న మహిళా రైతులు మాత్రమే ఈ పథకానికి అర్హులన్నారు. పనిముట్లు కావాల్సిన మహిళా రైతులు దరఖాస్తు, పాస్పోర్ట్ సైజ్ ఫోటో, ఆధార్ కార్డు జిరాక్స్, రైతు వాటా డీడీ, తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన మహిళల పేరుతో ఉన్న పట్టాదారు పాసుబుక్ (రెవెన్యూ, అటవీ హక్కుల పాస్ బుక్) లతో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని ఈనెల 28 లోపు సంప్రదించాలన్నారు.



## మంత్రివర్గ విస్తరణలో ముగ్గురు బిసిలకు అవకాశం కల్పించాలి

**ప్రజాపక్షం / హనుమకొండ టౌన్ :** విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం వాటా కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రివర్గ విస్తరణలో కూడా 42 శాతం వర్తింపచేయాలని బిసి సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించినట్లుగానే..మంత్రివర్గ విస్తరణలో సైతం బీసీల జనాభా ప్రాతిపదికన మంత్రి పదవులను కేటాయించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణనలో బీసీలు 56 శాతం ఉంటే..బీసీలకు గత మంత్రివర్గ విస్తరణలో ఇద్దరికి మాత్రమే అవకాశం కల్పించి, 5 శాతం ఉన్న రెడ్లకు మాత్రం నలుగురికి అవకాశం కల్పించారన్నారు. ప్రస్తుతం చేపట్టబోయే నాలుగు మంత్రివర్గ విస్తరణలో మళ్లీ రెడ్లకు రెండు, బీసీలకు కేవలం ఒక్కటి మాత్రమే కేటాయిస్తామని లీకులు ఇవ్వడం ఎంత వరకు సమంజసమని వేణుగోపాల్ గౌడ్ ప్రశ్నించారు. త్వరలో చేపట్టబోయే మంత్రివర్గ విస్తరణలో బీసీలకు ముగ్గురికి అవకాశం కల్పించి బీసీల పైన చిత్తశుద్ధి నిరూపించుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు.

## డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ ప్రారంభం



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో చేరడానికి కళాశాల రూపొందించిన 25–26 సంవత్సరానికి అడ్మిషన్ కరపత్రాన్ని జిల్లా కలెక్టర్ శ్రీ టీఎస్ దివాకర ఆవిష్కరించారు. కళాశాలలో అడ్మిషన్లు పెంచడానికి కళాశాల అందిస్తున్న సౌకర్యాలను, గత సంవత్సరము కళాశాల విద్యార్థులు వివిధ ఉన్నత విద్య పోటీ పరీక్షల్లో సాధించిన విజయాలతో రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొప్పుల మల్లేశం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి.బాలయ్య, న్యాకు కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ కవిత, కళాశాల అడ్మిషన్ కై దోస్త్ కన్వీనర్ డాక్టర్ జె.శంకర్ దోస్త్ కమిటీ సభ్యురాలు అధ్యాపకురాలు బి.శిరీష పాల్గొన్నారు. కళాశాల అడ్మిషన్లు పెంచడానికి అందరం సమిష్టిగా కృషి చేస్తామని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

## మౌలిక సదుపాయాలు కల్పించాలి



**ప్రజాపక్షం/ నర్సంపేట :** అంబేద్కర్ కాలనీ వాసులకు మౌలిక సదుపాయాలుకల్పించాలని సిపిఐ రాష్ట్ర కమిటి సభ్యులు పంజాల రమేష్అన్నారు. నర్సంపేట పట్టణంలోని పాత తహసీల్ కార్యాలయం ఆవరణలో అంబేద్కర్‌నగర్‌కు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి, డిబిఆర్పిఎస్ ఆధ్వర్యంలో దీక్షలు గురువారం నాటికి మూడవ రోజుకు చేరుకున్నాయి. నర్సంపేట ఆర్డివో ఉమారాణి చిత్రపటంతో దీక్షలో కాలనీవాసులు కూర్చున్నారు. ముఖ్యఅతిథి పంజాల రమేష్ మాట్లాడుతూ నర్సంపేట టౌన్‌లోని అంబేద్కర్ నగర్ గరీబోళ్ల బస్తి వాసులు గూడు లేని వాళ్ళు గుడిసెలు వేసుకొని జీవనం కొనసాగిస్తున్నారన్నారు. కరెంటు సౌకర్యం, ఇళ్లకు ఇంటి నెంబర్లు ఇవ్వాలని, నీళ్ల సౌకర్యం కల్పించాలని, పట్టాలివ్వాలని కోరారు. దళిత రత్న, ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రతినిధి మహాజన సోషలిస్టు పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు కల్లెపల్లి ప్రణయ్ దీప్, డిపిడిపిఎస్ ప్రజాదండోరావ్యవస్థాపక అధ్యక్షుడు అందే రవిమాది,జిల్లా అధ్యక్షుడు జలగం రమేష్, మాలతీ, లత, రవి, విమల, విజయ, సమ్మక్క, సర్వజన, విజయ, సుధారాణి, స్వరూప, నిర్మల, బూపమ్మ, వనజ, రామకృష్ణ, నాగలక్ష్మి , రాజు, రాజమణి, చక్రపాణి, వేణు, సుధాకర్, శ్రీకాంత్‌పాల్గొన్నారు.

## ఆస్తి పన్నుకు వన్‌టైమ్ సెటిల్మెంట్

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం 2024–25 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రంలోని అన్ని పట్టణ, స్థానిక సంస్థలకు ఆస్తి పన్నుపై 90శాతం బకాయి వడ్డీని మాఫీ చేసే వన్‌టైం సెటిల్‌మెంట్ పథకాన్ని విస్తరించిన నేపథ్యంలో ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని గురువారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. ఇప్పటికే ఆస్తి పన్నును వడ్డీ బకాయిలతో చెల్లించిన వారికి వచ్చే ఆర్థిక సంవత్సరానికి సర్దుబాటు చేయడం జరుగుతుందన్నారు. ఎల్ఆర్ఎస్‌పై 25శాతం రాయితీ ఉన్న రాయితీ కూడా మరో 4 రోజులలో ముగియనుందని కావున ఈ అవకాశాన్ని కూడా దరఖాస్తు దారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## అభివృద్ధి పనుల పరిశీలన

**ప్రజాపక్షం/కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం క్షేత్రంలో జరిగే సరస్వతీ పుష్కరాల అభివృద్ధి పనుల్లో భాగంగా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను గురువారం ఆలయ ఈఓ మహేష్, ఎస్ఈ దుర్గా ప్రసాద్,స్థపతి శ్రీ వల్లి నాయగం పరిశీలించారు. ప్రసాదం కౌంటర్ భవనం, కళ్యాణ మండపం షెడ్డు ఒక నిర్మాణం, పార్కింగ్ స్థలంలో సిసి ఫ్లోరింగ్, సూర్య ఆలయం ముందు సిసి ఫ్లోరింగ్, విఐపి ఘాటు వద్ద మండప నిర్మాణాలు, లైటింగ్ ఏర్పాట్లు, సరస్వతి విగ్రహం నిర్మాణ పనులు వివిధ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఈ రమేష్ బాబు, ఏఈలు చందర్, అశోక్, సిబ్బంది,కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## ఇద్దరిపై కేసు నమోదు

**ప్రజాపక్షం/కాళేశ్వరం:**మహాదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామ పంచాయతీ పరిధిలోని పూస్కుపల్లి 1 ఇసుక క్వారీలో ఇంచార్జిగా పనిచేస్తున్న సొల్లేటి నవీన్, సూపర్‌వైజర్ గజ్జి బక్కయ్య ఇద్దరు కలిసి గురువారం పూస్కుపల్లి1 క్వారీకి వచ్చిన ఇసుక లారీ డ్రైవర్ల వద్ద నుండి ఒక్కొక్కలారికి రూ.500 చొప్పున అక్రమంగా డబ్బులు వసూలు చేయడంతో ఇద్దరిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కాళేశ్వరం ఎస్ఐ తమాషారెడ్డి తెలిపారు.

## 29న నెక్కొండ సంత వేలం

**ప్రజాపక్షం/నెక్కొండ:** నెక్కొండ మండల కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహించే సంత వేలం ఈ నెల 29న నిర్వహిస్తున్నామని పంచాయతీ దయ్యాల సదానందం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికీ రెండు పర్యాయాలు సంత వేలం ప్రభుత్వం నిర్ణయించిన ధర రానందున వాయిదా పడిందని, మూడోసారి ఈనెల 29 న నిర్వహిస్తున్నామని, పంచాయతీ కార్యదర్శి నెక్కొండ గ్రామపంచాయతీ పేరున నాలుగున్నర లక్షల రూపాయలు డిడి తీయాలని ఆయన తెలిపారు.

# ధర్మసాగర్ రిజర్వాయర్‌కు గోదావరి జలాలు

### మంత్రులకు, ఎమ్మెల్యేలకు ఘన స్వాగతం



**ప్రజాపక్షం/హసన్‌పర్తి :** దేవాదుల పంప్‌హౌస్ మోటార్లను ప్రారంభించే కార్యక్రమానికి విచ్చేసిన నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ, ఉమ్మడి వరంగల్ జిల్లా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, మామిడాల యశస్వినిరెడ్డి, హన్మకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, వరంగల్ మేయర్ గుండు సుధారాణిలను పుష్పగుచ్ఛం అందచేసి శాలువాతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా రైతు కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకటరాంనర్సింహారెడ్డి, 65వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అయ్యాల రాంరెడ్డి, హసన్‌పర్తి మండలాధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ తంగళ్లపల్లి తిరుపతి, వర్ధన్నపేట నియోజకవర్గ ఎస్సీ సెల్ ఛైర్మన్ నందిపాక భాస్కర్, సీనియర్ నాయకులు మదన్‌గౌడ్, మీసం సురేందర్‌రెడ్డి, 65వ డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పోలెపాక అశోక్, వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ధర్మసాగర్ రిజర్వాయర్‌లోకి ప్రారంభమైన దేవాదుల మూడో దశ మోటార్లు

ధర్మాసాగర్ మండల కేంద్రంలో ఉన్న ధర్మసాగర్ రిజర్వాయర్ ఫస్ట్ పేస్, సెకండ్ పేస్ ద్వారా గోదవరి జలాలు ధర్మసాగర్ రిజర్వాయర్‌లోకి నింపి ఇతర ప్రాంతాలకు రైతులకు సాగునీరు అవసరాలకు ప్రభుత్వం అందిస్తుంది. ప్యాబేజీ. 3 పంప్‌హౌస్ వద్ద మోటార్లు ప్రారంభమయ్యాయి. దేవన్నపేట దేవాదుల పంప్‌హౌస్, గోదావరి జలాలు ధర్మసాగర్ రిజర్వాయర్ వద్దకు చేరుకున్నాయి.

## ప్రొఫెసర్ ఎవి రమణరావు బంగారు పతకం ప్రదానం



హర్షితకు అభినందనలు

**ప్రజాపక్షం/కాజీపేట :** నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటి) వరంగల్‌లోని మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజినీరింగ్ విభాగం (ఎంఎమ్ఇడీ) మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజినీరింగ్ సెమినార్ హాల్‌లో ఎనిమిదవ ప్రొఫెసర్ ఎ. వి. రమణ రావు స్మారక ఉపన్యాసం, బంగారు పతక ప్రదానోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు.ఆలుమ్ని ప్రారంభించిన ఈ ప్రతిష్టాత్మక బంగారు పతకాన్ని, ప్రొఫెసర్ ఎ. వి. రమణ రావు స్మృతిలో, చివరి సంవత్సరం బి.టెక్ విద్యార్థిని హర్షిత ఆర్.సజ్జాన్‌కు, ఆమె అసాధారణమైన సమగ్ర ప్రదర్శనకు గుర్తింపుగా ప్రదానం చేశారు. ఎన్ఐటి వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుద్ధి ప్రధాన అతిథిగా ఆన్‌లైన్ ద్వారా హాజరయ్యారు. ప్రొఫెసర్ ఎస్. శ్రీనివాస రావు, డీన్ (అంతర్జాతీయ సంబంధాలు,ఆలుమ్ని వ్యవహారాలు), గౌరవ అతిథిగా హాజరయ్యారు. ప్రొఫెసర్ ఎన్. కిషోర్ బాబు, హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్, ఎంఎమ్ఇడీ, ప్రారంభించి సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఉపన్యాసాన్ని డీఆర్‌డీఓకు చెందిన డీఎంఆర్‌ఎల్ (డిఫెన్స్ మెటలర్జికల్ రీసెర్చ్ లేబొరేటరీ) శాస్త్రవేత్త జి. జగన్ రెడ్డి ఇచ్చారు. ఆయన అదిటివ్ మానుఫ్యాక్చరింగ్, మెటలర్జీ, మెటీరియల్స్ ఇంజినీరింగ్‌లో పెరుగుతున్న ప్రాముఖ్యతపై మాట్లాడారు.ఈ ప్రత్యేక సందర్భంలో ప్రముఖ ఆలుమ్ని ఎ.వి.శేషగిరిరావు (ఎంఎమ్ఈ విభాగం, 1964– 1969 బ్యాచ్), కల్నల్ డాక్టర్ రాజు దట్ల కూడా పాల్గొని, తమ జ్ఞాపకాలను, ప్రొఫెసర్ ఎ. వి. రమణరావుతో తమ అనుబంధాన్ని పంచుకున్నారు. డాక్టర్ శుక్లా మండోల్ కృతజ్ఞతా ప్రసంగం అందించడంతో ఈ కార్యక్రమం ముగిసింది. మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అధ్యాపకులు కూడా పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం



### హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

**ప్రజాపక్షం/హనుమకొండ :** హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ పాలకవర్గ సమావేశం గురువారం రెడ్ క్రాస్ భవనంలో సొసైటీ చైర్మన్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హనుమకొండ జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు పి. ప్రావీణ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్‌ను రెడ్ క్రాస్ పాలకవర్గ సభ్యులు పూల మొక్క అందించి సత్కరించారు. అనంతరం కలెక్టర్ రెడ్ క్రాస్ ఆవరణలో నిర్మాణంలో ఉన్న అదనపు భవనాన్ని పరిశీలించి, రెడ్ క్రాస్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో పాల్గొన్నారు. రెడ్‌క్రాస్ ఆదాయం, వ్యయాలను సమీక్షించి, పాలకవర్గ సభ్యులతో చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ, రక్తదాన కార్యక్రమమే కాకుండా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రెడ్‌క్రాస్ పాలకవర్గం అభినందనీయమైన సేవలు అందిస్తున్నదని ప్రశంసించారు. రెడ్‌క్రాస్ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ పాలకవర్గం కలెక్టర్‌ను శాలువా, షీల్డ్ తో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులు డాక్టర్ పి. విజయచందర్‌రెడ్డి (చైర్మన్), పెద్ది వెంకట నారాయణ గౌడ్ (వైస్ చైర్మన్), బొమ్మినేని పాపిరెడ్డి (కోశాధికారి), ఈ. వి. శ్రీనివాస్‌రావు (రాష్ట్ర పాలకవర్గ సభ్యులు), పుల్లూరు వేణు గోపాల్, డాక్టర్ ఎం. శేషు మాధవ్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, డాక్టర్ కె. సుధాకర్ రెడ్డి, డాక్టర్ హెచ్. సంధ్యారాణి, చెన్నమనేని జయశ్రీ, బిళ్ళ రమణా రెడ్డి, బాశెట్టి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మూడో మహాసభ కరపత్రం ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి:** భవన నిర్మాణ కార్మిక సంఘం వరంగల్ జిల్లా మూడో మహాసభలను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు గన్నారపు రమేష్ అన్నారు. గురువారం వరంగల్ శివనగర్‌లోని తమ్మెర భవన్ లో భవన నిర్మాణ కార్మిక సంఘం మూడవ మహాసభ కరపత్రాన్ని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు గన్నారపు రమేష్ పాల్గొని మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారంకై ఏఐటియుసిగా భవన నిర్మాణ కార్మిక సంఘం కృషి చేయాలని కార్మిక శాఖ అధికారులు తక్షణమే పెండింగ్‌లో ఉన్న క్లెమ్లను త్వరగా క్లియర్ చేయాలని, 57 సంవత్సరాలు నిండిన కార్మికులకు రూ. 5000ల పింఛన్లు మంజూరు చేయాలని, డెలివరీ, పెళ్లి, సాధారణ మరణం, ప్రమాదవశాత్తు మరణాలు సంభవిస్తే స్కీములకు ఇచ్చే మొత్తాన్ని పెంచాలన్నారు. అడ్డాలపై కార్మిక శాఖ కార్మికుల కోసం మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని, వేసవికాలం అడ్డాలపై చలివేంద్రాలు, నీడ కోసం పందిర్లు వేయించాలని డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా మూడవ మహాసభను కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి వరంగల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు లక్ష్మణ్, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు కందిక చెన్నకేశవులు, ఏఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి గుండె భద్రి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎండి యాకుబ్, మియాపురం గోవర్ధన చారి, జిల్లా ఆఫీస్ బేరర్స్ ఉప్పుల రవి, నల్లతీగల కుమార్, యోగానంద చారి, పరికరాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ ఇవ్వండి




**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** మార్చి 28న పార్లమెంట్ వద్ద జరిగే ధర్నా విజయవంతం చేయాలని ఎఐటియుసి అనుబంధ తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు గన్నారపు రమేష్ పిలుపునిచ్చారు. పార్లమెంట్ వద్ద జరుగు ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వరంగల్, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల నుండి కార్మికులు వరంగల్ రైల్వే స్టేషన్ నుండి బయలుదేరివెళ్లారు. ఆయన మాట్లాడుతూ అడ్డ మీదికొచ్చి పని కోసం ఎదురుచూసే భవన నిర్మాణ కార్మికుడు రోజు యంత్రం లాగా పని చేస్తూనే ఉండాలి తప్పా పని దొరకకుంటే పస్తులతో కాలం వెళ్ళబుచ్చాల్సిన దుస్థితి భవన నిర్మాణ కార్మికులదనేది నగ్న సత్యం. దేశవ్యాప్తంగా నిర్మాణ రంగంలో 7 కోట్లకు పైచిలుకు మంది భవన నిర్మాణ కార్మికులు పనిచేస్తున్నారని, వీరికి ఎలాంటి చట్టాలు లేవన్నారు. ఎఐటియుసి అనేక సంవత్సరాలుగా ఈ రంగంలో పనిచేస్తున్న కార్మికులను సంఘటిత పరిచి వారి సంక్షేమం కోసం కృషి చేసిందన్నారు. 1975లో ఈ రంగంలో పని చేయుచున్న వృత్తి కార్మికులను ఐక్యం చేసి ఆల్ ఇండియా కాన్ ఫెడరేషన్ ఆఫ్ బిల్డింగ్ కన్ స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్(ఏఐసిబిసిడబ్లూ) ఏర్పాటు చేసి సుదీర్ఘ పోరాటాలు నిర్వహించిన ఫలితంగా 1996లో అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయడం జరిగిందన్నారు. ఎఐటియుసి పోరాటాల ఫలితంగా, ఉమ్మడి రాష్ట్రంలో 2009 ఆగస్టులో సంక్షేమ బోర్డు అమల్లోకి వచ్చిందని, ఉమ్మడిగా ఉన్న సంక్షేమ బోర్డు నుండి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో ప్రత్యేకబోర్డు ఏర్పాటు చేసింది. ప్రస్తుతం బోర్డులో 18 లక్షల వరకు సభ్యులు నమోదయ్యారన్నారు. అదే విధంగా సెస్సు ద్వారా బోర్డుకు రూ. 2500 కోట్లకు పైగా సమకూర్చుకోవడంజరిగిందని, సభ్యుల నమోదు,సభ్యులకు గుర్తి ం పు కార్డులు, రెన్యువల్స్, కార్మికులకు రావలసిన బెన్ఫిట్స్ తో పాటు 60 సంవత్సరాలు దాటిన కార్మికులకు పె న్షన్ నెలకు రూ.3000 ఇవ్వాలన్నారు.రాష్ట్రంలోని 33 జిల్లాలోని నిర్మాణ రంగంలో పనిచేయుచున్న లక్షలాది మంది నిర్మాణ కార్మకులైన తాపి, ఇటుక, సెంట్రింగ్, రాడ్ బెండింగ్, ప్లంబర్, ఎలక్ట్రిషియన్, వడ్రంగి, కాంక్రీట్ మిక్సింగ్, స్లాబ్ మిల్లర్ లిఫ్ట్, పెయింటర్స్, మార్బుల్స్, వెల్డర్స్, రాయి తదితర పనులు చేసేకార్మికులందరినీ సంక్షేమ బోర్డులో సభ్యులుగా నమోదు చేయాల న్నారు. కరీంనగర్ జిల్లా కార్యదర్శి పిట్టల సమ్మయ్య, రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి కడారి రాములు, రాంబాబు, రాజు, రాజయ్య, పోచమ్మ, సౌందర్య, సంకీర్తన, రామక్క, రాజేశ్వరి పాల్గొన్నారు.

## ఎన్‌డిపిఎస్ చట్టంపై అవగాహన ఉండాలి

**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి :** ములుగు జిల్లా కేంద్రం లోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా ఎస్పీ డా।। శబరీష్.పిఆధ్వర్యంలో ములుగు జిల్లా పోలీసు ఆఫీసర్ లకు ఎన్డీపీఎస్ చట్టం పైన అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ఎస్పీ వినతి మేరకు తెలంగాణ ఆంటీ నార్కోటిక్ బ్యూరో యొక్క డైరెక్టర్ సందీప్ శాండిల్య గామమ ఆదేశాల మేరకు డీఎస్పీ నర్సింగరావు ములుగు వచ్చి, చట్టం పైన అవగాహన కలిగించారు. అలాగే చట్ట ప్రకారం అనుసరించవలసిన నియమ నిబంధనలు గురించి క్షుణ్ణంగా వివరించారు. ఈసాక్ష్య అప్లికేషన్ గురించి, విచారణలో దాని ఉపయోగం గురించి వివరించారు. తదనంతరం విచారణ అధికారులు అడిగిన ప్రతి ప్రశ్నకు సమాధానమిచ్చి సందేహ నివృత్తి చేశారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, తాను అడగగానే ములుగు జిల్లాకు డీఎస్పీని పంపిన సందీప్ శాన్డిల్యకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ములుగుకు వచ్చి జిల్లా అధికారులకు చట్టంపై అవగాహన కలిగించిన డీఎస్పీ ని అభినందించారు. అలాగే మన జిల్లా లో ఎన్డీపీఎస్ కేసుల విచారణలో నియమ నిబంధన ల ప్రకారం నడుచుకోవాలని, కేసులలో నేరస్తులకు శిక్ష పడే విధంగా కృషి చేయాలని, ములుగు జిల్లా ను డ్రగ్స్ రహిత జిల్లా గా మార్చాలని అధికారులను ఆదేశించారు.ఏటూరునాగారం ఏఎస్పి శివం ఉపాధ్యాయ ఐపీఎస్, ములుగు డీఎస్పీ రవీందర్, డిసిఆర్బి డిఎస్పి కిషోర్ కుమార్, ఎస్‌బి ఇన్స్పెక్టర్ రమేష్, సిఐ ఏటూరునాగారం శ్రీనివాస్, సీఐ ములుగు శంకర్, సిఐ వెంకటాపురం బి.కుమార్, సిఐ పస్రా రవీందర్,ఎస్ఐములుగు వెంకటేశ్వరరావు, ఎస్ఐ వెంకటాపూర్ సతీష్, ఎస్ఐ పస్రా కమలాకర్, ఎస్ఐ తాడ్వాయి శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

# ఎర్ర చెరువులో పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

### ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి** భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఎర్ర చెరువులోని గుడిసె వాసులకు పట్టాలు ఇవ్వాలని, స్థానిక ప్రజా సమస్యలు పరిష్కరించడంలో జిల్లా అధికారులు, ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జె. వెంకటేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు అన్నారు. గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట భూపాలపల్లి పట్టణంలో ఉన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతు సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల క్రితం జిల్లా కేంద్రంలోని పాత ఎర్ర చెరువులో వేసుకున్న గుడిసెలకు ఇంటి పట్టాలు, మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్‌నగర్ జవహర్ నగర్ సిఆర్ నగర్ బాంబులగడ్డ కారల్ మార్క్స్ కాలనీ లోని ఇళ్లకు పట్టాలు మంజూరు చేయాలని అన్నారు. అదేవిధంగా జిల్లాకు రైల్వే మార్గం, బీఈడీ కాలేజీ, బొగ్గు శుద్ధి కర్మాగారం ఏర్పాటు చేసి జిల్లా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి గత 15 నెలలుగా బిఆర్ఎస్ పాలనపై విమర్శలు చేస్తూ కాలయాపన చేస్తున్నారని అన్నారు. ఎన్నికల హామీలు సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. లేనియెడల రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో తగిన గుణపాఠం తప్పదని వారు హెచ్చరించారు. సింగరేణిలో భూ నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని జెన్కో భూ నిర్వాసితులకు పరిహారం చెల్లించాలన్నారు. దుబ్బపల్లి ని తరలించి ప్రత్యామ్నాయం ఏర్పాట్లు చూపాలని అన్నారు.సిఐటియు నాయకులు చెన్నూరు రమేష్, జిల్లా కమిటీ సభ్యులు గుర్రం దేవేందర్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, గుడిసె వాసులు సిపిఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సెర్ప్ లక్ష్యసాధనకు చర్యలు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** సెర్ప్ లక్ష్యాల సాధనకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయ తీరాజ్ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ తెలిపారు. గురువారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి, సెర్ప్ కార్యక్రమాల పై సెర్ప్ సీఈఓ డి. దివ్య తో కలిసి జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

### మహిళా సంఘాలు కొనుగోలు కేంద్రాలను పెంచాలి

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుత యాసంగి సీజన్‌లో మహిళా సంఘాలకు కొనుగోలు కేంద్రాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని డిఆర్డీఓ ను ఆదేశించారు. 2022–23 సంవత్సరానికి సంబంధించిన పౌర సరఫరాల శాఖ వద్ద పెండింగ్ ఉన్న వివరాలు అందచేయాలని సంబంధిత అదికారులను కోరారు. గన్ని బ్యాగులు రీకన్సిలేషన్ ప్రక్రియ కూడా పూర్తి కావాల్సి ఉందని త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిఆర్డిఓ నరేష్, ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు డా నవీన్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ రాములు, డిఈఓ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

# హెడ్ బౌల్డ్





ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18వ సీజన్ తొలి పోరులో సన్‌రైజర్స్ హైదరాబాద్ మరో విజయంపై కన్నేసింది. తొలి మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ సూపర్ సెంచరీతో చెలరేగడంతో రాజస్థాన్ రాయల్స్‌కు చెక్ పెట్టిన కమిన్స్ సేన మరోసారి పరుగుల విందుతో అభిమానులను అలరించేందుకు సిద్ధమవుతోంది. కాసేపట్లో ఉప్పల్ స్టేడియం వేదికగా లక్నోసూపర్ జెయింట్స్‌తో ఆరెంజ్ ఆర్మీ తలపడుతోంది. టాస్ గెలిచిన లక్నో సారథి రిషభ్ పంత్ బౌలింగ్ తీసుకున్నాడు.
సన్‌రైజర్స్ హైదరాబాద్ మూడో వికెట్ కోల్పోయింది. డేంజరస్ ఓపెనర్ ట్రావిస్ హెడ్(47) బౌల్డ్ అయ్యాడు. హాఫ్ సెంచరీకి చేరువైన అతడిని ప్రిన్స్ యాదవ్ ఇన్‌స్వింగర్‌తో బోల్తా కొట్టించాడు. దాంతో, 76 వద్ద హైదరాబాద్ మూడో వికెట్ పడింది. ప్రస్తుతం నితీశ్ కుమార్ రెడ్డి(23), హెన్రిచ్ క్లాసెన్(14)లు ధాటిగా ఆడుతున్నారు. 10 ఓవర్లకు స్కోర్.. 963. ఉప్పల్ స్టేడియంలో రజాస్థాన్ రాయల్స్‌కు చెక్ పెట్టిన హైదరాబాద్‌కు లక్నో పేసర్ ఆదిలోనే శార్దూల్ ఠాకూర్ పెద్ద షాకిచ్చాడు. తన రెండో ఓవర్.. వరుస బంతుల్లో ఓపెనర్ అభిషేక్ శర్మ(6), గత మ్యాచ్ సెంచరీ హీరో ఇషాన్ కిషన్(0)లను వెనక్కి పంపాడు.
15 పరుగులకే రెండు వికెట్లు పడగా.. ఓపెనర్ ట్రావిస్ హెడ్(47), నితీశ్‌తో కలిసి విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. ఒత్తిడి లోనవ్వకుండా బౌండరీలతో స్కోర్ వేగం పెంచాడు. అయితే.. ప్రిన్స్ ఓవర్లో షాట్‌కు యత్నించి క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఆ తర్వాత క్లాసెన్, నితీశ్‌లు సమయోచితంగా ఆడుతున్నారు.

**సన్‌రైజర్స్ తుది జట్టు :** అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ ఇషాన్ కిషన్, నితిశ్ కుమార్ రెడ్డి, హెన్రిచ్ క్లాసెన్(వికెట్ కీపర్), అనికెత్ వర్మ, అభినవ్ మనోహర్, ప్యాట్ కమిన్స్(కెప్టెన్), సిమర్‌జీత్ సింగ్, హర్షల్ పటేల్, మహ్మద్ షమీ.

**లక్నో తుది జట్టు :** ఎడెన్ మర్‌క్రమ్, మిచెల్ మార్ష్, నికోలస్ పూరన్, రిషభ్ పంత్(వికెట్ కీపర్), డేవిడ్ మిల్లర్, ఆయుష్ బదొని, శార్దూల్ ఠాకూర్, రవి బిష్ణోయ్, అవేశ్ ఖాన్, దిగ్వేశ్ రథీ, ప్రిన్స్ యాదవ్.

## కోహ్లీ, రోహిత్, జడ్డూకు ఝలక్..

### సెంట్రల్ కాంట్రాక్టుల్లో కోత తప్పదా..!



భారత పురుషుల జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ ఆటగాళ్లు క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజాలకు బీసీసీఐ షాక్ ఇవ్వనుంది. ఈ ముగ్గురి సెంట్రల్ కాంట్రాక్ట్‌లో కీలక మార్పులు చేసేందుకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం 'ఏ ప్లస్' కేటగిరీలో ఉన్న వీళ్లను 202425 సీజన్‌లో డిమోట్ చేయడంపై భారత క్రికెట్ నియంత్రణ మండలి సమాలోచనలు చేస్తోంది. సీనియర్లు అయిన కోహ్లీ, రోహిత్, జడ్డూల సెంట్రల్ కాంట్రాక్ట్ కుదింపు విషయం తెరపైకి రావడానికి కారణం ఏంటంటే..?
నిరుడు వెస్టిండీస్ గడ్డపై టీ20 వరల్డ్ కప్ ట్రోఫీ గెలుపొందాక విరాట్, హిట్‌మ్యాన్‌లు పొట్టి ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు. ఆల్‌రౌండర్ అయిన జడేజా సైతం వీళ్లను అనుసరిస్తూ వీడ్కోలుకు ఇంతకంటే మంచి సమయం, సందర్భం ఉండదని.. తాను టీ20లకు అల్విదా పలికాడు. దాంతో, అప్పట్నుంచీ ఈ ముగ్గురు వన్డే, టెస్టు జట్టులో మాత్రమే కొనసాగుతున్నారు.
అయితే.. బీసీసీఐ నిబంధనల ప్రకారం మూడు ఫార్మాట్లలో ఆడేవాళ్లకే ఏ ప్లస్ సెంట్రల్ కాంట్రాక్ట్ వర్తిస్తుంది. అందుకే.. ఈసారి వార్షిక కాంట్రాక్టుల జాబితాలో కోహ్లీ, రోహిత్, జడేజాలను ఏ ప్లస్ నుంచి ఏ గ్రేడ్‌కు మార్చే అవకాశముందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఒకవేళ అదే జరిగితే.. ప్రస్తుతం ఏటా రూ.7 కోట్లు ఆర్జిస్తున్న ఈ త్రిమూర్తులు.. ఇకపై రూ.5 కోట్లు మాత్రమే అందుకోనున్నారు. అయితే.. టీ20, వన్డే, టెస్టులు ఆడుతున్న పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఏ ప్లస్ కేటగిరీని నిలబెట్టుకుంటాడని సమాచారం.



**యశస్వీ, నితీశ్‌కు ప్రమోషన్**
సీనియర్ల సెంట్రల్ కాంట్రాక్ట్ కుదింపుతో పాటు కుర్రాళ్లకు భారీగా ఆదాయం దక్కనుందని బీసీసీఐ వర్గాలు అంటున్నాయి. వన్డే జట్టుకు వైస్ కెప్టెన్‌గా ఎంపికైన శుభ్‌మన్ గిల్‌ను బీ కేటగిరీ నుంచి ఏ విభాగానికి మారనున్నాడు. ఏడాది కాలంగా నిలకడగా రాణిస్తున్న ఓపెనర్ యశస్వీ జైస్వాల్‌కు, అక్షర్ పటేల్‌కు బీ కేటగిరీలో చోటు ఖాయమంటున్నారు క్రికెట్ నిపుణులు. ఐపీఎల్‌లో అదరగొట్టి భారత జట్టులోకి వచ్చిన.. నితీశ్ కుమార్ రెడ్డి, హర్షిత్ రానా, అభిషేక్ శర్మల పేర్లు కూడా సెంట్రల్ కాంట్రాక్ట్‌లో ఉండే వీలుంది. ఇక.. నిరుడు బీసీసీఐ ఆగ్రహానికి గురైన శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్‌లు దేశవాళీలో, ఐపీఎల్ 18వ సీజన్‌లో దంచికొడుతున్నారు. కాబట్టి ఈ ఇద్దరు మళ్లీ కాంట్రాక్ట్ దక్కించుకోవం పక్కా అనిపిస్తోంది. ఇప్పటికే మహిళా క్రికెటర్లకు వార్షిక కాంట్రాక్ట్‌లు ప్రకటించిన విషయం తెలిసిందే.

# ఆ విషయం నన్ను కదిలించింది

## జపాన్ అభిమానిపై ఎన్టీఆర్ పోస్టు



జపాన్ పర్యటనపై ప్రముఖ నటుడు ఎన్టీఆర్ ఆనందం వ్యక్తం చేశారు. ఓ అభిమాని తెలుగు నేర్చుకోవడంపై ప్రత్యేకంగా సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ''నేనెప్పుడు సందర్శించినా జపాన్ నాకు మంచి జ్ఞాపకాలు అందిస్తుంటుంది. కానీ, ఈసారి భిన్నంగా అనిపించింది. 'ఆర్‌ఆర్‌ఆర్' చూసిన తర్వాత తెలుగు నేర్చుకున్నానని ఓ జపనీస్ అభిమాని చెప్పడం నన్ను కదిలించింది. భాషలు, సినీ అభిమానిగా.. విభిన్న సంస్కృతులతోపాటు భాష నేర్చుకునేందుకు సినిమా దోహదపడుతున్నందుకు సంతోషిస్తున్నా. భారతీయ సినిమా ప్రపంచస్థాయిలో అభిమానుల్ని సొంతం చేసుకుంటుందనేందుకు ఇది మరో కారణం'' అని పేర్కొన్నారు. తాను షేర్ చేసిన వీడియోలో.. అభిమానులకు ఆటోగ్రాఫ్ ఇస్తూ కనిపించారు. జపాన్‌లో 'దేవర' ఈ నెల 28న విడుదల కానున్న నేపథ్యంలో ఎన్టీఆర్ మరోసారి అక్కడకు వెళ్లారు. ప్రమోషన్స్‌లో భాగంగా పలువురు అభిమానులను కలిశారు. ఇటీవల.. ఓ అభిమానితో కలిసి ఆ చిత్రంలోని 'ఆయుధ పూజ' పాటకు ఎన్టీఆర్ డ్యాన్స్ చేయడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఎన్టీఆర్‌తోపాటు దర్శకుడు కొరటాల శివ కూడా వెళ్లారు. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో తెరకెక్కిన 'దేవర' గతేడాది విడుదలై, విజయం అందుకుంది. 'దేవర 2' తెరకెక్కించనున్నట్టు ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన స్క్రిప్ట్ పనులు జరుగుతున్నాయి.

# సద్దుమణిగిన వివాదం

## ప్రేక్షకులకు దర్శకుడు క్షమాపణ



విక్రమ్ హీరోగా నటించిన 'వీర ధీర శూరన్ పార్ట్ 2' గురువారం ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉండగా.. అవాంతరాలు ఎదురైన విషయం తెలిసిందే. తాజాగా సమస్య సద్దుమణిగిందని దర్శకుడు ఎస్.యు.అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ రోజు సాయంత్రం నుంచి థియేటర్లలో తమ చిత్రం ప్రేక్షకులకు అందుబాటులో ఉంటుందని చెప్పారు. విడుదల విషయంలో జాప్యం జరిగిందని.. దాని వల్ల సినీ ప్రియులు ఎంతగానో నిరాశకు గురయ్యారని ఆయన తెలిపారు. ఈ క్రమంలోనే ప్రేక్షకులకు క్షమాపణలు చెబుతూ తాజాగా సోషల్‌మీడియాలో పోస్ట్ పెట్టారు. ఓటీటీ హక్కుల విషయంలో ఈ సినిమా న్యాయపరమైన చిక్కులు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ముంబయికి చెందిన బి4యు నిర్మాణసంస్థ దిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. థియేట్రికల్ రిలీజ్ కంటే ముందే ఓటీటీ హక్కులు అమ్ముతామంటూ తమకు ఇచ్చిన ఒప్పందాన్ని చిత్ర నిర్మాతలు పక్కనపెట్టారని ఆ సంస్థ ఆరోపించింది. కోర్టు తీర్పు ప్రకారం సినిమా రిలీజ్ కొన్ని గంటల పాటు వాయిదా పడింది. ఈరోజు ఉదయం మరోసారి వాదోపవాదాలు విన్న న్యాయస్థానం ముంబయికు చెందిన నిర్మాణ సంస్థకు రూ.7 కోట్లు ఇవ్వాలని చిత్ర నిర్మాణ సంస్థను ఆదేశించింది. అనంతరం ఇరు వర్గాల మధ్య సయోధ్య కుదిరింది. దీంతో గురువారం సాయంత్రం విడుదలైంది. విక్రమ్ హీరోగా నటించిన ఈ చిత్రంలో దుషారా విజయన్ కథానాయిక పాత్ర పోషించారు. ఎస్.జె.సూర్య కీలక పాత్రలో నటించారు.

# రీల్



# ఆ విషయం ఆయన నుంచి నేర్చుకున్నా

-శ్రుతి హాసన్

సినీ ప్రియులు ఎదురుచూస్తున్న చిత్రాల్లో రజనీకాంత్ 'కూలీ' ఒకటి. ఈ సినిమాలో నటి శ్రుతిహాసన్ కీలకపాత్రలో కనిపించనున్న విషయం తెలిసిందే. తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రజనీతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం గురించి శ్రుతి మాట్లాడారు. 'కూలీ' లాంటి భారీ బడ్జెట్ సినిమాతో పాటు తన కెరీర్‌లో వైవిధ్యమైన పాత్రల్లో చేసే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉందని శ్రుతి తెలిపారు. ''రజనీకాంత్‌తో కలిసి పనిచేయడం ఎంతో ఆనందంగా ఉంది. అంతపెద్ద స్టార్‌గా ఎలా ఎదిగారో ఆయనతో వర్క్ చేస్తున్నప్పుడు అర్థమైంది. ఆయన క్రమశిక్షణ, అంకితభావం, పాత్ర కోసం కష్టపడేతత్వం ఇలా ఎన్నో విషయాల్లో ఆయన్ని చూసి స్ఫూర్తిపొందాను. వినయంగా ఉంటారు. సెట్‌లో ఎప్పుడూ ఎనర్జిటిక్‌గా పని చేస్తారు. ఆయన సెట్‌లో ఉంటే పాజిటివ్‌గా అనిపిస్తుంది. ఒక వ్యక్తిగానూ ఆయన నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నా. ముఖ్యంగా ఇతరులతో ఎలా వ్యవహరించాలో రజనీకాంత్‌ని చూసి తెలుసుకున్నా. 'కూలీ'లో నా పాత్ర చాలా సింపుల్‌గా ఉంటుంది. అందరికీ కనెక్ట్ అవుతుంది. లోకేశ్ దర్శకత్వంలో వర్క్ చేయడం నా కల. అందుకే ఆయన ఈ సినిమా గురించి చెప్పగానే అంగీకరించాను. ఇలాంటి సినిమాల్లో విభిన్నమైన పాత్రలు ఉంటాయి వాటిని తెరపై చూపించడం నిజంగా సవాలే. లోకేశ్ వాటన్నిటినీ ధైర్యంగా ఎదుర్కొని దీన్ని తెరకెక్కించారు'' అని శ్రుతిహాసన్ తెలిపారు.

# సెక్యులరిజాన్ని కాపాడే బాధ్యత ప్రజాస్వామ్యవాదులదే

## హెచ్‌యుజె ఇఫ్తార్ విందులో మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి




**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** దేశంలో సెక్యులరిజం ప్రమాదంలో పడిందని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజాస్వామ్యవాదులపై ఉన్నదని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా గురువారం హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్టు (హెచ్‌యుజె) ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీనివాస్‌రెడ్డి తోపాటు తెలంగాణ ఫుడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.ఎ ఫహీం హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రార్థన అనంతరం ముస్లిం జర్నలిస్టు సోదరులకు ఖర్జూర ఫలాలు తినిపించారు. ముస్లిం సోదరులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకొనే రంజాన్ మాసం వారికి శుభం కలిగించాలని శ్రీనివాస్‌రెడ్డి ఆకాంక్షించారు. హిందూ ముస్లింలు సోదరభావంతో మెలగాలని ఫుడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ఎంఏ ఫహీం అన్నారు. ఈ కార్యక్రమంలో ఐజెయు స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్, టియూడబ్ల్యూజె రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ, ప్రధానకార్యదర్శి రామ నారాయణ, హెచ్‌యుజె అధ్యక్షుడు శివ శంకర్, కార్యదర్శి షౌకత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# నూతన కమిటీ ఎన్నిక

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన మూడవ మహాసభలు విజయవంతమయ్యాయని, నిజామాబాద్‌లో సభలు నిర్వహించటం అభినందనీయమని అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కార్యక్రమాల నివేదికను ప్రవేశపెట్టగా, 32 మంది చర్చలలో పాల్గొన్నారన్నారు. ఈ నివేదికతో పాటు 14 తీర్మానాలను సభ ఏకగ్రీవంగా ఆమోదించినట్లు వారు చెప్పారు. అయితే ఎన్నికల సందర్భంగా రాష్ట్ర పాలకులు ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేయటానికి ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 8న కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించాలని నూతనంగా ఎన్నికైన కమిటీ పిలుపునిచ్చింది. అంతకుముందు మూడవ రోజు జరిగిన మహాసభలనుద్దేశించి రాష్ట్ర అధ్యక్షులు భాగం హేమంతరావు, ప్రధాన కార్యదర్శి పశ్య పద్మలు మాట్లాడుతూ నిజామాబాద్‌లో రాష్ట్ర రైతు సంఘం మూడవ మహాసభలు గొప్పగా నిర్వహించటం అభినందనీయమన్నారు. ఇలాంటి మహాసభలతో రైతు సమస్యలు చర్చించటంతో పాటు సమస్యల పరిష్కారానికి కృషి జరుగుతుందన్నారు. రైతులు అభివృద్ధి చెందాలంటే రైతు శాస్త్ర సాంకేతికతను ఉపయోగించుకుని వ్యవసాయం చేస్తే అభివృద్ధి సాధ్యమవుతుందని సూచించారు. మహాసభలకు మహిళ రైతులను కూడా హాజరయ్యేలా చేయటం ద్వారా వ్యవసాయంలో లాభాలు సాధ్యమవుతాయని పిలుపునిచ్చారు. రైతులకు ఉపయోగపడే పలు సూచనలు చేశారు. గ్రామ, మండల స్థాయిలలో కమిటీలు ఏర్పాటు చేయాలని, ఆ కమిటీల ద్వారానే సమస్యల పరిష్కారం దొరుకుతుందన్నారు. ప్రతి ఒక్క రైతు వద్దకు వెళ్లి వారితో మాట్లాడితే వారికి ఇలాంటి సమస్యలున్నాయో ? వాటిని ఎలా తీర్చగలమో అర్థమవుతుందని, క్షేత్రస్థాయిలో తిరిగి రైతుల సమస్యలపై ఉద్యమించాలని జిల్లా నాయకులకు సూచించారు.




**మహాసభ ఆమోదించిన తీర్మానాలు:**
రాష్ట్ర రైతు సంఘం 3వ మహాసభలో 14 తీర్మానాలను ఆమోదించామన్నారు. హైదరాబాద్ చుట్టుపక్కల గ్రామాల్లో 111 జిఓను ఎత్తివేయాలని తీర్మానించారు. డాక్టర్ స్వామినాథన్ కమీసన్ సిఫారసులకు చట్టబద్ధత చేయాలని, కౌలు రైతులకు రైతు భరోసా, గుర్తింపుపై కార్డులు ఇవ్వాలని, దేవాదుల ప్రాజెక్టు ద్వారా ములుగు జిల్లాలోని అన్ని గ్రామాలకు సాగునీరు కల్పించాలని, రాష్ట్రంలోని పోడు భూములకు, సాదా బైనామా దరఖాస్తుదారులకు పట్టాలు ఇవ్వాలని, పంటలకు పంటల బీమా పథకం ఏర్పాటు చేసి, రైతులు పండించిన పంటల నిల్వకు గోదాములు నియమించాలని, మహబూబాబాద్ జిల్లాలో ఎర్రచందనం మార్కెట్ సౌకర్యం కల్పించాలి. ములుగు జిల్లాలో నకిలీ విత్తనాలు, జన్యు మార్పిడి విత్తనాలతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం కల్పించాలని తీర్మానించారు. రైతు పండించిన వరిధాన్యాన్ని మార్కెట్‌లో అమ్మడం కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనిధాన్యం ఉత్పత్తిదారుల సంఘంను రాష్ట్రస్థాయిలో ఏర్పాటు చేయటం, భైంసా మండలం రంగారావు ప్రాజెక్టు ద్వారా గూడెం గ్రామంలో 450 కుటుంబాలు ముంపుకు గురవుతున్నారు. వారికి నష్టపరిహారం అందించాలని జనగారం జిల్లాలో సనాబుపేట రిజర్వాయర్ ద్వారా యాదాద్రి జిల్లా గుట్ట గందమల్ల రిజర్వాయర్‌లో పనులు పూర్తి చేయాలని సాగునీరదించాలని ఎస్ఎల్‌బిసి సొరంగం పూర్తి చేయాలని, బ్రహ్మం వెల్లెల్లి ప్రాజెక్టును కృష్ణపురం వరకు కాల్వలు ఏర్పాటు చేయాలి. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి, యాదాద్రి పవర్ ప్లాంట్ భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలి. వాజేడు మండలంలో రైతులకు సమ్మక్క సారక్క బ్యారేజీ ద్వారా సాగునీరందించాలి, మహిళా రైతులకు పాడీ పరిశ్రమ, కోళ్ల పరిశ్రమ పట్టు పరిశ్రమ పుట్టగొడుగుల పరిశ్రమ వీటికి 90 శాతం సబ్సిడీ ఇచ్చి మహిళా రైతులను ప్రోత్సహించాలని ఈ మహాసభ తీర్మానించారు. 55 సంవత్సరాలు నిండిన రైతులకు 10 వేల పెన్షన్ అందించి ఆరోగ్య కార్డులు ఇవ్వాలని ఎకరానికి 2 లక్షల పంట రుణం ఇవ్వాలని తీర్మానాలు చేయటం జరిగింది.
కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి సుధాకర్, ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య, ఎఐఎస్ఎఫ్ రఘురాం వివిధ జిల్లాల నాయకులు రైతులు పాల్గొన్నారు.

# మాట్లాడనివ్వరా?

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ ఉప నాయకుడు గౌరవ్ గొగోయ్ చెప్పారు. ఆర్ఎస్‌పి, శివసేన (యుబిటి)తో సహా అనేక పార్టీలు సంతకం చేసిన లేఖను స్పీకర్‌కు సమర్పించామన్నారు. పాలకపక్షం సభ సంప్రదాయాలు, నియమాలు, సంస్కృతిని ఎలా ఉల్లంఘిస్తోందనే దానిపై స్పీకర్ ముందు తమ సమష్టి ఆందోళన, నిరాశను తెలియజేసినట్లు గొగోయ్ స్పీకర్‌తో భేటీ అనంతరం మీడియాకు తెలిపారు. ప్రధానంగా బుధవాం ప్రతిపక్షనేత పట్ల స్పీకర్ చేసిన వ్యాఖ్యలపైనే బిర్లాను కలిసినట్లు ఆయన చెప్పారు. రూల్ 349 గురించి ప్రస్తావించి సభ్యులు, ప్రతిపక్షనేత దీనిని అనుసరించాలన్నారు. అయితే ఏ నిర్దిష్ట ఘటన గురించి స్పీకర్ వ్యాఖ్యలు చేశారో స్పష్టంగా లేదన్నారు. స్పీకర్ వ్యాఖ్యలపై రాజకీయం ప్రచారం జరుగుతోందన్నారు. ఆయన వ్యాఖ్యలు బయట ఎలా రాజకీయం చేస్తున్నారో స్పీకర్‌కు వివరించామని గొగోయ్ అన్నారు. ప్రతిపక్షనేత సభలో లేచి నిలబడినప్పుడు సభను వాయిదా వేశారని, ఆయన పేరు ప్రస్తావించబడినప్పటికీ మాట్లాడటానికి అనుమతించ లేదన్నారు. యావద్ దేశం ఆ ఘటనను వీక్షించిందన్నారు. ప్రతిపక్షనేత పదవి ఒక రాజ్యాంగ పదవి, ఆయన గురించి వ్యాఖ్యలు చేశారు కానీ ఆయనను మాట్లాడటానికి అనుమతించలేదు, స్పీకర్ ఏ ఘటన గురించి ప్రస్తావిస్తున్నారో స్పష్టత లేదు, కానీ బిజెపి ఐటి సెల్ ఈ అంశాన్ని రాజకీయం చేస్తోందన్నారు. ఇది చాలా బాధాకరమన్నారు. గొగోయ్, డిఎంకెకు చెందిన ఎ రాజా, ఎస్‌పికి చెందిన ధర్మేంద్ర యాదవ్, టిఎంసికి చెందిన కైలాన్ బెనర్జీ, ఎన్‌సిపి (ఎస్‌పి) సుప్రియా సులే స్పీకర్‌ను కలిసిన ఎంపిలలో ఉన్నారని వర్గాలు తెలిపాయి. 'సంప్రదాయ ప్రకారం, ఎల్‌ఒఇ లేచి నిలబడినప్పుడు, వారికి సాధారణంగా మాట్లాడటానికి అనుమతి ఉంటుంది. ఇది శక్తిధర్, కౌల్ పార్లమెంటరీ పద్ధతుల్లో నమోదు చేశారు. అయితే, ప్రస్తుత ప్రభుత్వం అధికారికంగా విజ్ఞప్తి చేసినప్పటికి కూడా ఎల్ఒపికి మాట్లాడే అవకాశాన్ని పదేపదే నిరాకరిస్తోంది' అని ప్రతిపక్ష నాయకులు లేఖలో చెప్పినట్లు వర్గాలు పేర్కొన్నాయి. కాగా, లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్‌ను నియామించంకపోవడాన్ని కూడా ప్రతిపక్ష పార్టీలు లేవనెత్తాయి. లోక్‌సభలో స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నికను తప్పనిసరి చేసే రాజ్యాంగంలోని ఆర్టికల్ 93ని ఉటంకిస్తూ, ప్రతిపక్ష నాయకుడు బిర్లాకు రాసిన లేఖలో డిప్యూటీ స్పీకర్ పదవి 2019 నుండి ఖాళీగా ఉందని, గతంలో ఎప్పుడూ ఈ విధంగా జరగలేదని పేర్కొన్నారు. సభ తటస్థతను, పనితీరును కాపాడుకోవడంలో డిప్యూటీ స్పీకర్ కీలక పాత్ర పోషిస్తారని, అయినప్పటికీ ప్రభుత్వం ఎన్నికలను నిర్వహించడంలో విఫలమైందని విమర్శించారు. బిజినెస్ అడ్వైజరీ కమిటీ నిర్ణయాలు సాంప్రదాయకంగా కట్టుబడి ఉండకపోయినా, ముందస్తు సంప్రదింపులు లేదా సమాచారం లేకుండా ప్రభుత్వం ఏకపక్షంగా సభలో వ్యవహారాలను ప్రవేశపెడుతుందని ప్రతిపక్ష నాయకులు ఆరోపించారు. గత వారం సభలో ప్రధానమంత్రి చేసిన ప్రకటనను షెడ్యూల్ చేయలేదని, ముందుగా తెలియజేయలేదని, ఇది పార్లమెంటరీ క్రమశిక్షణను అపహాస్యం చేస్తుందని నాయకులు స్పీకర్‌కు తెలియజేశారు. వాయిదా తీర్మానం ఇచ్చినప్పుడు స్పీకర్ ఎంపిల పేర్లను ప్రస్తావించి, జీరో అవర్ సమయంలో జాతీయ ప్రాముఖ్యత కలిగిన అంశాలను చర్చించేందుకు అనుమతించేవారు. అయితే ఇప్పుడు వాయిదా తీర్మానాలను ఇప్పుడు నిర్లక్ష్యం చేస్తూ వాటిని తిరస్కరిస్తున్నారు. దీనివల్ల ప్రతిపక్ష ఎంపిలు అత్యవసర ప్రజా సమస్యలను లేవనెత్తకుండా పరిమితం చేస్తున్నారు' అని ప్రతిపక్ష పార్టీలు తెలిపాయి. మంత్రిత్వ సభ్యులు కాని ఎంపిలకు చట్టాలను ప్రతిపాదించే అవకాశం కల్పించే ప్రైవేట్ సభ్యుల బిల్లులు, తీర్మానాలకు చర్చకు తగినంత సమయం ఇవ్వడం లేదని కూడా వారు పేర్కొన్నారు. అదే విధంగా బడ్జెట్, డిమాండ్ ఫర్ గ్రాంట్స్ చర్చలలో కీలక మంత్రిత్వ శాఖలను మినహాయించడం, 193 నియమం కింద చర్చ చేపట్టకపోవడంపై కూడా ప్రతినిధి బృందం లేవనెత్తింది. 'ప్రతిపక్ష ఎంపిలు ఆర్డర్ పాయింట్‌ను లేవనెత్తినప్పుడల్లా, వారి మైక్రోఫోన్‌లను ఆపివేస్తారు. తద్వారా వారు తమ ఆందోళనలను వ్యక్తం చేయకుండా అడ్డుకుంటున్నారు. అయితే మంత్రులు లేదా అధికార పార్టీ ఎంపిలు మాట్లాడాలనుకున్నప్పుడల్లా వారికి మాత్రం వెంటనే అనుమతిస్తారు. ఈ ఏకపక్ష నియంత్రణ ప్రజాస్వామ్య చర్చ స్ఫూర్తిని దెబ్బతీస్తుంది' అని వారు లేఖలో చెప్పినట్లు ప్రస్తావించారు.

# నిబంధనలకు పాతర

(మొదటి పేజీ తరువాయి)

కుప్పకూలిన భవన శిథిలాల్లో నలిగిపోయిన ప్రాణాలు కోల్పోయారు. ఆరు అంతస్తుల భవనం ఒక్క సారిగా పేకమేడలా కూలిపోవడంతో అక్కడ పరిస్థితి భయానకంగా మారింది. భవన నిర్మాణం జరుగుతున్న క్రమంలో స్థానిక గ్రామ పంచాయితీ అధికారులు పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ వాటిని ఏ మాత్రం పట్టించుకోని నిర్మాణ దారుడు ఇష్టాను సారంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. గత కొన్ని రోజుల క్రితం గ్రామపంచాయితీ ఇఓ భవనం పై వరకు వెళ్లి పనులు నిలుపుదల చేయాలని హెచ్చరించినప్పటికీ నిర్మాణానికి ఎలాంటి ఆంటకం కలిగించవద్దని కొందరు అధికారులకు తెలిపినట్లు సమాచారం. వెరసి కార్మికులు నిండు ప్రాణాలు బలైపోయాయి. ఘటనా స్థలంలో సహాయకచర్యలు కొనసాగుతున్నాయి. శిధిలాలను ప్రొక్లైన్ల సహకారంతో తొలగిస్తున్నారు. గురువారం తెల్లవారుఝామున కొన ఊపిరితో ఉన్న కామేశ్వర రావు(48) అనే కార్మికున్ని వెలికి తీశారు. బయటకు తీసి హుటాహుటిన ఆక్సిజన్ ఎక్కించి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆ కార్మికుడు మృత్యు వాత పడ్డాడు. మృతిని వృద్ధురాలైన తల్లి ఉంది. తనకు దిక్కుగా ఉన్న ఒక్కగానొక్క కుమారున్ని కోల్పోయిన తల్లి రోదిస్తున్న తీరు పలువురుని కంటతడి పెట్టించింది. ఇంకా శిథిలాల క్రింద ఉపేందర్ అనే మరో సుతారీ మేస్త్రి ఉన్నాడు. డాగ్ స్క్వాడ్ లోనికి వెళ్లేందుకు మార్గం ఏర్పాటు చేయడంతో ఆ డాగ్ లోనికి వెళ్లి నిశబ్ధంగా తిరిగి వచ్చింది. కుప్పకూలక ముందు పనిజరిగే సమయంలో ఇద్దరు మేస్త్రీలతో పాటు మరో నలుగురు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన గిరిజన కూలీలు ఉన్నట్లు చెబుతున్నారు. వారు ఉంటే మృతుల సంఖ్య ఆరుకు పెరిగే అవకాశం ఉంది. మరో కార్మికుడు ఉపేందర్ కుటుంబ సభ్యులు ఆయన సజీవంగా బయటకు రావాలని వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ఉపేందర్ కుటుంబీకులు, బంధు వర్గాలు పెద్ద ఎత్తున సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. కాయాకష్టం చేసుకుని భార్య పిల్లలను పోషించుకుంటున్నాడని, పిల్లలు చదువుతున్నారని, ఇప్పుడు ఆ పిల్లలు,భార్య బ్రతుకులు రోడ్డున పడ్డాయని రోదిస్తున్నారు. పలు రాజకీయ పార్టీల నాయకులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదారుస్తున్నారు.

**భారీగా బంగారం, నగదు లభ్యం**
శిధిలాలను తొలగించే క్రమంలో భారీగా బంగారు, వెండి ఆభరణాలతో పాటు పెద్ద ఎత్తన నగదు లభ్యమైంది. భవన క్రింది గదిలో ఉన్న బీరువాలో ఆభరణలు, నగదు ఉన్నాయి. వాటిని బయటకు తీసిన పోలీసులు పంచనామా నిర్వహించి వెంటనే ట్రాక్టర్‌లో వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇంత పెద్ద మొత్తంలో బంగారం, నగదు లభ్యం కావడంతో అంతా అశ్చర్యానికి గురవుతున్నారు. ఇంకా వెరికి తీస్తే మరి కొంత లభ్యమయ్యే అవకాశం ఉందని అంటున్నారు. ట్రస్ట్ పేరిట పెద్ద ఎత్తున నగదును వసూళ్లు చేశారని, బంగారు ఆభరణాలు కూడబెట్టారని ప్రజలు అంటున్నారు.

**కుటుంబాలను ఆదుకోవాలి - సాబీర్ పాషా**
ఆరంతస్తుల భవనం కుప్పకూలి కార్మికులు మృతి చెందారని, ఆ కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా డిమాండ్ చేశారు. ప్రమాదానికి గల కారణాలపై తగిన విచారణ జరిపించి. ఒక్కొక్క కుటుంబానికి రూ.50 లక్షల పరిహారాన్ని ఇవ్వాలన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com